అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 13-05-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 83 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

పిడుగుపాటుకు ముగ్గురు మృతి

- మెదక్ జిల్లాలో తడుస్తున్న ధాన్యానికి టార్పాలిన్ కప్పుతుండగా తాతా మనుమడు మృతి, ఆదిలాబాద్‌లో ఒకరు..



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట/ఆదిలాబాద్

ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో పిడుగులు పడి ముగ్గురు మృతి చెందిన ఘటన మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆదివారం జరిగింది. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం రామోజీపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రమైన ఐకేపీ సెంటర్‌లో ఆరబోసిన వరి ధాన్యం వర్షానికి తడుస్తోందని ఆదివారం సాయంత్రం తాటిపత్రులు కప్పడానికి రైతు పాల్వంచ శ్రీరాములు(50), అతని మనమడు విశాల్ (11) వెళ్లారు. వరికుప్పపై ...11లో

తడిసిన ధాన్యం కొనండి

- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు 11లో..





యూపీలో ఇండియాకే అత్యధిక స్థానాలు

- ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్

వివరాలు 11లో

నేడే పోలింగ్

ఉదయం ఏడు గంటల నుంచి ప్రారంభం

- 17 లోక్‌సభ, కంటోన్మెంట్ అసెంబ్లీకి ఎన్నికలు
- లోక్‌సభ బరిలో 525 మంది, కంటోన్మెంట్ బరిలో 15 మంది
- రాష్ట్రంలో 3,32,32,318 మంది ఓటర్లు
- నిర్దేశిత సమయానికి క్యూలో ఉన్న వారికే ఓటేసేందుకు అనుమతి
- పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఈసీ పకడ్బందీ చర్యలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభ నాలుగో విడత ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలోని 17 నియోజకవర్గాలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీకి నేడు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం రాత్రికల్లా ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఉదయం 5.30 గంటలకు పోలింగ్ అధికారులు(పీవో) మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఏజెంట్లనుంచి ఏవైనా అభ్యంతరాలుంటే వాటిని నివృత్తి చేసి ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభిస్తారు. సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన 13 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు, మిగతా ...11లో

నాలుగో విడతలో...

10 రాష్ట్రాలు, 96 లోక్‌సభ స్థానాలు



- ఏపీలో 175, ఒడిశాలో 28 అసెంబ్లీ స్థానాలు
- 17.7 కోట్ల మంది ఓటర్లు
- 1.92 లక్షల పోలింగ్ కేంద్రాలు

వివరాలు 10లో

సీపీఐ(ఎం)వినతికి స్పందించిన ఈసీ

వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఆదేశాలు

- కార్మికులకు నైట్‌షిఫ్టు డ్యూటీలు వేయొద్దు : మెమో జారీ చేసిన కార్మిక శాఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పోలింగ్ సందర్భంగా సోమవారం నాడు డే షిఫ్టు, నైట్ షిఫ్టు అనే తేడా లేకుండా కార్మికులందరికీ వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలన్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాసిన లేఖకు ఎన్నికల సంఘం స్పందించింది. అందరికీ వేతనంతో కూడిన సెలవును అమలు చేయాల్సిందేనని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కార్మిక శాఖ ప్రధాన కార్యదర్శి ఐ.రాణి కుముదిని మెమో విడుదల చేశారు. కంపెనీలు ఏవైనా సోమవారం సాయంత్రం తర్వాత నైట్ షిఫ్టులు కొనసాగించినట్టు తమ దృష్టికొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ ఆదేశాలు జారీ చేసినందుకు ఈసీకి, కార్మికశాఖకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ.నర్సింహారావు ధన్యవాదాలు తెలిపారు. నైట్‌షిఫ్టులో కార్మికులతో పనిచేయించుకునేందుకు కార్మిక శాఖ అనుమతులు ఇవ్వడంపై ఆదివారం ...11లో

మొన్న రాహుల్.. ఇప్పుడు ఖర్గే

ఖర్గే హెలికాప్టర్‌లో ఎన్నికల అధికారుల తనిఖీలు

- తప్పుపట్టిన కాంగ్రెస్



ఇటావా : కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రయాణించాల్సిన హెలికాప్టర్‌ను ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. ఇటీవల కేరళలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెలిక్యాప్టర్‌ను కూడా ఎన్నికల అధికారులు ఇలాగే తనిఖీలు చేశారని కాంగ్రెస్ పార్టీ గుర్తు చేసింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ నేతలను వదిలేస్తూ విపక్ష పార్టీ నేతలను ఎన్నికల అధికారులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించింది. ఎన్‌డీఏ కూటమిలోని అగ్రనేతలు ప్రయాణిస్తున్న హెలికాప్టర్లను కూడా ఇలాగే తనిఖీ చేస్తున్నారా..? అంటూ ప్రశ్నించింది. ఈ విషయంపై ఎన్నికల సంఘం క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేసింది.

రిలాక్స్..



- ఎన్నికల హడావుడిలో ఆటవిడుపు
- హెచ్‌సీయూలో ఫుట్‌బాల్ ఆడిన సీఎం రేవంత్

నవతెలంగాణ-మియాపూర్

కొద్దిరోజులుగా ఎన్నికల ప్రచారంతో బిజీబిజీగా గడిపిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆదివారం ఉదయం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా గోల్ వేసేందుకు విద్యార్థులతో పోటీ పడ్డారు. ఆట మధ్యలో షూ పాడైపోతే షూ లేకుండానే ఆడారు. అంతకుముందు సీఎంకు విద్యార్థులకు స్వాగతం పలికారు. ఇరు జట్ల ఆటగాళ్లను సీఎం పరిచయం చేసుకున్నారు. సీఎంతోపాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, టీఎంఆర్ ఐఈఎస్ ప్రెసిడెంట్ ఫహీం ఖురేషీ, హెచ్‌సీయూ ఎన్ఎస్‌యూఐ యూనిట్, హెచ్‌సీయూ విద్యార్థులు ఫుట్‌బాల్ ఆడారు. ఈ ఫుట్‌బాల్ మ్యాచ్‌కి సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర్ వేణుగోపాల్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్ ఎంఏ ఫహీం, టీ శాట్ సీఈఓ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు హాజరయ్యారు.

ఆప్ దస్ గ్యారంటీస్...

- దేశవ్యాప్తంగా ఉచిత విద్య, వైద్యం, కరెంట్
- మ్యానిఫెస్టో ప్రకటించిన ఆప్ అధినేత కేజ్రీవాల్



న్యూఢిల్లీ : మద్యం స్కాం కేసులో జైలు నుంచి బెయిల్‌పై బయటికి వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఈ క్రమంలోనే 10 గ్యారెంటీలను ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఉచితంగా విద్యుత్, విద్య, వైద్యం అందిస్తామని ప్రకటించారు. ఇంతేకాకుండా ఢిల్లీకి పూర్తిస్థాయి రాష్ట్రహోదా, దేశవ్యాప్తంగా ఉద్యోగాల కల్పన, అగ్నివీర్ స్కీం రద్దు, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడం, సైన్యానికి పూర్తి స్వేచ్ఛ, అవినీతిపై యుద్ధం, జీఎస్టీ మరింత సరళతరం చేయడం సహా కీలక హామీలను వెల్లడించారు. ఇండియా బ్లాక్ అధికారంలోకి వస్తే ఈ గ్యారెంటీలన్నింటినీ అమలు చేస్తామని స్పష్టం చేశారు.

కేజ్రీవాల్ ప్రకటించిన గ్యారెంటీలివే..

- ఇండియా బ్లాక్ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- పయివేట్ పాఠశాలలతో పోల్చితే నాణ్యమైన విద్యుత్ అందించేలా ప్రభుత్వ
- ప్రయివేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతుల కల్పన, ఉచిత వైద్యం
- చైనా ఆక్రమించిన మన దేశ భూభాగాన్ని తిరిగి స్వాధీనంతో పాటు భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛ
- మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అగ్నివీర్ పథకం రద్దు .
- దేశంలోని రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర. వ్యవసాయంలో స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలు
- పస్తుతం కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్న ఢిల్లీకి పూర్తి స్థాయి రాష్ట్ర హోదా కల్పించడం.
- పతీ ఏడాది దేశవ్యాప్తంగా 2 కోట్ల మందికి ఉద్యోగాలు.
- దేశాన్ని అవినీతి రహితంగా మార్చడంతో పాటు అవినీతికి పాల్పడే వాళ్లపై కఠినంగా వ్యవహరించడం.
- జీఎస్టీని సరళతరం చేయడం వంటి హామీలు

ఆప్ ఎమ్మెల్యేలతో కేజ్రీవాల్ భేటీ

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఈ భేటీకి ఓఖ్లా ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్ గైర్హాజరయ్యారు. కాగా, నోయిడాలోని పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి చేసి బెదిరించిన ఆరోపణలపై ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్, ఆయన కుమారుడు అనస్ అహ్మద్‌తోపాటు పలువురు వ్యక్తులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో వారిద్దరూ అజ్ఞాతంలో ఉన్నారని నోయిడా పోలీసులు తెలిపారు. వారి ఫోన్లు కూడా స్విచ్ ఆఫ్‌లో ఉన్నాయని చెప్పారు.మరోవైపు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన పార్టీ ఎమ్మెల్యేలనుద్దేశించి మాట్లాడారు. మార్చి 21న తన అరెస్టు తర్వాత ఢిల్లీ, పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వాలను పడగొట్టాలని బీజేపీ యోచించిందని తెలిపారు. అయితే ఆ ప్రణాళిక పని చేయలేదని, తన అరెస్టు తర్వాత పార్టీ మరింత ఐక్యమైందని అన్నారు.

పెన్‌డ్రైవ్‌లో గవర్నర్ గుట్టు ..

- ఒర్జినల్ వీడియో నా దగ్గర ఉన్నది..
- ఎడిట్ చేసిన వీడియోను గవర్నర్ చూపించారు
- మహిళపై లైంగిక వేధింపుల వ్యవహారంలో సీఎం మమత వ్యాఖ్యలు




కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ. ఆనందబోస్‌పై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి విమర్శలతో విరుచుకుపడ్డారు. మహిళపై లైంగిక వేధింపుల వ్యవహారంలో.. ఆనందబోస్ ఎడిట్ చేసిన వీడియోను సాధారణ పౌరులకు చూపించారని, ఒర్జినల్ వీడియోలతో కూడిన పెన్‌డ్రైవ్ తన దగ్గర ఉందని పేర్కొన్నారు. వాటిలో దిగ్భ్రాంతికర దృశ్యాలు ఉన్నాయని చెప్పారు. గవర్నర్ పదవికి ఆనందబోస్ ఎందుకు రాజీనామా చేయనక్కర్లేదో స్వయంగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తృణమూల్ కాంగ్రెస్ తరపున హుగ్లీ లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న రచనా బెనర్జీకి మద్దతుగా సప్తగ్రామ్‌లో ప్రచార ర్యాలీలో మమత పాల్గొని ప్రసంగించారు. ఆనందబోస్ గవర్నర్‌గా ఉన్నంతకాలం తాను రాజ్‌భవన్‌కు వెళ్లబోనని స్పష్టం చేశారు. తప్పనిసరైతే వీధుల్లోనే ఆయన్ను కలుస్తానన్నారు. ఆనందబోస్ పక్కన కూర్చోవడం కూడా పాపమేనంటూ ఘాటుగా విమర్శించారు. "దీదీగిరిని సహించబోనని గవర్నర్ అంటున్నారు. కానీ ఆయన దాదాగిరీ ఇక పనిచేయదు. మహిళలపై వేధింపులకు పాల్పడిన ఆయన పదవి నుంచి దిగిపోవాలి" అని మమత పేర్కొన్నారు. మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు చెబుతున్న మే 2వ తేదీకి సంబంధించిన సీసీ ఫుటేజీని ఆనందబోస్ సాధారణ పౌరులకు చూపించిన సంగతి తెలిసిందే. దీనిపై బాధితురాలు అభ్యంతరం వ్యక్తం చేశారు. వీడియోలో తన ముఖాన్ని బ్లర్ చేయలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై రాష్ట్రపతికి లేఖ రాయనున్నట్లు తెలిపారు.

ఇండోనేషియాలో భారీ వరదలు .. 28 మంది మృతి

జకార్తా : ఇండోనేషియాను భారీ వరదలు ముంచెత్తాయి. కొండచరియలు విరిగిపడటంతో 28 మంది మరణించారు. నలుగురు గల్లంతయ్యారని ఆదివారం అధికారులు తెలిపారు. ఇండోనేషియాలోని సుమత్రా ప్రావిన్స్‌లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరదలు ముంచెత్తడంతో 28 మంది మృతి చెందారని ప్రావిన్షియల్ రెస్క్యూటీమ్ చీఫ్ అబ్దుల్ మాలిక్ పేర్కొన్నారు. గల్లంతైన నలుగురి కోసం గాలిస్తున్నామని అన్నారు. వరదలతో తన్హ్‌దతార్ రీజెన్సీకి బురద కొట్టుకొచ్చిందని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (బీఎన్‌బీపీ) ఓ ప్రకటనలో తెలిపింది. ఉప జిల్లాలను ప్రభావితం చేసిందని, 84 హౌసింగ్ యూనిట్లు, 16 వంతెనలు ప్రభావితమ య్యాయని వెల్లడించింది. రహదారిని పునరుద్ధరించేందుకు భారీ యంత్రాలను మోహరించినట్లు అధికారులు తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- నగర యువ నాయకులు పందాల సంపత్ గౌడ్




నవతెలంగాణ-హైదరాబాద్

సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలు ఈ నెల 13న సోమవారం జరిగే లోక్‌సభ ఎన్నికల్లో సమర్థవంతంగా తమ ఓటు హక్కును వినియోగిం చుకోవాలని నగర యువ నాయకులు పందాల సంపత్‌గౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మంచి అభ్యర్థిని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భారత్ పేద దేశమే

- 140 కోట్ల జనాభా కారణంగానే మనది పెద్ద ఆర్థిక వ్యవస్థ
- అంతే తప్పితే ఆనందించటానికి ఏమీ లేదు : ఆర్బీఐ మాజీ గవర్నర్ డి. సుబ్బారావు



మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా పరిస్థితి మారదు

న్యూఢిల్లీ : గత 20 ఏండ్ల పాలనను చూస్తే రెండు ప్రధాన జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు చెరో పదేండ్లు పాలించాయి. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ రెండు పార్టీలూ దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రధానంగా దృష్టి సారిస్తామని చెప్తున్నాయి. ఇక మోడీ సర్కారు అయితే తమ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే ఐదో స్థానానికి చేరిందని చెప్పుకుంటున్నది. ప్రస్తుతం భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా ఉన్నది. మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వస్తే భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా తీర్చి దిద్దుతానని మోడీ చెప్తున్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్ మాత్రం మోడీ తన మాటలతో ప్రజలను నమ్మించే యత్నం చేస్తున్నారని ఆరోపిస్తున్నది. కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి చిదంబరం మాత్రం అలా చేయడం గణాంకాల వరకే పరిమితంగానీ, ఆచరణ సాధ్యం కాని విషయమని అన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) ప్రకారం.. కొంతకాలంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్ ఉన్నది. 2023 ఆర్థిక సంవత్సరంలో దాని వృద్ధి రేటు 7.2 శాతంగా ఉన్నది. ఇది జీ20 దేశాలలో రెండో అత్యధికం. అభివృద్ధి చెందుతున్న మార్కెట్ ఆర్థిక వ్యవస్థల సగటు కంటే దాదాపు రెండింతలు.

ప్రధాని మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్‌ల ప్రకారం.. వచ్చే నెలలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉన్నదనీ, ఒక సంవత్సరం లేదా అంతకంటే ఎక్కువ కాలంలో భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అంచనా. "మోడీ ప్రభుత్వం మళ్లీ మూడోసారి ఏర్పాటవుతుంది. ప్రధాని ప్రకటన ప్రకారం వచ్చే ఏడాది లేదా మరి కొంత కాలంలో ఐదో స్థానం నుంచి భారత ఆర్థిక వ్యవస్థ మూడో స్థానానికి చేరుకుంటుంది" అని రాంచీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె చెప్పారు. వచ్చే మూడేండ్లలో(2027 నాటికి) భారత్.. జపాన్, జర్మనీలను అధిగమించి మూడో స్థానాన్ని కైవసం చేసుకుంటుందని తెలిపారు. అయితే, గత నవంబర్‌లో ఆమె చేసిన మునుపటి అంచనాతో ఈ లక్ష్యం విరుద్ధంగా ఉన్నదని నిపుణులు అంటున్నారు.గత నెలలో విడుదల చేసిన ఐఎంఎఫ్ ప్రపంచ ఆర్థిక నివేదిక ప్రకారం.. భారత్ ప్రస్తుతం 2023లో 3.6 ట్రిలియన్ డాలర్ల ఉత్పత్తితో ఐదో స్థానంలో ఉన్నది. జర్మనీ, జపాన్ వరుసగా 4.45 ట్రిలియన్ డాలర్, 4.21 ట్రిలియన్ డాలర్లతో మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నాయి. అయితే, 2024లో భారత జాతీయ ఉత్పత్తి 3.9 ట్రిలియన్ డాలర్లకు పెరగవచ్చు. అయితే, జపాన్ ర్యాంకింగ్ 4.1 ట్రిలియన్ డాలర్లకు తగ్గిపోయినప్పటికీ.. భారత్ ర్యాంకింగ్ స్థిరంగా ఉంటుంది. వాస్తవానికి, 2025లో భారత్..జపాన్‌ను అధిగమించి 4.4 ట్రిలియన్ డాలర్ల ఉత్పత్తితో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంటుందనీ, జపాన్ ఆర్థిక వ్యవస్థ 4.3 ట్రిలియన్ డాలర్లతో ఐదో స్థానంలో స్థిరపడుతుంది.మూడో ఆర్థిక వ్యవస్థకు చేరాలంటే అంత సులువు కాదన్న విషయాన్ని చిదంబరంతో పాటు ఆర్థిక నిపుణులూ వినిపిస్తున్నారు. 2025 నాటికి ఉంటుందని సీతారామన్



చెప్తున్నప్పటికీ అదంత సులువేం కాదని అంటున్నారు. ఐఎంఎఫ్.. భారత్.. జర్మనీని అధిగమించి 2027 నాటికి మూడో స్థానానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నది. అయితే కొంతమంది ఆర్థికవేత్తలు దీనిని 2029 తర్వాత మాత్రమే సాధించగలమని అంచనా వేస్తున్నారు.అయితే, ఆర్థిక వ్యవస్థకు సంబంధించి గణాంకాలు ఎలా ఉన్నా.. దేశంలో మాత్రం పేద, మధ్య తరగతి ఆర్థిక స్థితిగతులు మాత్రం మారటం లేదని నిపుణులు అంటున్నారు. ఇప్పటికీ, దేశంలోని అనేక మంది ప్రజలకు తినటానికి సరైన తిండి దొరకటం లేదనీ, ఉండటానికి నివాసమూ లేదని చెప్తున్నారు. ఆర్బీఐ మాజీ గవర్నర్ డి. సుబ్బారావు ప్రకారం.. మనం ఎప్పుడు మూడో స్థానానికి చేరుకున్నా, ఆనందించటానికి మాత్రం ఎలాంటి కారణమూ లేదు. ఎందుకంటే, భారత్ పేద దేశంగా మిగిలిపోయే అవకాశం ఉన్నది. "నా అభిప్రాయం ప్రకారం.. భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారటం సాధ్యమే. కానీ ఇది వేడుక కాదు. ఎందుకంటే.. 140 కోట్ల జనాభా ఉన్నందున మనం పెద్ద ఆర్థిక వ్యవస్థ. ప్రజలు ఉత్పత్తికి కారకులు. కాబట్టి మనం పెద్ద ఆర్థిక వ్యవస్థ ఎందుకంటే మనకు ప్రజలు ఉన్నారు. కానీ మనది ఇప్పటికీ పేద దేశమే.." అని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

నిన్ను నరహంతకుడిగానే చరిత్ర చూస్తుంది



– గుస్తావో పెట్రో

గాజాలో పెద్దయెత్తున మారణహోమం సృష్టిస్తున్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుపై కొలంబియా తొలి వామపక్ష అధ్యక్షుడు గుస్తావో పెట్రో తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'మిస్టర నెతన్యాహు! వేలాది మంది అమాయక పౌరులపై బాంబులేసి చంపడం హీరోయిజం అనిపించుకోదు. చరిత్ర నిన్ను నరహంతకుడిగానే చూస్తుంది. ఐరోపాలో లక్షలాది మందిని చంపిన ఫాసిస్టు హిట్లర్‌కు, మీకు తేడా లేదు' అని పెట్రో విమర్శించారు. అంర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా పెట్రో మాట్లాడుతూ, 'పాలస్తీనా దేశాన్ని మొత్తంగా తుడిచేసేందుకు ఇజ్రాయిల్ పాల్పడుతుంటే మనం చేష్టలుడిగినట్లు కూర్చోలేం. పాలస్తీనా అదృశ్యమవడం అంటే మానవాళి కనుమరుగవడంతో సమానం. అందుకే దురాక్రమణదారు అయిన ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలను పూర్తిగా తెగదెంపులు చేసుకున్నాం ' అని చెప్పారు. ఇజ్రాయిల్‌తో సంబంధాలు తెగదెంపులు చేసుకున్న రెండవ లాటిన్ అమెరికా దేశం కొలంబియా. అంతకుముందు బొలీవియా ఈ పని చేసింది. కొలంబియా తరువాత హోండూరస్, మెక్సికో సమీపంలోని బెలిజ్ కూడా ఇదే బాటలో నడిచాయి.

హిట్లర్‌ను తలపిస్తున్న నెతన్యాహు: ఎర్డోగన్

హిట్లర్ అనుసరించిన క్రూరమైన పద్ధతులనే నెతన్యాహు పాలస్తీనీయుల ఊచకోతకు అనుసరిస్తున్నాడని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ విమర్శించాడు. గతంలో హిట్లర్ గ్యాస్ చాంబర్‌లోపెట్టి వేలాది మంది అమాయక పౌరులను సామూహికంగా చంపడం, యూదులు నివసించే ప్రాంతాలను దిగ్బంధించి వారికి నీరు, ఆహారం, మందులు, ఇంధనం అందకుండా చేయడం ద్వారా వారు ఆకలితో చనిపోయేలా చేశాడు. ఇప్పుడు నెతన్యాహు అవే పద్ధతులను అనుసరిస్తున్నాడని అన్నారు.

విద్యార్థుల ఉద్యమం విస్తరణకు యత్నాలు

గాజాకు సంఘీభావంగా అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థులు ఏప్రిల్ 18న ప్రారంభించిన గుడారాల ఉద్యమం దావానలంలా వ్యాపించి అనతి కాలంలోనే 80 యూనివర్సిటీలకు విస్తరించింది. అటు నుంచి ప్రపంచ నలుమూలలకూ పాకింది. విద్యార్థులు శాంతియుతంగా చేపట్టిన ఈ ఉద్యమం వల్ల శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకున్నా అమెరికా ప్రభుత్వం, యూనివర్సిటీల యాజమాన్యాలు హింసాత్మక పద్ధతుల్లో ఈ ఉద్యమాన్ని అణచివేసేందుకు యత్నిస్తున్నాయి. విద్యార్థులు ప్రారంభించిన ఈ సంఘీభావ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అనుసరించాల్సిన కొత్త మార్గాల గురించి ప్రొఫెసర్లు, ఇతర అధ్యాపక సిబ్బంది దృష్టి సారించారు. మే8న మొదటి ఫ్యాకల్టీ నిరసన గుడారాలన్ని న్యూయార్క్ సిటీలో ది న్యూ స్కూల్ ఫ్యాకల్టీ ప్రారంభించారు.

రిటైర్డు టీచర్లు కూడా వీరికి మద్దతుగా ముందుకొస్తున్నారు. నార్త్ కరోలినా నుండి కాలిఫోర్నియా వరకు కళాశాలలు, విశ్వ విద్యాలయాల స్నాతకోత్సవాల్లో గాజాలో ఇజ్రాయిల్ దుర్మార్గాలను నిరసిస్తూ కొందరు నినదించారు. వర్జీనియాలోని కామన్వెల్త్ యూనివర్సిటీలో డజన్ల కొద్దీ విద్యార్థులు గాజాకు సంఘీభావంగా గొంతెత్తారు.

ప్రముఖ జర్నలిస్టు బిపిన్ చంద్రన్ హఠాన్మరణం



న్యూఢిల్లీ/తిరువనంతపురం : ప్రముఖ జర్నలిస్టు, సీపీఐ(ఎం) సోషల్ మీడియా విభాగం కార్యకర్త బిపిన్ చంద్రన్ (50) ఆదివారం హఠాన్మరణం చెందారు. బిపిన్ సీపీఐ(ఎం) మాజీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎస్ రామచంద్రన్ పిళ్లై కుమారుడు. మూడు రోజుల కిందట ఇంటర్నల్ ఆర్గాన్స్ దెబ్బతినడంతో బిపిన్‌ను తిరువనంతపురం వైద్య కళాశాల ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం ఆస్పత్రిలోనే ఆయన తుదిశ్వాస విడిచారు. సోమవారం సాయంత్రం ఆయన అంత్యక్రియలను నిర్వహించనున్నారు.

కేరళ ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జి అదనపు వ్యక్తిగత కార్యదర్శి గాను, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ వ్యక్తిగత కార్యదర్శిగానూ బిపిన్ సేవలందించారు. సుదీర్ఘకాలం ఢిల్లీలో పాత్రికేయ జీవితం గడిపిన బిపిన్..ఎంట్రప్రెన్యూర్ బిజినెస్ మ్యాగజిన్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ పని చేశారు. బిజినెస్ స్టాండర్డ్, ఫైనాన్షియల్ టైమ్స్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తా సంస్థల్లో వివిధ హోదాల్లో పాత్రికేయ సేవలందించారు. అనంతరం సీపీఐ(ఎం) సోషల్ మీడియా విభాగంలో కేంద్ర కార్యాలయంలో పని చేశారు. బిపిన్‌కు భార్య షయాజా (జర్నలిస్టు, ఢిల్లీ), పిల్లలు ఆదిత్య పిళ్లై (ఫైనాన్షియల్ ఎనలిస్టు, బెంగళూరు), ఆరోహి పిళ్లై (విద్యార్థి, పూణే) ఉన్నారు.

సీపీఐ(ఎం) సంతాపం

50 ఏండ్ల ప్రాయంలోనే బిపిన్ హఠాన్మరణం చెందడం పట్ల సీపీఐ(ఎం) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది. సీపీఐ(ఎం) సోషల్ మీడియా విభాగం ప్రారంభించిన తొలినాళ్లలో బిపిన్ కేంద్ర కార్యాలయంలో విశేష సేవలందించారని స్మరించుకుంది. నిత్యం కొత్త ఆలోచనలతో, సహచరుల అభిప్రాయాలను గౌరవిస్తూ బృందాన్ని నడిపించేవాడని కొనియాడింది. తనయుడిని కోల్పోయిన వేళ ఆయన తండ్రి, సీనియర్ నేత ఎస్ రామచంద్రన్ పిళ్లైకి, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు సీపీఐ(ఎం) పేర్కొంది.



కోడ్ ఉల్లంఘనలు కన్పించవా?

- 16 నోటీసుల్లో బీజేపీకి ఇచ్చింది మూడే
- కాంగ్రెస్‌కు ఆరు తాఖీదులు

న్యూఢిల్లీ : అధికార బీజేపీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని బాహాటంగా ఉల్లంఘిస్తున్నా ఎలక్షన్ కమిషన్‌కు కన్పించడం లేదు. 18వ లోక్‌సభను ఎన్నుకునే ప్రక్రియ ప్రారంభమై రెండున్నర నెలలు గడిచాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీఐ) వెబ్‌సైటును 'న్యూస్‌క్లిక్' పోర్టల్ పరిశీలించి గణాంకాలను విశ్లేషించింది. గత సంవత్సరం నవంబర్ 13 నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని, సంబంధిత ఎన్నికల చట్టాలను ఉల్లంఘించిన ఉదంతాలకు సంబంధించి ఇప్పటి వరకూ ఈసీఐ 16 నోటీసులు, ఆదేశాలు జారీ చేసింది. వీటిలో ఆరు కాంగ్రెస్, దాని నాయకులను ఉద్దేశించినవి కాగా బీఆర్‌ఎస్, బీజేపీకి మూడేసి నోటీసులు, ఆప్‌కు రెండు నోటీసులు పంపారు. కాంగ్రెస్ పాలిత కర్నాటక రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారికి ఒక్కో నోటీసును అందజేశారు. ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో దానిని ఉల్లంఘించి రైతుబంధు పథకంపై బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు ప్రచారం చేసినందుకు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారికి నోటీసు ఇచ్చారు. 2023 నవంబర్‌కు ముందు జారీ చేసిన నోటీసుల వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో లేకపోవడం గమనార్హం.

బీజేపీకి ఇచ్చినవి ఇవే...

బీజేపీకి రెండు నోటీసులు, ఒక ఆర్డర్ ఇచ్చారు. వీటిలో ఒక దానిని గత సంవత్సరం నవంబర్ 21న బీజేపీ ఢిల్లీ విభాగం అధ్యక్షుడికి, మరొకటి ఈ ఏడాది ఏప్రిల్ 25న పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డాకు పంపారు. ఆమ్‌ఆద్మీ ఫిర్యాదు మేరకు బీజేపీ ఢిల్లీ విభాగం అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్‌కు నోటీసు ఇచ్చారు. రాజస్థాన్‌లోని బన్‌స్వారాలో ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగంపై వచ్చిన పలు ఫిర్యాదుల మేరకు పార్టీ అధ్యక్షుడు నడ్డాకు నోటీసు పంపారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో కర్నాటక బీజేపీ పోస్ట్ చేసిన ఓ వీడియోను తొలగించాల్సిందిగా ఈ నెల 7న ట్విటర్‌ను ఈసీ ఆదేశించింది.

ఈ పార్టీలకు కూడా...

ఆమ్‌ఆద్మీ పార్టీకి జారీ చేసిన రెండు నోటీసుల్లో ఒక దానిని పార్టీ అధినేత కేజ్రీవాల్‌కు, మరొక దానిని ఆ పార్టీ ఎమ్మెల్యే అతిషికి ఇచ్చారు. బీజేపీ ఫిర్యాదుల మేరకు ఈ నోటీసులు అందజేశారు. బీఆర్‌ఎస్‌కు పంపిన మూడు నోటీసులు కాంగ్రెస్ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా జారీ చేసినవే. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు మాత్రం ఆరు నోటీసులు ఇచ్చారు. గత సంవత్సరం నవంబర్ 13, ఈ నెల 8వ తేదీ మధ్యలో వీటిని జారీ చేశారు.

లెక్కే లేదు

వివిధ రాజకీయ పార్టీలకు ఈసీ జారీ చేసిన నోటీసులు చూస్తుంటే అధికార బీజేపీ అతి తక్కువ ఉల్లంఘనలకు పాల్పడిందని మనం అర్థం చేసుకోవాలి. ఎందుకంటే కమలదళానికి కేవలం మూడంటే మూడు నోటీసులే అందాయి. కానీ వాస్తవానికి బీజేపీ నేతలు పాల్పడిన కోడ్ ఉల్లంఘనలకు అంతే లేదు. మార్చి 16న ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుండి ఆ పార్టీ నాయకులు పలు సందర్భాలలో ఎన్నికల కోడ్‌ను, ప్రజా ప్రాతినిధ్య చట్ట నిబంధనలను బేఖాతరు చేశారు. వాటిలో కొన్ని....

ఈసీ పనితీరుపై సందేహాలు

ఎన్నికల కమిషన్‌కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 కింద విస్తృత అధికారాలు ఉన్నాయి. ఎన్నికల యంత్రాంగాన్ని పర్యవేక్షించే అధికారం దానికి ఉంది. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించడమంటే అందరికీ సమానావకాశాలు కల్పించడమే. అయితే పాలక పక్షం నేతలు చేస్తున్న విద్వేష ప్రసంగాలు, మతపరమైన వ్యాఖ్యలను ఎన్నికల కమిషన్ ఉద్దేశపూర్వకంగానే విస్మరిస్తోందా అన్న సందేహం కలుగుతోంది. ఎందుకంటే వాటిపై ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా సుమోటోగా చర్యలు తీసుకునే అధికారం ఈసీకి ఉంటుంది. కానీ ఆ దిశగా ఒక్క చర్య కూడా తీసుకున్న దాఖలాలు లేవు.

ఇవన్నీ ఉల్లంఘనలే

పౌరసత్వ సవరణ చట్టం కింద పౌరసత్వం కోరే పురుష అభ్యర్థుల జననేంద్రియాలను పరిశీలించాలంటూ మార్చి 17న బీజేపీ నేత, మేఘాలయ మాజీ గవర్నర్ తథాగత్ రాయ్ కేంద్ర హోం మంత్రిని కోరారు. మత నేపథ్యాన్ని ధృవీకరించుకునేందుకు ఇది అవసరమని ఆయన తెలిపారు. ఈ వ్యాఖ్యలు కోడ్ ఉల్లంఘనే అవుతాయి. 'భారత్ మాతా కీ జై' అనేందుకు ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహా లోక్‌సభ స్థానం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దనీష్ అలీ అభ్యంతరం వ్యక్తం చేశారని ప్రధాని మోడీ గత నెల 19న ఆరోపించారు. ఇది కూడా కోడ్ ఉల్లంఘనే. రాజస్థాన్‌లోని బన్‌స్వారాలో ఏప్రిల్ 21న ప్రధాని చేసిన విద్వేష ప్రసంగం అందరికీ సుపరిచితమే. అదే రోజు ఛత్తీస్‌గఢ్‌లో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఓ ర్యాలీలో ప్రసంగిస్తూ లవ్ జిహాద్ ప్రస్తావన తెచ్చారు.

ఇవి కూడా...

ఏప్రిల్ 22న యోగి ఓ ఎన్నికల ప్రచార సభలో ప్రతిపక్ష నేతలపై తీవ్ర ఆరోపణలు చేశారు. నేరస్తులు, గ్యాంగ్‌స్టర్ల సమాధులపైన ప్రతిపక్ష నాయకులు ఖురాన్‌లోని ఫతిహా చదువుతున్నారని విమర్శించారు. రాజస్థాన్‌లో ముస్లింలను లక్ష్యంగా చేసుకొని మోడీ చేసిన ప్రసంగాన్నే ఏప్రిల్ 23న యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో ఏకరువు పెట్టారు. ఏప్రిల్ 23న ఛత్తీస్‌గఢ్‌లో, 25న ఉత్తరప్రదేశ్‌లో మోడీ విద్వేషపూరిత ప్రసంగాలు చేశారు. ఏప్రిల్ 26న అమిత్ షా మధ్యప్రదేశ్‌లో ముస్లింలు, కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. అదే రోజు పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని మోడీ తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఔరంగజేబు పార్టీలతో చేతులు కలిపిందని, ఆయన ఆవులను వధించి దేవాలయాలను ధ్వంసం చేశాడని మోడీ ఏప్రిల్ 27న కర్నాటకలో ఆరోపించారు.

ఏప్రిల్ 30న తెలంగాణలో మోడీ, మే 1న మహారాష్ట్రలో యోగి, మే 2న గుజరాత్‌లో తిరిగి మోడీ చేసిన ఎన్నికల ప్రసంగాలు కూడా ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగానే ఉన్నాయి. ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పదేపదే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తున్నప్పటికీ ఈసీ కిమ్మనడం లేదు.

ప్రచారంలో కొత్త పుంతలు...

- యువ వీక్షకులే టార్గెట్
- మీమ్స్, వీడియోలు, వ్యాఖ్యలతో హోరెత్తుతున్న క్యాంపెయిన్
- ప్రత్యర్థులపై వ్యంగ్యాస్త్రాలు



న్యూఢిల్లీ : ఇప్పుడు దేశంలో ఎన్నికల ప్రచారం కొత్త పుంతలు తొక్కుతోంది. బీజేపీ, కాంగ్రెస్, ఆప్ సహా పలు రాజకీయ పార్టీలు హాస్యభరితమైన విజువల్స్, ఏక వాక్య వ్యాఖ్యలతో ఓటర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కొన్ని పార్టీలు మీమ్స్ ద్వారా ఎన్నికలను ఆసక్తికరంగా మార్చేస్తున్నాయి.

'వాషింగ్ మెషిన్' మీమ్‌కు ప్రాచుర్యం

గత నెలలో యూత్ కాంగ్రెస్ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ఓ మీమ్ కన్పించింది. అందులో కాషాయ వాషింగ్ మెషిన్‌ను ప్రదర్శించారు. కుంభకోణాలు, పోలీసు కేసులు, ఈడీ దాడులు, సీబీఐ దాడులు, ఐటీ నోటీసుల పేరుతో ఆ మెషిన్‌కు బటన్స్ ఏర్పాటు చేశారు. దాని కింద 'పార్టీ మారితే ప్రతి మరక మాసిపోతుంది' అనే ఏకవాక్య వ్యాఖ్య ఉంది. బీజేపీ వాషింగ్ మెషిన్ పేరిట కాంగ్రెస్ పెద్ద ఎత్తున ప్రారంభించిన ప్రచారంలో భాగమే ఈ మీమ్.

2017లో ప్రఫుల్ పటేల్‌పై మోపిన అవినీతి కేసును గత సంవత్సరం మార్చిలో సీబీఐ మూసివేసింది. గత సంవత్సరం జూలైలో ఎన్సీపీకి చెందిన పలువురు సీనియర్ నేతలతో కలిసి పార్టీ అధినేత శరద్ పవార్‌కు ప్రఫుల్ పటేల్ కటీఫ్ చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో చేతులు కలిపారు. ఈ ఉదంతాన్ని కాంగ్రెస్ మీమ్ పరోక్షంగా ప్రస్తావించి, బీజేపీని ఎత్తిపొడిచింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రచారానికి ముందు కాంగ్రెస్ పార్టీ విలేకరుల సమావేశంలో వాషింగ్ మెషిన్‌ను ప్రదర్శించింది. అది పూర్తి ఆటోమేటిక్ వాషింగ్ మెషిన్ అని, బీజేపీలో చేరితే కేసులు మూసేస్తామన్న సూత్రంపై అది పనిచేస్తుందని వ్యంగ్యోక్తులు విసిరింది. ఈ మీమ్‌కు మంచి ప్రాచుర్యం లభించింది.

యువ వీక్షకులే లక్ష్యంగా...

పార్టీ సామాజిక మాధ్యమ వేదికలపై పోస్ట్ చేసిన మీమ్ ఇదొక్కటే కాదు. గత సంవత్సరం ఇతర పార్టీల మాదిరిగానే కాంగ్రెస్ కూడా మీమ్స్, రీల్స్, వీడియోలను పోస్ట్ చేయడంలో క్రియాశీలకంగా వ్యవహరించింది. వినోదం, హాస్యం, వ్యంగ్యం ద్వారా యువ వీక్షకులను ఆకర్షించడమే దీని ప్రధాన ఉద్దేశం.

ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలకు లక్షలాది ఫాలోవర్లు

బీజేపీకి అత్యధికంగా 78 లక్షల ఇన్‌స్టాగ్రామ్ ఫాలోయర్లు ఉన్నారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌లను కించపరిచేలా బీజేపీ అనేక వ్యంగ్య మీమ్స్‌ను పోస్ట్ చేసింది. మీమ్స్ ప్రాధాన్యతను అర్థం చేసుకున్న రాజకీయ పార్టీలు సామాజిక మాధ్యమ విభాగాలను ఏర్పాటు చేసుకొని రచయితలు, మీమ్స్ సృష్టికర్తలను నియమించుకుంటున్నాయి. బీజేపీ, కాంగ్రెస్, ఆప్ పార్టీల ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లకు లక్షలాది మంది ఫాలోయర్లు ఉన్నారు. వీరంతా స్పందనలు, వ్యాఖ్యలు, షేర్ల ద్వారా తమ అభిప్రాయాన్ని తెలియజేస్తుంటారు.

కాంగ్రెస్ మేథోమథన బృందం ప్రతిరోజూ ఉదయం 8.30 గంటలకు సమావేశమవుతుంది. తాజా మీమ్స్ రూపకల్పనపై కసరత్తు చేస్తుంది. మీమ్స్ సంస్కృతి ఎప్పటి నుండో ఉన్నప్పటికీ ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. కాంగ్రెస్ పార్టీ ప్రతి రోజూ ఇన్‌స్టాగ్రామ్‌లో 30-40 పోస్టులు పెడుతుంది. వాటిలో మీమ్స్ ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. ఆప్ కూడా 20 మంది సిబ్బందిని నియమించుకొని మీమ్స్‌ను రూపొందిస్తోంది.

> సంగీత భరితమైన వీడియోలు, ఆధునిక మీమ్స్ ద్వారా పార్టీలు ప్రజల్లోకి రాజకీయ సందేశాలను తీసుకొనిపోతున్నాయి. సిద్ధాంతాల ప్రచారానికి సామాజిక మాధ్యమ వేదికలు యుద్ధ భూములుగా మారిపోయాయి. హాస్య ప్రధానమైన విజువల్స్, ఏక వాక్య వ్యాఖ్యల కారణంగా ప్రజల మనసుల్లో మీమ్స్ రోజంతా అలాగే నిలిచిపోతున్నాయి. ప్రజాభిప్రాయాన్ని మార్చడంలో మీమ్స్‌కు ఉన్న శక్తిని రాజకీయ పార్టీలు గుర్తించాయి. ప్రత్యర్థి పార్టీలను ఎద్దేవా చేస్తూ మీమ్స్‌ను రూపొందించే పనిలో అవి నిమగ్నమయ్యాయి.



పూర్తి వివరాలు విడుదల చేయండి

- ప్రతి దశ పోలింగ్ తర్వాత ప్రెస్ మీట్ పెట్టండి : ఎన్నికల కమిషన్‌కు పాత్రికేయ సంఘాల లేఖ

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల సమరంలో మూడు దశలు ముగిసినప్పటికీ ఒక్క పత్రికా విలేకరుల సమావేశాన్ని కూడా ఏర్పాటు చేయక పోవడంపై ఐదు పాత్రికేయ సంఘాలు ఈసీపై మండిపడ్డాయి. ఈ మేరకు ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఉమెన్ ప్రెస్ కార్పొరేషన్, ప్రెస్ అసోసియేషన్, విదేశీ కరస్పాండెంట్ల క్లబ్, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ సంయుక్తంగా ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు ఓ లేఖ రాశాయి.

గత మూడు దశల ఎన్నికల్లో కచ్చితంగా ఎన్ని ఓట్లు పోల్ అయిందీ ఎన్నికల కమిషన్ ఇప్పటి వరకూ వెల్లడించలేదని ఆ సంఘాలు తమ లేఖలో గుర్తు చేశాయి. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని అంటూ దిగ్భ్రాంతిని, ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాయి. ఈ పరిణామాలు నిష్పాక్షిక ఎన్నికలపై ప్రజల మనసులో ఆందోళనలు రేపాయని తెలిపాయి.

'2019 ఎన్నికల వరకూ ప్రతి దశ పోలింగ్ ముగిసిన తర్వాత విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఆనవాయితీగా ఉండేది. రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల కమిషన్ నుండి ఓటింగ్ జరిగిన రోజు ఏం జరిగిందో తెలుసుకునే హక్కు పౌరులకు ఉంది. పోలింగ్ ముగిసిన తర్వాత విలేకరుల సమావేశాన్ని నిర్వహించి వారి అనుమానాలు, సందేహాలను నివృత్తి చేసేవారు. దీనివల్ల పత్రికా పాఠకులకు పొరబాట్లకు అవకాశం లేని సమాచారం అందేది' అని పాత్రికేయ సంఘాలు ఆ లేఖలో వివరించాయి. ప్రతి దశ పోలింగ్ తర్వాత విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, ఎన్ని ఓట్లు పోలయ్యాయి, ఓట్ల శాతం ఎంత వంటి వివరాలన్నీ అందజేయాలని డిమాండ్ చేశాయి. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం కలగాలంటే ఇలాంటి పారదర్శకత అవసరమని నొక్కి చెప్పాయి.



అంబేద్కర్ జన్మభూమిలో నేడు పోలింగ్

- రాజ్యాంగం, రిజర్వేషన్లపై వాడీవేడి చర్చ
- రాజ్యాంగ నిర్మాత పేరిట ఓట్ల రాజకీయం
- హిందూ-ముస్లింల మధ్య పెరిగిన దూరం
- విలన్లుగా చిత్రీకరిస్తున్నారని మైనారిటీల ఆందోళన

భోపాల్ : అది రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జన్మస్థలమైన మధ్యప్రదేశ్‌లోని నాగర్ పట్టణం. గతంలో దీనిని మవు అని పిలిచేవారు. ఆ నగరంలోని రాజేంద్రనగర్ ప్రాంతంలో అనేక మురికివాడలు ఉన్నాయి. అక్కడ ఉన్న నీలి స్తంభాలపై గౌతమ బుద్ధుడు, అంబేద్కర్‌ల బంగారు ప్రతిమలు మనకు దర్శనమిస్తాయి. ఈ ప్రాంతం దళితులకు పుణ్యక్షేత్రంగా విలసిల్లుతోంది. అక్కడ అంబేద్కర్ మాదిరిగా న్యాయవాది కావాలని ఆశిస్తున్న 18 సంవత్సరాల దివ్య వాహర్వాగ్ కూర్చొని ఉంది. అంబేద్కర్ తమ గ్రామంలో జన్మించాడని, విదేశాలకు వెళ్లి చదువుకున్నాడని ఆమె చెప్పారు. తాను కూడా విదేశాలకు వెళ్లాలని అనుకుంటున్నానని తెలిపారు. తన కుటుంబంలో ఎవరూ ఈ మురికివాడను వదిలి బయటకు వెళ్లలేకపోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

2011 జనాభా లెక్కల ప్రకారం డాక్టర్ అంబేద్కర్ నగర్‌లో 13% మంది దళితులే. అంబేద్కర్ అక్కడే జన్మించారు. ఆయన కుటుంబం మహారాష్ట్రకు తరలివెళ్లడానికి ముందు మూడు సంవత్సరాల పాటు అక్కడే నివసించింది. అయితే అంబేద్కర్, రాజ్యాంగం పేరు చెప్పుకుంటూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రమాదకరమైన ఆట ఆడుతున్నాయని దివ్య తెలిపారు. అంబేద్కర్ పేరిట రాజకీయాలు చేయడం బాధాకరమని చెప్పారు. రాజ్యాంగాన్ని మార్చడం, ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడం జరగని పని అని అన్నారు.

పరస్పర ఆరోపణలు

ఇండోర్‌కు 24 కిలోమీటర్ల దూరంలోని నాగర్ పట్టణం ధార్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉంది. ఇక్కడ సోమవారం పోలింగ్ జరుగుతుంది. అంబేద్కర్ జన్మస్థలమైనందున ప్రధాని మోడీ నుండి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వరకూ రాజకీయ నాయకులందరూ దీని నామస్మరణ చేస్తున్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. రాజ్యాంగాన్ని రద్దు చేయాలని బీజేపీ భావిస్తోందని రాహుల్ ఆరోపిస్తుంటే కాంగ్రెస్ పార్టీ ఓబీసీల రిజర్వేషన్లను గుంజుకొని ముస్లింలకు ఇవ్వాలని చూస్తోందని మోడీ ఆరోపిస్తున్నారు.

భీమ్ జన్మభూమిలో అక్రమాలు

అంబేద్కర్ పుట్టిన ఇంటి స్థానంలో ఇప్పుడు ఆయన విగ్రహం ఉన్న పెద్ద హాలు ఉంది. ఆ విగ్రహాన్ని తెల్లని పాలరాయి, బంగారు పూతతో నిర్మించారు. అయితే 'భీమ్ జన్మభూమి'ని నడుపుతున్న వారు ఆర్థిక అవకతవకలపై పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. తామే అంబేద్కర్ భక్తులమని, రాజ్యాంగాన్ని కాపాడతామని రెండు పార్టీలు చెప్పుకుంటున్నాయని, ఇక్కడ కమిటీ సభ్యులేమో డబ్బు దండుకుంటున్నారంటూ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారని బీటెక్ గ్రాడ్యుయేట్ సుఖ్‌దేవ్ దాబర్ ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇది వాస్తవం. ప్రతి ఒక్కరూ ప్రసంగాలు చేస్తారు. బాబాసాహెబ్ పేరుతో ప్రయోజనం పొందుతారు' అని మండిపడ్డారు.

దృష్టంతా హిందూ-ముస్లిం వివాదం పైనే

నగరానికి యాభై కిలోమీటర్ల దూరంలో భోజ్‌శాల దేవాలయం, కమల్ మౌలా మసీదు ప్రాంగణం ఉన్నాయి. ఆ ప్రాంతంలో ముస్లింలు గణనీయమైన సంఖ్యలో నివసిస్తున్నారు. రిజర్వేషన్‌పై జరుగుతున్న చర్చలో తమను విలన్లుగా చిత్రీకరిస్తున్నారని వారు భయాందోళనలు వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్‌లో ముస్లింల సంఖ్య తక్కువే అయినప్పటికీ ధార్ జనాభాలో 16శాతంగా ఉన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు భోజ్‌శాల-కమల్ మౌలా కాంప్లెక్స్‌లో పురావస్తు శాఖ అధికారులు తవ్వకాలు జరుపుతున్నారు. ఇప్పుడంతా హిందూ-ముస్లిం వివాదం నడుస్తోందని, ఇంజినీర్లు టీ అమ్ముతూ తిరగడం, పప్పుల ధరలు ఆకాశాన్ని తాకడం గురించి ఎవరూ మాట్లాడడం లేదని చెప్పులు కుట్టే 55 సంవత్సరాల నీలేష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ కాంగ్రెస్ విజయం సాధించిన తర్వాతే భోజ్‌శాల, రిజర్వేషన్ అంశాలు వెలుగులోకి వచ్చాయని ఆయన విమర్శించారు.

దూరం పెరిగింది

ధార్‌లో గత రెండు ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థులే విజయం సాధించారు. ఇప్పుడు సిట్టింగ్ ఎంపీ సావిత్రి ఠాకూర్‌తో కాంగ్రెస్ గిరిజన నేత రాధేశ్యామ్ ముపెల్ తలపడుతున్నారు. ఈ నియోజకవర్గ పరిధిలో ఎనిమిది శాసనసభ స్థానాలు ఉన్నాయి. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ ఐదింటిని గెలుచుకుంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో హిందూ, ముస్లింల మధ్య దూరం పెరిగిందని ఇస్లాంపురా గ్రామానికి చెందిన షారూఖ్ సోనీ తెలిపారు. రెండు మతాల వారు కరడుకట్టిన వారిగా మారిపోయారని అంటూ ఎవరి హక్కులైనా హరించగలమా అని ప్రశ్నించారు. 'మేము ఓటు బ్యాంక్ కాదు. మనుషులం. మనం పాకిస్తాన్ లాగా మారకూడదు. అదే అసలైన పోరాటం' అని అన్నారు.

రాయబరేలీ రాహుల్‌దే...!


- నెహ్రూ-గాంధీ కుటుంబంపై చెక్కుచెదరని ఓటర్ల విధేయత
- అమేథీలో నువ్వా నేనా?

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని అమేథి, రాయబరేలీ లోక్‌సభ స్థానాలపై దేశ ప్రజలు ఎప్పుడూ ఆసక్తి చూపుతూనే ఉంటారు. ఏ పార్టీ తరఫున ఎవరు పోటీ చేసినప్పటికీ ఆ రెండు స్థానాలకూ ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. ఇప్పుడు కూడా అంతే. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు వరకూ ఎడతెగని ఉత్కంఠే. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాయబరేలీ నుండి పోటీ చేస్తారా లేదా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగానే ఉండిపోయింది. అమేథీలో బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీపై కాంగ్రెస్ విధేయుడు కేఎల్ శర్మ బరిలో దిగారు. ఇప్పుడు అందరి మనసులోనూ ఒకే ఒక ప్రశ్న మెదలుతోంది. రాయబరేలీ, అమేథీ స్థానాల్లో ఏ అంశం ప్రభావితం చేస్తుంది? కుటుంబ విధేయతా? కులమా? పార్టీయా?

కొన్ని సందర్భాలు మినహాయించి 2019 ఎన్నికల ముందు వరకూ ఈ రెండు స్థానాలకూ నెహ్రూ-ఇందిర కుటంబ సభ్యులే ప్రాతినిధ్యం వహించారు. బీజేపీకి సంబంధించినంత వరకూ 2019 వరకూ ఈ రెండు స్థానాలు కొరకరాని కొయ్యలే. ఎట్టకేలకు 2019లో స్మృతి ఇరానీ బీజేపీకి అమేథీలో తొలి విజయాన్ని అందించారు. రాహుల్ పరాజయాన్ని చవిచూశారు. ఇప్పుడు ఆయన రాయబరేలీ నుండి రంగంలో దిగారు. ప్రత్యక్ష రాజకీయాల్లో పోటీ చేయబోవడం లేదని కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ ఫిబ్రవరిలో భావోద్వేగపూరితమైన ప్రకటన విడుదల చేశారు. 'గతంలో మాదిరిగా భవిష్యత్తులో కూడా మీరు నాకు, నా కుటుంబానికి అండగా ఉంటారని తెలుసు' అని ఆ ప్రకటనలో కోరారు. రాహుల్‌పై పోటీకి బీజేపీ ఠాకూర్ నేత దినేష్ ప్రతాప్ సింగ్‌ను దింపింది. ఆయన సుదీర్ఘ కాలం కాంగ్రెస్ నేతగా కొనసాగారు. ఇప్పుడు బీజేపీలో ఉన్నారు.

చివరి వరకూ ఉత్కంఠే

ఇదిలావుండగా అమేథీ, రాయబరేలీ స్థానాల్లో కాంగ్రెస్ విజయం కోసం ప్రియాంక గాంధీ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సోనియా కూడా రాయబరేలీలో పర్యటిస్తారని వార్తలు వస్తున్నాయి. ఈ రెండు స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ పెద్ద ఎత్తునే కసరత్తు చేసింది. పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించింది. ఒక దశలో అమేథీ నుండి రాబర్ట్ వాద్రా పోటీ చేస్తారన్న ఊహాగానాలు చెలరేగాయి. అమేథీ నుండి పోటీ చేసేందుకు రాహుల్ ఆసక్తి చూపడం లేదని వదంతులు వ్యాపించడంతో కాంగ్రెస్ కసరత్తు చివరి క్షణం వరకూ కొనసాగింది. ఎట్టకేలకు ఈ నెల 3న ఈ రెండు స్థానాలకూ కాంగ్రెస్ తన అభ్యర్థులను ప్రకటించింది.



ప్రియాంక ప్రచారంతో...

ప్రియాంక పర్యటనతో రాయబరేలీలో కాంగ్రెస్ విజయావకాశాలు మెరుగయ్యాయి. అక్కడి మహిళలు, వృద్ధులతో ఆమె మమేకమయ్యారు. ఆమె ప్రచారం యావత్తూ హుందాగా సాగింది. రాయబరేలీ ప్రజలు కోరుకున్నది కూడా అదే. రాయబరేలీ నుండి సోనియా మరోసారి బరిలో నిలుస్తారని నియోజకవర్గ ప్రజలు తొలుత ఆశించారు. అయితే తాను పోటీ చేయబోవడం లేదని ఆమె ప్రకటించడంతో నిరుత్సాహానికి గురయ్యారు. రాహుల్ నామినేషన్ దాఖలు చేయడంతో మళ్లీ వారిలో ఉత్సాహం ఉరకలేస్తోంది. అమేథీ, రాయబరేలీ ప్రజల హృదయాలలో కాంగ్రెస్‌కు ప్రత్యేక స్థానం ఉన్నదని, ఇప్పుడు సమాజ్‌వాదీ పార్టీ కూడా ఇండియా కూటమిలో ఉండడంతో బీజేపీకి పెను సవాలు ఎదురవుతోందని సీనియర్ రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ హిలాల్ అహ్మద్ చెప్పారు.

అప్పటి కాంగ్రెస్ నేతే ఇప్పుడు బీజేపీ అభ్యర్థి

రాయబరేలీ లోక్‌సభ స్థానంలో ఠాకూర్ల (రాజపుత్రులు) ప్రాబల్యం అధికంగా ఉంది. ముఖ్యంగా శాసనసభ ఎన్నికలు వచ్చేసరికి గత 40 సంవత్సరాలుగా వారి ఆధిపత్యం కొనసాగుతోంది. 2022లో జరిగిన ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో ఈ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో సమాజ్‌వాదీ పార్టీ 4, బీజేపీ 2 స్థానాలు గెలుచుకున్నాయి. విజేతల్లో ముగ్గురు ఠాకూర్ కులస్తులే. బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దినేష్ ప్రతాప్ సింగ్ ఆ సామాజిక వర్గానికి చెందిన వారే. ఆయన కాంగ్రెస్‌లో చాలా కాలం పాటు కొనసాగారు. 2010, 2016లో ఆయన కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్సీగా పనిచేశారు. 2018లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో సోనియాపై పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు ఆయన బీజేపీ ఎమ్మెల్సీ. యోగి ఆదిత్యనాథ్ మంత్రిమండలిలో సభ్యుడు.

అమేథీలో హోరాహోరీ

ఇక అమేథీ విషయానికి వస్తే పరిస్థితి భిన్నంగా ఉంది. కాంగ్రెస్ అభ్యర్థి శర్మ క్రియాశీలకంగా లేరని ప్రజలు పెదవి విరుస్తున్నారు. రాహుల్‌కు శర్మ ఏ విధంగానూ ప్రత్యామ్నాయం కాదని వారు కుండబద్దలు కొడుతున్నారు. ఆసక్తికరమైన విషయమేమంటే 1991, 1996లో అమేథీ నుండి శర్మ లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఒకప్పటి ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో ఆయన సుదీర్ఘ కాలం పైలట్‌గా పనిచేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి సన్నిహితుడు. మరోవైపు అమేథీలో ప్రస్తుత ఎంపీ స్మృతి ఇరానీ అనేక సార్లు పర్యటించారు. కేంద్ర మంత్రిగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. గౌరీగంజ్‌లో కొత్తగా నిర్మించుకున్న ఇంటికి ఆమె ఇటీవలే మారారు. ఏదేమైనా అమేథీలో పోరు నువ్వా నేనా అనే రీతిలో సాగుతోంది. అమేథీ ప్రజలు కాంగ్రెస్‌పై తిరిగి విశ్వాసాన్ని ప్రదర్శిస్తారా లేక బీజేపీనే మరోసారి గెలిపిస్తారా అన్నది చూడాల్సి ఉంది. అమేథీ నుండి ప్రియాంక పోటీ చేసి ఉంటే వాతావరణం అనుకూలంగా ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.



రాయబరేలీలో విజయం సునాయాసమే

కేరళలోని వాయనాడ్ నుండి కూడా రాహుల్ పోటీ చేశారు. అక్కడ గత నెల 26న పోలింగ్ జరిగింది. రాహుల్ రాయబరేలీ నుండి కూడా పోటీ చేయడాన్ని వాయనాడ్ ప్రజలు ఇష్టపడలేదు. అమేథీలో రెండోసారి ఓటమి పొందడం ఇష్టంలేకే ఆయన రాయబరేలీని ఎంచుకున్నారని వారు భావిస్తున్నారు. అయితే రాయబరేలీలో రాహుల్ విజయం నల్లేరుపై నడకేనని అక్కడి ఓటర్లు చెబుతున్నారు. క్షేత్ర స్థాయి పరిస్థితులు కూడా ఆయనకు అనుకూలంగా ఉన్నాయి.

రిగ్గింగ్ జరక్కుండా చూడండి

ఓటర్ల అరెస్టులు ఆపండి : ఈసీకి మెహబూబా ముఫ్తీ లేఖ



శ్రీనగర్ : 1987 తరహా రిగ్గింగ్ జరక్కుండా చూడాలని, ఓటర్ల అరెస్టులు ఆపాలని భారత ఎన్నికల సంఘానికి జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) అధ్యక్షులు మెహబూబా ముఫ్తీ లేఖరాసారు. కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్న రాష్ట్ర అధికారులు ఓటర్లను, పీడీపీ మద్దతుదారులను భయభ్రాంతులకు గురిచేసే లక్ష్యంతో సిగ్గులేకుండా పనిచేస్తున్నారని లేఖలో ముఫ్తీ విమర్శించారు. పుల్వామా, షోపియాన్ జిల్లాల్లో భద్రతా దళాలు సోదాలు నిర్వహించి, పీడీపీ కార్యకర్తలన వేధిస్తున్నారని వచ్చిన వార్తలతో తాను తీవ్ర ఆందోళనకు గురైనట్లు లేఖలో ఆమె తెలిపారు. బహిరంగ ర్యాలీలను నిర్వహించేందుకు, ఓటింగ్‌ను ప్రోత్సహించడానికి పెద్ద సంఖ్యలోని పీడీపీ సభ్యులు, సానుభూతిపరులు, కార్యకర్తలను చేసిన ప్రయత్నాలకు శిక్షగా వారి నిరంకుశంగా నిర్బంధించారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడానికి ఎన్నికల అధికారులు, రాష్ట్ర అధికారులు సంయుక్తంగా పనిచేయడం అవసరమే అయినా జమ్ముకాశ్మీర్‌లో ఇటీవల జరుగుతున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. అనంతనాగ్-రాజౌరీ నియోజవర్గ ఎన్నికను వాయిదా వేయడం వంటి చర్యలు ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతపై ఆందోళనలు లేవనెత్తుతున్నాయిని, అదేవిధంగా బెదిరింపులు, దౌర్జన్యం ద్వారా ఎన్నికల ఫలితాలను మార్చడానికి ప్రయత్నించే వారికి ధైర్యం కలిగిస్తున్నాయని విమర్శించారు.

సోమవారం ఎన్నికలు జరగనున్న ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై ఆందోళనగా ఉందని చెప్పారు. పీడీపీ మద్దతుదారులను అరెస్టు చేయాలని జెకె ఆప్నీ పార్టీ బహిరంగంగా పిలుపు ఇవ్వడం ఆందోళన కలిగిస్తుందని చెప్పారు. పీడీపీ కార్యకర్తలపై అధికారులు అణిచివేతకు పాల్పడుతున్నారని ఆ పార్టీ అభ్యర్థి వహీద్ ఉర్ రెహ్మాన్ వరస ట్వీట్లతో ఆరోపణలు చేసిన నేపథ్యంలో ముఫ్తీ ఈ లేఖ రాసారు. సీనియర్ ఐపీఎస్ అధికారి విజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కూడా పర్రా డిమాండ్ చేశారు.

మరోవైపు, శ్రీనగర్, బుద్గాం, పుల్వామా, షోపియాన్‌ల్లోని వివిధ ప్రాంతాల్లో జెకె ఆప్నీ పార్టీ కార్యర్తలను పోలీసులు పెద్ద సంఖ్యలో అరెస్టు చేసినట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి రఫీ అహ్మద్ మీర్ కూడా ఆరోపించారు. 'ఎన్నికలకు కేవలం కొన్ని గంటల ముందు పార్టీ కార్యకర్తలను అరెస్టు చేయడం ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి జరుగుతున్న ప్రయత్నాన్ని సూచిస్తుంది. ఈ అన్యాయాన్ని మేం సహించం, ఎన్నికలను బహిష్కరిస్తాం' అని మీర్ తెలిపారు.

ఆ నలుగురి సేవలో మోడీ

- ప్రియాంక గాంధీ

లక్నో : ప్రధాని మోడీ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ విమర్శలు గుప్పించారు. యూపీలోని రాయ్‌బరేలిలో ఆదివారం జరిగిన లోక్‌సభ ఎన్నికల ప్రచార ర్యాలీలో మాట్లాడుతూ మోడీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ నలుగురు బడా పారిశ్రామికవేత్తలకు మేలు చేసేందుకు ప్రధాని పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. దేశ సంపదను మోడీ కేవలం నలుగురైదుగురు వ్యక్తులకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ప్రధాని మోడీ అనూహ్యంగా చేపట్టిన నోట్ల రద్దుతో కోట్లాది చిరు వ్యాపారులు, మహిళలకు కష్టాలు తెచ్చిపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మోడీ హయాంలో ఈ పదేండ్లలో పేదల స్థితిగతులు ఏమాత్రం మెరుగుపడలేదని, కానీ కాషాయ పాలకులు చేసిన అరకొర పనులను వార్తా ఛానెల్స్‌లో అదేపనిగా చూపుతున్నారని ప్రియాంక గాంధీ ఎద్దేవా చేశారు. పేదలు, రైతుల కడుపుకొట్టి పారిశ్రామిక దిగ్గజాలకు మోడీ దోచిపెడుతున్నారని విమర్శించారు.



ఏడాదికో ప్రధాని

- ఇండియా వేదిక గెలిస్తే అంతే.: అమిత్ షా


రాయ్‌బరేలి : కాంగ్రెస్ సహా విపక్షాలు తమ ఓటు బ్యాంకు గురించి కలత చెందుతున్నాయని, బీజేపీ ఏ ఒక్కరికీ భయపడదని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష ఇండియా కూటమి గెలిస్తే వారి ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరని ప్రశ్నించారు. వంతుల వారీగా తమ నేతలు ఏడాదికి ఒకరు చొప్పున ప్రధానమంత్రి బాధ్యతలు చేపడతారని విపక్ష నేత ఒకరు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. యూపీలోని ప్రతాప్‌ఘఢ్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో అమిత్ షా మాట్లాడారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణంతో పాటు మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు ధ్వంసం చేసిన కాశీ విశ్వనాథ్ కారిడార్‌ను సైతం మోడీ నిర్మించారని గుర్తుచేశారు.విపక్ష వేదిక అధికారంలోకి వస్తే ప్రధానమంత్రి ఎవరవుతారో చెప్పలేని దుస్థితిలో కూటమి నేతలున్నారని వ్యాఖ్యానించారు. మోడీ మరోసారి ప్రధానిగా పాలనా పగ్గాలు చేపడితే రిజర్వేషన్లు రద్దవుతాయని కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం సాగిస్తోందని దుయ్యబట్టారు.



మంచి పరిశోధనా గ్రంథం

'తెలంగాణ కథ-వర్తమాన జీవన చిత్రణ' అనే పరిశోధనాంశంపై ఎం.దేవేంద్ర సమర్పించిన సిద్ధాంత గ్రంథం ఇది. ఇందులో ముందుగా తెలంగాణ కథను యుగవిభజన చేసుకున్నారు. మొదట 1902 నుండి 1956 వరకు వచ్చిన కథలని తొలితరం కథలుగా 1957 నుండి 1975 వరకు వచ్చిన కథలను మలితరం కథలుగా 1976 నుండి 1990 వరకు వచ్చిన కథలను మూడవతరం కథలుగా విభజించారు. 1990 నుండి 2010 వరకు ఉన్న రెండు దశాబ్దాల కాలాన్ని నాలుగవ తరంగా పేర్కొంటూ దాన్ని తన పరిశోధనాంశంగా దేవేంద్ర స్వీకరించారు. ఈ కాలంలోని కథని వారు వర్తమాన కథగా పేర్కొంటున్నారు. సిద్ధాంత గ్రంథంలోకి వెళ్లే ముందు తెలంగాణ తొలితరం కథ, మలితరం కథ, మూడోతరం కథలను - అందులోని సమకాలీన జీవన చిత్రణను క్లుప్తంగా వివరించిన విధానం బాగుంది.

వర్తమాన కథకుల విషయానికి వస్తే ఒకప్పటి కంటే ఈ రెండు దశాబ్దాలలో కథావేగం, కథ పరిణతి పెరిగింది. జీవన వాస్తవికతను చిత్రించడంలో తెలంగాణ కథ బహుముఖాలుగా విస్తరించింది. నాలుగవ తరంలో అన్ని వర్గాల నుండి కథకులు ఎదిగి వచ్చి తమ అస్తిత్వాలను, అనుభవాలను, సామాజిక పోకడలను కథలుగా రాశారు. ఇది ఒక మంచి సాహిత్య పరిణామంగా చెప్పవచ్చు. ఈ రెండు దశాబ్దాల తెలంగాణ కథ బహుముఖ కోణాలను స్పృశించింది. మారుతున్న పరిస్థితుల కనుగుణంగా కథలు చదివే పాఠకులు ఎక్కువయ్యారు. పత్రికల్లో కథలను క్రమం తప్పకుండా వేస్తూ ఆదరిస్తున్నాయి. ఈ రెండు దశాబ్దాలలో కథా రచయితలను గమనించినట్లయితే, అన్ని వర్గాల నుండి కథకులుగా ఎదిగిన తీరు కనబడుతుంది. తెలంగాణాలో రెండు దశాబ్దాల (1990-2010) కథలను సేకరించినప్పుడు కథా సంపుటాలు, కథ సంకలనాలలో మూడు వేల కథలకు పైగా పరిశోధకురాలు దృష్టిలోకి రావడం గమనించదగ్గ విషయం. ఒకప్పుడు విమర్శకులు తెలంగాణ కథలో శిల్పం కంటే జీవితం ఉంటుందనే విషయాన్ని తోసి పుచ్చి, ఇప్పటి కథలో శిల్పం, జీవితం రెండు ఉన్నాయని పరిశోధకురాలు నిర్ధారిస్తున్నారు. వారి పరిశోధనాంశం జీవన చిత్రణ కాబట్టి వారు శిల్పంపై దృష్టి కేంద్రీకరించలేదు. జీవితం సమగ్ర చిత్రణలో అంది వచ్చిన కథలనే స్వీకరించి వాటిని విశ్లేషించడం ఈ సిద్ధాంత గ్రంథంలో కనిపిస్తుంది.



> తెలంగాణలో చోటు చేసుకున్న రెండు దశాబ్దాలలోని ఆర్థిక సామాజిక రాజకీయ పరిణామాలను విశ్లేషణాత్మకంగా వివరించారు. తర్వాత తెలంగాణ కథా రచయితల పరిచయంతో పాటు తెలంగాణ కథకు సాహిత్య సంస్థల కృషిని గురించి కూడా వివరించారు. తర్వాత ఆయా కథారచయితల కథలలో చోటు చేసుకున్న వైయక్తిక జీవితం... అనగా కుటుంబ జీవితం - సంబంధాలు, తర్వాత గ్రామ జీవితం, నగర జీవితం, వలస జీవితం, గిరిజన జీవితం అనే విభాగాలుగా విభజించుకొని వివరించారు.

తెలంగాణ జీవితాన్ని గురించి చెప్పిన రచయితల్లో తెలంగాణలో పుట్టి, తెలంగాణలో పెరిగి స్థిరపడి కథలు రాస్తున్న రచయితలు ఉన్నారు. మూడవతరం కథా రచయితలుగా కథాప్రయాణం సాగించి ఆ తర్వాత నాలుగవతరంలో రచనలు కొనసాగిస్తున్న వారు ఉన్నారు. వీరు కాకుండా కొత్తగా ఎదిగిన కథకులు కూడా ఈ కాలంలో మనకు కనిపిస్తారు. రచయితల ప్రత్యేకతలను గురించి వివరిస్తూ, జీవన చిత్రాణలను విశ్లేషించడం ఇందులో చూడవచ్చు. ముందుగా తెలంగాణలో చోటు చేసుకున్న రెండు దశాబ్దాలలోని ఆర్థిక సామాజిక రాజకీయ పరిణామాలను విశ్లేషణాత్మకంగా వివరించారు. తర్వాత తెలంగాణ కథా రచయితల పరిచయంతో పాటు తెలంగాణ కథకు సాహిత్య సంస్థల కృషిని గురించి కూడా వివరించారు. తర్వాత ఆయా కథారచయితల కథలలో చోటు చేసుకున్న వైయక్తిక జీవనం... అనగా కుటుంబ జీవితం - సంబంధాలు, తర్వాత గ్రామ జీవితం, నగర జీవితం, వలస జీవితం, గిరిజన జీవితం అనే విభాగాలుగా విభజించుకొని వివరించారు.

'తెలంగాణ కథ -ప్రపంచీకరణ' అనే మూడవ అధ్యాయంలో ప్రపంచీకరణ నిర్వచనాలు, వాటి అనుకూల, ప్రతికూల భావనలు అవి ప్రజాజీవనంపై వాటి ప్రభావాన్ని వివరించారు. ముందుగా ప్రపంచీకరణలో వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, విద్యారంగాలలో చోటు చేసుకున్న మార్పులను గురించి వివరించారు. తర్వాత కులవృత్తుల విధ్వంసాన్ని, మానవ సంబంధాలలో వస్తున్న మార్పులను విశ్లేషించి చూపారు. నాల్గవ అధ్యాయం 'తెలంగాణ కథ -అస్తిత్వ స్పృహ'. అస్తిత్వ స్పృహ అంటే వివరించి, అందులో భాగంగా వచ్చిన ప్రాంతీయ అస్తిత్వం, వర్గాస్తిత్వం, సాహిత్యంలో అస్తిత్వ చేతన, అస్తిత్వ దూరాల గురించి చెబుతూ స్త్రీవాదం, దళితవాదం, బహుజనవాదం, మైనారిటీ వాదం, ప్రాంతీయ చైతన్యం ఎలా తెలుగు కథలలో చోటు చేసుకున్నాయో వివరించి చూపారు.

ఐదవ అధ్యాయం 'తెలంగాణ కథ- సంస్కృతి'. ఇందులో సంస్కృతి అంటే ఏమిటో వివరించి, అందులో భాగమైన నమ్మకాలు, విశ్వాసాలు, పండుగలు, కళలు, ఉత్సవాలు, జాతరలు, ఆచారాలు, ఆహార్యం, ఆహారం, భాష మొదలైన అంశాలన్నీ తెలంగాణ కథలలో ఎలా భాగమయ్యాయో వివరించి చూపారు.

తెలంగాణ జీవితంలోని సమస్యలను, సంఘర్షణలను ప్రధానంగా ఈ సిద్ధాంత గ్రంథంలో వివరించి, తెలంగాణ నేలపై కథా స్రవంతి ఆవిష్కరింపబడిన తీరు, కథ, కథా నేపథ్యాలు, కథాకాలంనాటి పరిస్థితులు, కథ పరమార్థాలు-ఉద్దేశాలు, తెలంగాణ జీవితాన్ని ఏ విధంగా నిర్వహించాయో నిశితంగా పరిశీలించారు. కులాల వారీగా, మతాలవారీగా, వృత్తి పనుల వారిగా తెలంగాణలో కనిపించే వివాహాలు, పండుగలు, నమ్మకాలు, ఆచారాలు తెలంగాణ సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తున్నాయని విశ్లేషించి, వాటిని వివరించారు. అలా తెలంగాణ ప్రాంత ప్రత్యేకతను, సంస్కృతిని తెలియజేస్తూనే ఇక్కడ జీవితంలో ఉన్న సంఘర్షణలు, సమస్యలను చిత్రీకరించిన మొట్టమొదటి పరిశోధన గ్రంథముగా దీని గురించి చెప్పుకోవచ్చు. పరిశోధకురాలు డాక్టర్ ఎం.దేవేంద్ర విస్తృత పరిశోధనలతో అనేక కొత్త విషయాలను ఇందులో తెలిపిన రీతి చాలా బాగుంది. ఇది భవిష్యత్ తరాలకు ఒక మంచి రిఫరెన్స్ పుస్తకముగా నిలిచిపోతుందని చెప్పవచ్చు.



- కె.పి అశోక్ కుమార్
9700000948

అంతా అనుకున్నట్లే

అబద్ధం అమీబాలాగా రూపాలు మార్చుకుంటూ
ఇంటింటిని చుట్టేస్తున్నది.
జనాన్ని నజరబంద్ చేసి
వందేమాతరం రైలు వేగంతో దూసుకెళ్తున్నది
ఉడుకు నెత్తురు ఉక్కునరాలకు
విద్వేషపు సెలైన్లు ఎక్కిస్తున్నది
చిటికెన వేళ్ళ బంధంతో బాల్యాన్ని దాటిన
అన్నదమ్ముల మధ్య
ఇపుడు విద్వేషపు గోడలు నాటుతున్నది
ఒకే కంచంలో ఆకలి మంటలార్పుకున్న ఆత్మీయులు
ఒకే చెప్పుల జతతో కష్టాన్ని పంచుకున్న దోస్తానాలు
ఒక్కొక్క రంగుల గుడారంలో
కత్తులు నూరుకుంటున్నయి.
ఏ ఇంట్లో చూసినా ముఖాలన్ని
పరశురాముని గండ్రగొడ్డండ్లయి భయపెడుతున్నయి
దారుల నిండా నిజాన్ని ఇజాల పెట్టెలో కుక్కి
బరితెగించి బరిసెల చేతులతో దాడికి దిగుతున్నది.
పాత సామాను దుకాణాలను
బుల్డోజర్లు నమిలేస్తున్నయి
ఇంకా ఇలాగే నోర్లు తెరవకుంటే
మాటలు నిషేధపు గోదాములో
భావాలు నియంత్రణా కొలిమిలో కాలి కమురెక్కవచ్చు
మనిషే బానిస రోబోయై తెంచుకోవడానికి
తలను అప్పగించే కాలం రావచ్చు
కాలు కదిపినా అడుగులేసినా చూపులు స్వేచ్ఛాతీగలై
జనంలో అల్లుకోవాలన్నా వాడి హుకుం సైగచేయాలి.
కట్టే బట్ట, తినే తిండి, నిలుచున్న నీడ
అన్నీ వాడి బూజుపట్టిన మెనో ప్రకారమే
ఇపుడు నటనలు లేవు కపట చేష్టలులేవు
ఎక్కడ చూసినా నీతి, ధర్మం, న్యాయం
బట్టలిడిసి తిరుగుతున్నయి లోకం కాండ్రించి ఉమ్మేసినా
ఉన్మాదపు మత్తులో ఊగిపోతున్నది
అవకాశాలు ఒయాసిస్సులు మాత్రమే
ఒంటినిండా అన్నీ సర్దుకొని
ఒక్కసారి రాజ్యాంగాన్ని స్మరించుకొని
నిశబ్ద యుద్ధంకై సిద్ధమవ్వాలి
కులాలు మతాల నిషాలలో సోయితప్పిన మెదళ్ళకు
కొత్త నరాలు పేనాలి లౌకికత్వం మహావృక్షంపై
అందరం ఆనందంతో కేరింతలు కొట్టాలి.

- డా॥ ఉదారి నారాయణ, 9441413666

ప్రయాణమంతా ఉత్సవమే!



ఎండలు విరుచుకుపడుతున్నాయి
మీరు చెమటల బరువుతో నడుస్తూ అలసటతో
ఈ దారిలోనే వస్తారని మాకు తెలుసు
మేం ఇట్లా ఆకుపచ్చ దేహాలతో
మీకు నీడల బహుమానాలను ఇవ్వాలని
నిలబడి నిరీక్షిస్తూ వున్నాం వేల పత్ర నేత్రాలతో-
గాలుల్ని బతిమిలాడి మా శాఖల విడిదిలో
వేంచేపు చేసాం సపర్యలతో శీతలీకరించాం
మీరు రాగానే వాటి చేతుల మీదుగా సుగంధాలను
మీపైనా మీ మనసుల్లోకీ చిలకరించాలని -
మీరొచ్చి నీడల్లో కాస్త నిమ్మళ పడుతూంటే
మా జీవన సారాలతో సృజించిన రసఫలాలను
మీ ఒళ్ళోకి చేరేలా జారవిడువాలని
మా కొమ్మలు తహతహలాడుతున్నాయి
వాటిని మీరు ఇష్టంగా ఆస్వాదిస్తూంటే
మేము హృద్యంగా హొయలుతో లయాత్మకంగా
నృత్యం చేయాలని రిహార్సల్స్ కూడా చేసుకున్నాం
మీ కడుపుకే కాదు కనులకూ విందు చేయాలని -
అటుగా పాటల సరంజామాతో రాగవీధిలో వెళుతున్న
కోయిలల గుంపును మా చిగుళ్ళ లేచేతులతో పిలిచి
మా గుబురుల్లో కొన్నాళ్లు మజిలీ చేయమని వేడుకున్నాం
పాటలు పాడీ పాడీ ఆ కోయిలలు దయాపూరితాలైనాయి కాబోలు
ఏ మాత్రమూ బెట్టు చేయక మెత్తని గొంతుకలతో సరే అని
మా పరిమిత గృహాల్లో సర్దుకుని కొలువైనాయి
ఒక రాగకచేరీతో అలరించమని వాటికి విన్నవించుకున్నాం
అవి శ్రుతి చేసుకుంటున్నాయి, మీరు విచ్చేసాక
మీ శ్రవణ పాత్రల్లో గీతామృతాలను ఒంపడానికి !
మా నీడలు మావైనా తావు మాది కాదు కదా
అది తల్లి నేలది, మమ్మల్ని సాదుతున్న ఆమెకు అర్జీ పెట్టుకున్నాం
మిమ్మల్నీ అనుమతించమని -
ఆమె మాకే కాదు మీక్కూడా తల్లే కదా ఎలా కాదనగలదు
అవుననడమే కాదు, తన అపార అంతర్జలాన్ని
ఎంతైనా తోడుకొమ్మని ఆతిథ్యానికి ఏ లోటూ రానివ్వద్దని
మరీ మరీ చెప్పింది చెమ్మగిలిన కళ్ళతో అభినందిస్తూ -
అంతా సిద్ధమే ఇపుడు!
అదుగో అల్లంత దూరంలో మీరు కానవస్తున్నారని
మా శిఖర శాఖలు మాకు ముందస్తు కబురందిస్తున్నాయి
అవును ఇపుడు మీరు మా కనులకు దగ్గరయ్యారు, కానీ
అదేమిటి? నడుస్తూ కాదు పరుగుతో వస్తున్నారు ఈ ఎండలో!
అయ్యో, పడుతూ లేస్తూ ప్రయాస పడుతున్నా పరుగునాపట్లేదు
విచిత్రం! మిమ్మల్ని మీరే తరుముకుంటున్నారు!
అయ్యో, ఈ ఎండల దాడిలో మీ గొంతులెడారులై ఉంటాయి
మీ పక్కనే ఓ సెలయేరు వెళుతున్నది కదా జలగాత్రంతో -
అక్కడా మీరు ఆగడం లేదు గుక్కెడు నీళ్ళ కోసం, ఏం?
ఎక్కడో ఏ దూర తీరంలో దేన్నో పొంది తీరాలనే ఆరాటంతో
ముందుకు ముందుకే దూసుకెళ్తున్న మీ చూపులకు
అటుపీ ఇటుపీ ఏం కనపడతాయి
పాపం, చల్లని సెలయేరు చిన్నబుచ్చుకున్నది
సరే, రండి రండి మా లోగిలికి!
ఇటు వైపు ఇటు వైపు, రండి సేద తీరండి
మేమూ మా నీడల తివాచీలూ ప్రేమమయి ఈ నేల తల్లీ
రాగ ఝరీ అంతా సిద్ధంగా వున్నాం, వసంతోత్సవానికి!
రండి రండి
అదేమిటి అదేమిటి
అరక్షణమైనా ఇక్కడా నిలవక మాకేససలు చూడక
అట్లాగే అదే పరుగుతో రొప్పుతూ రోదుతూ
మిమ్మల్ని మీరే ఈడ్చుకుంటూ ఎక్కడికి ఎక్కడికి?
నీడల్లేక గాలుల్లేక పాటల్లేక పరవశాల్లేక జలకాంతి లేక
మిమ్మల్ని మీరు జారవిడుచుకుంటూ
విరామం లేని పరుగెందుకు ఎందుకు
విచారం విచారం అయ్యో అయ్యో
అయినా మా ఉత్సవ ఉత్సాహం సన్నగిల్లదు
మా తివాచీలు మాయమవవు గాలులు అచలం కావు
కోయిలలు మూగబోవు నేల తల్లి అలిగి పోదు
పాదలయలతో కళకళలాడే ఆ దారి మూతపడదు
అతిథులు అవశ్యంగా వస్తారనే మా ఆశ అడుగంటదు
ఏదో ఒకనాడు మీ తర్వాతివారు ఒకరో ఇద్దరో కొందరో ఎందరో
ఇటుగా వెళ్తూ మా పిలుపు విని మాకేసి మళ్లుతారు
నీడల కడకు నడిచొచ్చి మా ఆతిథ్యఛాయల్లో సేదదీరుతారు
పరుగు కాదు, అటూ ఇటూ దర్శిస్తూ నడవడం,
శ్రమించడమే కాదు నడుస్తూ నడుమ నడుమ విశ్రమించడం,
తీరాన్ని చేరే ధ్యాసొక్కటే కాదు, దారి పొడుగూతా జీవించడం
ప్రయాణం ప్రయాణమంతా ఉత్సవమేనని తేటగా తెలుసుకుంటారు
తెలుసుకుని కొత్త చూపుతో నడక సాగిస్తూ
దారికి ఇటూ అటూ దట్టంగా ఆకు పచ్చని తోరణాలు కడతారు
మజిలీలను గుర్తు చేసే పెద్ద పెద్ద సైన్ బోర్డులను పెడతారు

- దర్భశయనం శ్రీనివాసాచార్య, 94404 19039

తొలి కవిత



పొగమంచు ఆవరించిన
ఓ సాయంకాలాన్ని గురించి
నేను రాయడం మొదలుపెట్టిన
తొలి కవితే అందమయిన కవిత
అపరిచిత భావనేదో నాలో కదిలింది
చాలా సున్నితమయిన లేత భావన
నాకు సిగ్గేసింది నేను గ్రహించలేదు
వ్యక్తం చేయలేదు కూడా
అట్లని లోపాలే అణచి వుంచుకోనూలేదు
ఓ కాగితం ముక్కనూ కలాన్నీ తీసుకున్నాను
నాకు యతి ప్రాస చంధస్సూ ఏమీ తెలీదు
నా భావం వానాకాలం
ఉప్పొంగి పారే కాలువలాగా
నా కళ్ళలోంచి పొంగింది నా చేతులు వణికాయి
ఏవో కొన్ని పిచ్చి గీతాలు గీసాను
కొన్నింటిని చెరిపేశాను
కాగితం తడితడయింది
ఆ తీయతియ్యని మాటలన్నీ కలిసి
నా తొలి కవితయ్యింది నా కవితలన్నింటిలోకీ
అందమయిన ఉత్తమ కవితయ్యింది

అరవింద్ (డోగ్రీ కవిత)
ఇంగ్లీషు అనువాదం : శివనాథ్
తెలుగు : వారాల ఆనంద్

సాహితీ వార్తలు

అమృతలత - అపురూప అవార్డ్స్ - 2024

ఈ నెల 19వ తేదీ సాయంత్రం 4.15 గంటలకు హైదరాబాద్‌లోని పి.ఎస్.తెలుగు యూనివర్సిటీ ఎన్.టి.ఆర్ ఆడిటోరియంలో 'అమృతలత - అపురూప అవార్డ్స్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సభలో అమృతలత జీవన సాఫల్య పురస్కారాలు (డా॥కె.వి.కృష్ణకుమారి, డా॥ఆలూరి విజయలక్ష్మి), అపురూప అవార్డ్స్ (జి.యస్.లక్ష్మి, సిహెచ్.సుశీలమ్మ, శివలక్ష్మి, సావేరి దర్గాభవాని, ప్రొ॥సమతా రోష్ని, నందూరి సుందరీ నాగమణిలకు) ప్రదానం వుంటుంది.

- నెల్లుట్ల రమాదేవి

అమ్మ చెక్కిన శిల్పం హిందీ అనువాదం ఆవిష్కరణ

జూలాది రత్న సుధీర్ రచించిన అమ్మ చెక్కిన శిల్పం పుస్తకం హిందీ అనువాదం - మా తుఝే నమన్ - ఆవిష్కరణ సభ ఈ నెల 14వ తేదీ సాయంత్రం 6.00 గంటలకు రవీంద్ర భారతిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతుంది. ఈ సభకు సి.ఎస్. రాంబాబు, ఏనుగు నరసింహారెడ్డి, లక్ష్మణాచార్యులు, డా. రూప్ కుమార్ డబ్బీకార్, డా. సురభి లక్ష్మీ శారద, గోవింద్ అక్షయ్, దీపక్ చిండాలియా హాజరవుతారు.

- గుడిపాటి, పాలపిట్ట బుక్స్

జీవజలం చలం సాహిత్య సభ

ఈ నెల 18వ తేదీన సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్లో చలం మ్యూజింగ్స్ - వస్తు రూపాలు అంశంపై చర్చ, చలం సాహిత్య స్మారకోపన్యాస సభ జరుగుతుంది. ఇందులో మామిడి హరికృష్ణ, సిహెచ్.ఉషారాణి, మెర్సీ మార్గరేట్, జ్వలిత, కొల్లాపురం విమల, కొండపల్లి నీహారిణి, ఐనంపూడి శ్రీలక్ష్మి, వాసరచెట్ల జయంతి, నాళేశ్వరం శంకరం పాల్గొంటారు.

ఎమ్మెస్సార్ జాతీయ స్థాయి కథల పోటీ 2024

కీ.శే. శ్రీ మలిశెట్టి సీతారామ్ గారి స్మారకార్థం కథలను (నవ్యత, సృజన ముఖ్యం) ఆహ్వానిస్తున్నారు. ఎంపికైన సాహితీవేత్తకు బహుమతి పొందిన కథలతో పాటు మరి కొన్ని ఉత్తమ కథలతో 'కథా ప్రపంచం 2024' పుస్తకం, సాహితీ పురస్కారం అందజేస్తారు. బహుమతులు వరుసగా రూ 5, 3, 2 వేల రూపాయలు. 5 పేజీల లోపు వున్న కథలను msreducationalsociety@gmail.com మెయిల్‌కు జూన్ 30 లోపు పంపాలి. వివరాలకు : యుగంధర్: 93947 82540

కవితల పోటీ ఫలితాలు

వసుంధర విజ్ఞాన వికాస మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కర్నముత్తారెడ్డి స్మారక రెండు రాష్ట్రాల స్థాయి పాఠశాల విద్యార్థుల కవితల పోటీలో మహమ్మద్ రిమ్‌షా (8వ తరగతి, తడపాకల్), కుమ్మరి అనురాధ (పదవతరగతి, ఖైరతాబాద్), ఎన్ మౌనిక (7వతరగతి, దేవరకద్ర), చెరుకూరి కార్తీక్(9వ తరగతి మంగళగిరి), వై మహతి (8వతరగతి, నిజమాబాద్).

- వి. సుమలత, కన్వీనర్

మధురకవిత్వపు స్వరఝరీ ప్రవాహం


అవును, కవిత్వం ప్రవాహం లాంటిదే ఒక్కోసారి పారుతున్న సెలయేరులా అందంగా ఉంటుంది, ఇంకోసారి ఎగసిపడుతున్న జలపాతంలా గుబులు పుట్టిస్తుంది, మరోసారి ప్రవాహాన్ని నిలిపి నిశ్చలంగా ఆలోచించమంటుంది. అసలు మనిషి బతుకంతా కవిత్వమే, నవ్వితే కళ్ళలో పుట్టే తడీ కవిత్వమే. ఏడిస్తే గుండెని తట్టే అలజడీ కవిత్వమే. ముభావపు భావమూ కవిత్వమే. మందహాసపు హాసమూ కవిత్వమే. మాటకు చమక్కులు చేర్చి, పాటకు నడకలు నేర్పి మనిషిలో జీవమై నిలిచింది కవిత్వం. కాలం తీరి రాలుతున్న ఆకు పాడే ఆఖరి పాట కవిత్వం. చిగురులేత పెదాలపై వానచినుకు పెట్టే తొలిముద్దు కవిత్వం. మండుటెండలో కనపడకుండా పోయిన నీడకోసం చెమటచుక్కల వెతుకులాట కవిత్వం. పాడె కర్రల బరువు గుండె చేతులు మోస్తున్నప్పుడు వణికే కనురెప్పల చప్పుడు కవిత్వం, లోకంలో మాటలన్నీ కవిత్వమే అంతకన్నా గొప్ప కవిత్వం 'మౌనం'.

ప్రతీ మాటకీ ఏదో ఒక భావుకతని అద్ది లోకాన్ని అందంగా మార్చిన కవులకీ కవిత్వానికీ మనం నిజంగా రుణపడి ఉన్నాం. అలాంటి కవిత్వాన్ని రాస్తూ మనతో అక్షరానుబంధాన్ని ఏర్పరుచుకున్న కవి వఝుల శివకుమార్. ఇప్పుడు ఆయన చేస్తున్న కవితా కరచాలనం 'వేళ్ళ రహస్యం'.

ఇది లోకాన్ని చుట్టివచ్చిన కవితా వాక్యం, మోహాల్లేకుండా, మొహమాటాల్లేకుండా, దడుల్లేకుండా, దాపరికాల్లేకుండా సాగే బహిరంగ ప్రవాహ ఝరి దీనికి వ్యాకరణం. ఇది తెగిపడ్డ బొడ్డుపేగుని అక్షరాలకు కలిపి కుట్టి అమ్మకు దండం పెడుతుంది, ఆకాశంలో నిలబడి శతాబ్దాల సహస్రాబ్దాల bryce సౌందర్యాన్ని ప్రశంసిస్తుంది, తల్లి ఊరుకి ప్రేమ తోరణాలు కట్టి అక్షర హారతులిచ్చి జ్ఞాపకాల దండవేస్తుంది. ఇక్కడ ప్రతిమాటా కవిత్వమే, ఆ ప్రవాహంలో నిన్నూ నన్ను వేరుగా చూడలేం. అంతా ఒకే వాక్యంలో అక్షరాల్లా ఇమిడిపోతాం, ఒకే ప్రవాహంలో కొట్టుకుపోయి ఎక్కడో అనుభూతుల తీరంలో తేలి మనం మర్చిపోయిన మనకోసం వెతుకులాడుతాం.

ఇది మనిషి చుట్టూ దడి కట్టిన అక్షర విన్యాసం, కవిత్వ పరిమళాలను మనసుకి పులుముకొని ఊరంతా వ్యాపించే బాల్యం లాగా మనకు పరిచయమవుతుంది. కుతికల మృత్తికల్లో జలపుట్టించే కవితాంతర్వాహినిగా మనతో ప్రయాణిస్తుంది. పున్నమి పుప్పొడులు జారి నేల చేరినట్టు, పారిజాత పవనాలు కదిలి వర్షం కురిసినట్టు, సీతాకోక చిలుక రెక్కలు ధరణిని మోస్తున్నట్టు, విశ్వదర్శనాన్ని అక్షరావతారంలో చూపించి, అనుభూతుల జల్లులో మనల్ని నిలువెల్లా తడిపి ఆనందిస్తుంది.

ఇది మనసుమగ్గం మీద భావాల దారాలతో నేసిన కవితా వస్త్రం, కప్పుకొని వెచ్చగా నిద్దురపోనూ వచ్చు, ఉలిక్కిపడి మెలుకువలోకి ఉదయించనూ వచ్చు ఇందులో భావుకతా ఉంది జాగరూకతా ఉంది, అక్షరాన్ని కొచ్చగా చెక్కి బల్లాలుగా చేసి గుండెల్లోకి గుచ్చే తీర్పూ ఉంది, వాక్యాలను పువ్వులుగా మార్చి అందానికి నివేదనగా చేర్చే నేర్పూ ఉంది. ఇది రెండు వైపులా కవిత్వమున్న ర్సైకవాక్యం.





- గౌతమ్ లింగా,
+ 27 630255994

> ఇది లోకాన్ని చుట్టివచ్చిన కవితా వాక్యం, మోహాల్లేకుండా, మొహమాటాల్లేకుండా, దడుల్లేకుండా, దాపరికాల్లేకుండా సాగే బహిరంగ ప్రవాహ ఝరి దీనికి వ్యాకరణం. ఇది తెగిపడ్డ బొడ్డుపేగుని అక్షరాలకు కలిపి కుట్టి అమ్మకు దండం పెడుతుంది, ఆకాశంలో నిలబడి శతాబ్దాల సహస్రాబ్దాల bryce సౌందర్యాన్ని ప్రశంసిస్తుంది.

పూలపడవల మీద పున్నమి నీడల్లా, పసితనపు పాలపుంతల్లో పుట్టిన నవ్వుల నది పరవళ్ళలా ఈ కవితా సరాగాల్లో కాలం స్వరవశమవుతుంది. అందమైన పాటలు పాడుకొని కూసింత ఆనందాన్ని బతుకుకు పులుముకుంటుంది. మనచ్చక్షువుల కొసలమీద ఆప్తస్వర్శల ఆనవాళ్ళని తట్టి లేపుతుంది. రసవాద్య తంత్రులకు భావుకతా పరిష్వంగయోగమిచ్చే అక్షరన్యాస కావ్యం ఇది. శ్రమవేదనల శబ్దానికి మనిషి పాడే ఆవేదనా నివేదన ఇది.

శివకుమార్ కవిత్వం చాలాసార్లు ఝటాజూటం విప్పి ధమరుకధ్వనితో అనర్ఘ్యమైన నాట్యం చేస్తుంది, ఆ శబ్దాలన్నీ అక్షరాల్లోకి చేరి కవితావాక్యాలై మనముందు నిలబడతాయి. మహాశూన్యాల్ని, నిండుతనపు కైదండల్ని ఒకేకాలంలో పరిచయంచేస్తాయి. ఇది మనిషి కోసం అన్వేషించే సాహితీ గవాక్షం, కొమ్మరెమ్మల కొప్పుల్లో పొద్దుపువ్వు పరిమళమై సాగుతుంది. అక్షరాన్ని తన నీడగా ప్రకటించుకొని బరువైన మనసు నుంచి బంగారు కవిత్వాన్ని స్రవించే యోగతత్త్వంగా పరిణామం చెందుతుంది. ఇక్కడ చాలా పద్యాలు పాటల అవతారమెత్తుతాయి. స్వరాలను అరువు తెచ్చుకొని లయల హొయలలో తన్మయత్వపు చిందులేస్తాయి. ఆ అక్షరశతిలో కవిత్వపు స్వరార్ణవ తుషారంలో తనువును, మనసును తడుపుకొని అందమైన దృశ్యంగా నిలిచిపోతాం, మనల్ని మనం మర్చిపోతాం.

దాటొచ్చిన కాలాన్ని మర్లేసుకునే ఊట చెలిమల్లాంటి వాక్యాలు ఈ కవిత్వమంతా అగుపిస్తాయి. దిగులు పొరల కింద దాక్కున్న కాలాన్ని తవ్వి తీసి, విరిగిన సమిష్టిసమాజపు కాల్రెక్కలు అతికించి, ఊరి మన్నులో బతుకువేర్లు తడుపుకోవాలనే తపన ఉన్న మాటలు ఎన్నో ఈ కవిత్వంలో ఎదురొస్తాయి, అన్ని ఊర్లకు మూలవాగులు ఉన్నట్టు మనుషులందరికీ మూలవాసనలుంటాయి, వాటిని తట్టిలేపే ఉషోదయాన్ని, తీరంతో మాట్లాడే అలల ఆరాటాన్ని, గట్ల తీగలమీద శ్రమ తత్వాలు పాడుకునే మట్టిమనుషుల జీవనవైచిత్ర్యాన్ని ఈ కవిత్వం గుర్తుచేస్తుంది.

ఇది అలుగులు దుంకిన అక్షరప్రవాహం, జీవన మలుపులని కవిత్వంలోకి ఒంపి గరికపూల పరిమళమై ప్రేమ వెన్నెలని కలగంటుంది. ఇది తొక్కిపెట్టిన పాదాల కింద స్వరబాస్వరం, తలలోపలి వెక్కిరింతలని ఎదిరించి ఊపిరి తీగల ఉద్విగ్నతను ఆత్మగీతంగా పాడుతుంది. ఇది కరవాలాలు విరగని యుద్ధక్షేత్రం, ఉమ్మనీటినుంచి ఉప్పునీటిదాకా సాగిన మహాప్రయాణానికి సాక్ష్యంగా నిలబడుతుంది.

భయోద్విగ్న నేత్రాలతో లోకాన్ని చూస్తున్న పసిడిపిల్లల తరపున ఈ కవిత్వం మాట్లాడుతుంది. దు:ఖపు ఎక్కిళ్లను చిటికెల చప్పుళ్ళతో ఆపే సామాజిక యుద్ధం తరపున ఈ కవిత్వం మాట్లాడుతుంది. మగాల గాయాలకు కన్నీటి మందులు రాస్తున్న ఆడపిల్లల తరపున ఈ కవిత్వం మాట్లాడుతుంది.

బతుకుని ప్రేమించినోడికే ఇలాంటి కవిత్వం రాయడం సాధ్యమవుతుంది. కవితా వస్తువులన్నీ మనిషి చుట్టూనో, అతని సంఘర్షణల చుట్టూనో తిరుగుతాయి. సామాజిక బాధ్యతను నెత్తికెత్తుకుంటాయి. ఈ అక్షరాలు చైతన్య శంఖారావాలు, సంఘర్షణల సంద్రానికి సాంత్వనాతీరాలు.

ఎన్నో కాంతివత్సరాలుగా సాగుతున్న మనిషి జీవన ప్రయాణానికి అక్షరం ప్రాణం పోసింది, కవిత్వం జీవమిచ్చింది, అధ్యయన సొగసులద్దుకొని హద్దులు లేకుండా సాగుతున్న జనజీవనప్రగతియానాన్ని చరిత్రకెక్కించే ప్రతీ ప్రయత్నం అభినందనీయమే, ఇంత కాలంగా కవిత్వమై పూస్తూ తనచుట్టూ భావాల లతలతో అక్షరపూతోట కట్టుకున్న వఝుల శివకుమార్ అభినందనీయుడు, 'వేళ్ళ రహస్యం' లోకానికి తన స్పష్టమైన గాఢ కవితాలింగనం.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం

సోమవారం | మే 13, 2024 | www.navatelangana.com



పోలింగ్ కేంద్రాలకు తరలిన ఈవీఎంలు, పోలింగ్ సామాగ్రి

- 294 బూత్‌లు, 327మంది పీవోలు, మరో 327 ఏపీవోలు
- 734 మంది ఓపీవోలు, 23మంది మైక్రో అబ్జర్వర్లు
- 28 రూట్లు, 70బస్సులు, 400మంది పోలీస్ సిబ్బంది

నవతెలంగాణ-సత్తుపల్లి

నేడు (సోమవారం) జరగనున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఈవీఎంలు, ఈప్యాట్స్, ఇతర స్టేషనరీ సామాగ్రిని సంబంధిత పోలింగ్ అధికారులు తరలించేందుకు స్థానిక జ్యోతి నిలయం పాఠశాలలో ఆదివారం డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 294 బూత్‌లకు సంబంధించి అవసరమైన ఈవీఎంలు, ఈప్యాట్స్, స్టేషనరీ, ఇతర సామాగ్రిలను ఆయా పోలింగ్ బూత్‌ల నిర్వహణ అధికారులకు డిస్ట్రిబ్యూషన్ చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 327మంది పోలింగ్ ఆఫీసర్లు, మరో 327మంది సహాయక పోలింగ్ ఆఫీసర్లను ఏర్పాటు చేశారు. 734మంది ఓపీవోలను సైతం పోలింగ్ నిర్వహణకు ఏర్పాటు చేశారు. 23మంది మైక్రో అబ్జర్వర్లను సైతం ఇందుకు నియమించారు.

28 రూట్లు... 70 బస్సులు

28 రూట్లలో విస్తరించి ఉన్న పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలు, ఈప్యాట్స్, పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు 70బస్సులను ఆయా రూట్లకు పోలింగ్ అధికారులు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆయా బూత్‌లకు సంబంధించి పోలింగ్ యంత్రాలు, స్టేషనరీ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం జరిగింది. సామాగ్రిని అందుకున్న పోలింగ్ సిబ్బంది తమకు ఏర్పాటు చేసిన బస్సుల్లో ఆదివారం రాత్రే ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్ రాజేందర్, ఎన్నికల అబ్జర్వర్ సంజయ్ కోల్టే పర్యవేక్షణలో పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం జరిగింది. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు ఏసీపీ అనిశెట్టి రఘు ఆధ్వర్యంలో 400మంది పోలీస్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు బందోబస్తుకు తరలివెళ్లారు.

15 మోడల్ పోలింగ్ స్టేషన్లు

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గంలోని 15 మోడల్ పోలింగ్ స్టేషన్లో ఏర్పాటు చేసినట్లు ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గం ఎన్నికల అధికారి వి.పి గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలోని ఖమ్మం ఎస్ఎస్సి కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఖమ్మం రాజేందర్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల, పాలేరు నియోజకవర్గంలోని పాలేరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఖమ్మంరూరల్ గొల్లపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నాయుడుపేటలోని మండల పరిషత్ ప్రైమరీ పాఠశాల, మధిర నియోజకవర్గంలోని మధిరలోని జిల్లా పరిషత్ బాలికల సెకండరీ పాఠశాల, జానకిపురంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, మధిర సుందరయ్య నగర్‌లోని మండల పరిషత్ ప్రైమరీ పాఠశాల, వైరా నియోజకవర్గంలోని వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల, వైరాలోని మండల పరిషత్ ప్రైమరీ పాఠశాల, సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కిష్టారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గౌరీగూడెం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పార్లమెంటు పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి : తహశీల్దార్

నవతెలంగాణ-ముదిగొండ

మండలంలోని 25 గ్రామపంచాయతీలలో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తాసిల్దార్ ఎర్రపాటి రామారావు ఆదివారం తెలిపారు. మండలంలోని 55 పోలింగ్ కేంద్రాల ద్వారా 48,212 మంది ఓటు హక్కు వినియోగించుకునే వారు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ఓటర్లు, రాజకీయ పార్టీల వారు సహకరించాలని ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినచో చర్యలు ఉంటాయని, పోలింగ్ కేంద్రాల పరిసరాలలో 144 సెక్షన్ అమల్లో ఉందని తాసిల్దార్ వై.రామారావు చెప్పారు.

రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుకలు


నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం నగరంలో వీడియోస్ కాలనీ సాయిబాబా ధ్యాన మందిరంలో ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం యోగ ప్రాణాయామం, సుదర్శన్ క్రియ, మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారుగా 40 మంది రక్తదాతలు పాల్గొన్నారు. అలాగే సాయంత్రం గురుపూజ, సత్సంగ్ (భక్తి భజన) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఖమ్మం ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్స్ వెంకట్, కోటేశ్వరరావు, శ్రీనివాస్, వాలంటీర్స్ వెంకట్ రెడ్డి, శ్రీలత, సత్యవతి, గోపాల్, హరి, రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

కోటమైసమ్మతల్లి ఆలయానికి ఏసి వితరణ

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి మండలం ఉసిరి కాయలపల్లిలోని శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయానికి ఖమ్మంకు చెందిన సామినేని గంగాధర్-క్రిష్ణవేణి దంపతులు ఏసీ (ఎయిడ్ కండీషనర్)ను వితరణ చేశారు. అమ్మవారి గర్భగుడిలో ఏర్పాటు చేయటానికి సామినేని గంగాధర్ దంపతులు రూ.40వేల విలువైన ఏసీ ఆలయ అర్చకులు కొత్తలంక కైలాసశర్మ, మేనేజర్ మూడు మోహన్‌చౌహాన్‌కు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాబి రామారావు, ఈవో వేణుగోపాలచార్యులు మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధిలో దాతలు బాగస్వామ్యం కావాలని కోరారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఆలయ ఈవో భీమవరపు సూర్యప్రకాష్‌రావు, సామినేని వెంకటేశ్వర్లు, వాణి శ్రీ, భీమవరపు శ్రీనివాసరావు, గాలి రంగారావు, రమాదేవి, వసంత కుమారి పాల్గొన్నారు.

కారేపల్లిలో రూ.3.50 లక్షలు పట్టివేత

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి మండల పరిధిలోని ముత్యాలగూడెం సమీపంలో ఆదివారం కారులో తరలిస్తున్న పైకాన్ని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. తనిఖీలలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ముత్యాలగూడెం వైపు వెళ్తుండగా అనుమాన స్పదంగా నిలిచిన కారు కనిపించింది. ఆ కారును తనిఖీ చేసిన అధికారులు దానిలో ఇద్దరు బీజేపీ కార్యకర్తల నుండి రూ. 346500 పైకంను స్వాధీనం చేసుకున్నారు. వాటిని చేశారు. దీనికి సంబంధించి ఎన్నికల అధికారుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.రాజారాం తెలిపారు.

ముగిసిన సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి సాయిమందిరంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవాలలో భాగంగా ఆదివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజుల పాటి జరిగిన వార్షికోత్సవాలు మహా పూర్ణాహుతితో ముగిశాయి. చివరి రోజు మూల మంత్ర హెూమాలు, ఆలయ శిఖరాభిషేకాలను ఆలయ అర్చకులు నాగసాయి శర్మ ఆధ్వర్యంలో వేద పండింతులు నేదనూరి నరేష్, దుగ్గినేని హనుమంతరావు, నేదునూరి విఠల్ దంపతులు చేతుల మీదిగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్మాణ కర్త యలమంచిలి సూర్యనారాయణ, కమిటీ సభ్యులు ఆమంచ బుచ్చిబాబు, ఇందుర్తి సురేందరెడ్డి, యర్ర చక్రపాణి, సురేందర్‌మనియార్, సూర్యదేవర వెంకటేశ్వర్లు, పర్సా సన్నత్‌కుమార్, చౌడారపు రమేష్, చిన్ని శ్రీనివాసరావు, రాము ధరక్, ప్రసాద్, నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

'ఓటె'త్తాలి..!

నేడు 18వ లోక్‌సభ ఎన్నికలు...

- ఉదయం 7 నుంచి సాయంత్రం
- 6 గంటల వరకు పోలింగ్

ఖమ్మం, మానుకోటల్లో ఎన్నిక ఎన్నికకూ

- తగ్గుతున్న ఓట్ల శాతం
- ఈసీ దృష్టి సారించినా ఓటర్ల సామాజిక బాధ్యతతోనే పెరుగుదల
- ఖమ్మంలో 16,31,039; మహబాద్‌లో 15,32,366 మంది ఓటర్లు
- ఖమ్మం బరిలో 35 మంది... మూడు ఈవీఎం యూనిట్లు

మహబూబాబాద్‌లో 23 మంది పోటీ... రెండు ఈవీఎం యూనిట్లు

సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్‌శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం ఎన్ని చర్యలు తీసుకున్నా ఓటర్ల వైపు నుంచి పెద్దగా ఫలితం ఉండటం లేదు. ఓటేసేందుకు కొందరు ఆసక్తి చూపటం లేదు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు మూడు విడతల్లో పోలింగ్ 70శాతం దాటకపోవడం దీనికి నిదర్శనం. 15 లక్షల ఓటర్లు ఉన్న చోట కనీసం రెండు, మూడు లక్షల మందైనా ఓటుకు దూరంగా ఉండటం ఆందోళన కలిగించే అంశం.

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలపై ఓటర్ ఆసక్తి నానాటికీ తగ్గుతోంది. ముఖ్యంగా తెలంగాణలో 2018 నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి కాకుండా వేర్వేరు సమయాల్లో వస్తుండటం కూడా పోలింగ్ శాతంపై ప్రభావం పడుతోందని నిపుణుల అంచనా. గతంలో లాగా ఒకేసారి ఎన్నికలు రాకపోవడంతో దేశవ్యాప్త ఎన్నికలపై ఓటర్లు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే ఓటుకు నోటు అలవాటు పడిన అనేక మంది అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే పార్లమెంట్ ఎన్నికలకు డబ్బులు తక్కువగా ఇస్తుండటంతోనూ ఓటుపై అనాసక్తి ప్రదర్శిస్తున్నట్లు చర్చ సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ పరిధిలో రూ.1000 నుంచి రూ.8వేల వరకు పలికిన ఒక్కో ఓటు...ఇప్పుడు రూ.500కే పడిపోవడంతో కొందరు అయిష్టత ప్రదర్శిస్తున్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోనూ అసెంబ్లీ ఎన్నికల్లో రూ.500 నుంచి రూ.3000 పలికిన ఓటు ఇప్పుడు రూ.100- 250కి పడిపోయిందని చర్చించుకుంటున్నారు. దూరభారం, ఎండల తీవ్రత, పోలింగ్ రోజున సెలవు ప్రకటించడంతో కొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లటం, ఇంకొందరు ఇంట్లో నుంచి కాలు బయటకు పెట్టకపోవడం, అభ్యర్థులపై విముఖత, ఐదారు నెలల వ్యవధిలో రెండోసారి ఓట్లు వేయాల్సి రావడం...వంటి ప్రతికూలతల కారణంగా పోలింగ్ పర్సంటేజ్ తగ్గుతోంది. ఈసారి అలాంటివేవీ లేకుండా ఎన్నికల సంఘం జాగ్రత్త పడినా శని, ఆదివారాలు వీకెండ్స్ కావడం, సోమవారం పోలింగ్ నిర్వహిస్తుండటంతో అనేక మంది ఓటుకు దూరమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీనికి తోడు ఖమ్మం, మహబూబాబాద్ వంటి పార్లమెంట్ స్థానాలు ఆంధ్రా సరిహద్దు ప్రాంతాలు కావడంతో అనేక మంది ఇక్కడి ఓట్లను వదిలేసి ఆంధ్రప్రదేశ్ ఎన్నికలపై దృష్టి సారించారు. కొందరు ఆ రాష్ట్రానికి వెళ్లి కొద్దిరోజులుగా అక్కడే ఉంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు. మరికొందరు శని, ఆది, సోమవారాలు అక్కడే తిష్ట వేసి ఆ రాష్ట్రంలోని తమ బంధుమిత్రుల చేత తమకు అనుకూలమైన పార్టీకి ఓట్లు వేయించే పనిలో నిమగ్నమయ్యారు.

సమయం పెంచినా పోలింగ్‌శాతం పెరిగేనా...?

ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ పర్సంటేజ్ పెంచేందుకు ఈసీఐ ఎన్నికల సమయాన్ని పెంచింది. సాధారణంగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. కానీ ఈసారి సాయంత్రం మరో గంట అంటే 6 గంటల వరకు అవకాశం కల్పించింది. పెంచిన సమయం ఖమ్మం జిల్లా పరిధిలోని ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి శాసనసభ స్థానాలకే వర్తిస్తుంది. అలాగే మహబూబాబాద్ పరిధిలోని డోర్నకల్, మహబూబాబాద్ అసెంబ్లీ స్థానాల్లోనే 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ సాగుతోంది. ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని అశ్వారావుపేట, కొత్తగూడెం, మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలో నర్సంపేట, ములుగు, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ స్థానాల్లో 4 గంటలకే పోలింగ్ ముగుస్తుంది.

అవగాహన కల్పించినా అదే తీరు...

ఓటర్లు స్వీయప్రేరణతో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చేలా యంత్రాంగం అవగాహన కల్పిస్తున్నా ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదు. 2009, 2014, 2019 పార్లమెంట్ ఎన్నికలు వీటిని స్పష్టం చేస్తున్నాయి. ఖమ్మం లోక్‌సభ స్థానంలో 2009లో 82.08%, 2014లో 82.20% పోలింగ్ నమోదవ్వగా 2019లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు వేర్వేరు సమయాల్లో రావడంతో 75.30% ఓటింగ్ పడిపోయింది. మహబూబాబాద్‌లో 2014లో 81.21% మంది ఓటు హక్కు వినియోగించుకోగా 2019లో 69.06 శాతం పోలింగ్ నమోదైంది. ఈ స్థానంలో 2009లో 9,96,402 మంది ఓటు హక్కు వినియోగించుకోగా పదేళ్ల తర్వాత 2019లో 14.23 లక్షల ఓటర్లకు గాను కేవలం 9,82,734 మందే ఓటు వేయడం గమనార్హం. 2009తో పోల్చితే 2019లో 14వేల మంది తక్కువగా ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఈసారైనా పెరిగేనా...

ఖమ్మం పార్లమెంట్ పరిధిలో 16,31,039 మంది ఓటర్లు ఉండగా వీరి కోసం 1896 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. 35 మంది బరిలో ఉన్నారు. ఒక్కో ఈవీఎంకు 16 మంది చొప్పున మూడు యూనిట్లు ఏర్పాటు చేశారు. అలాగే మానుకోట పరిధిలో 15,32,366 మంది ఓటర్లు ఉండగా 23 మంది పోటీ పడుతున్నారు. రెండు ఈవీఎం యూనిట్లు ఏర్పాటు చేశారు. దాదాపు రెండు నియోజకవర్గాల్లో అందరికీ పోల్ స్లిప్‌లు పంపిణీ చేశారు. సాక్ష్యం యాప్‌లో దరఖాస్తు చేసుకున్న 17వేల మందిని పోలింగ్ స్టేషన్‌కు తరలించేందుకు ఎలక్షన్ కమిషనే వాహనాలను ఏర్పాటు చేసింది. హెూమ్ బ్యాలెట్ సౌకర్యం కూడా కల్పించింది. ఇప్పటికే ఖమ్మం పరిధిలో 2,728 మంది హెూం బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఇలా ఎన్నో వెసులుబాట్లు కల్పిస్తున్నా... సామాజిక బాధ్యతగా కొందరు ఓటర్లు ఫీల్‌కాకపోవడం వల్లనే పోలింగ్ పర్సంటేజ్ తగ్గుతుందని పరిశీలకుల విశ్లేషణ. ఎంత అత్యవసరమైనా ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని రాజకీయ నాయకులు, అభ్యర్థులు, ఎన్నికల యంత్రాంగం విజ్ఞప్తి చేస్తోంది.



గ్రామీణ వైద్యులకు భయం లేదు

- ప్రాథమిక చికిత్సకే పరిమితమవుదాం
- గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు పి.నాగేశ్వరరావు

నవతెలంగాణ-కారేపల్లి

గ్రామీణ ప్రాంతంలో పేదలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలందిస్తున్న గ్రామీణ వైద్యులు భయపడాల్సి అవసరం లేదని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లాఅధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు, ప్రధానకార్యదర్శి అనంతారపు వెంకటాచారి లు అన్నారు. ఆదివారం కారేపల్లి క్రాస్ రోడ్ లో విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల పేర్లకు ముందు డాక్టర్ అనే పదం వైద్యసాయం తీసుకుని సంతృప్తి చెందిన వారు గౌరవపూర్వకంగా వాడుతుంటారన్నారు. నిబంధలకు అనుగుణంగా గ్రామీణ వైద్యులు వైద్యం అందించాలని పరిధి దాటి వైద్యం చేసి పేదల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దన్నారు. గ్రామీణ వైద్యులకు ప్రతినెల నిర్వహించే మండల సమావేశాలలో క్వాలిఫై డాక్టర్లచే శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. నిబంధనలకు కట్టుబడి ప్రతి గ్రామీణ వైద్యుడు పనిచేయాలని నిబంధనలు అతిక్రమిస్తే సంఘం బాధ్యత వహించదని హెచ్చరించారు.



పని పూర్తయినా తొలగించని మట్టి దిబ్బలు

- ప్రమాదకరంగా రహదారి
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో యువకుడికి గాయాలు

నవతెలంగాణ-కల్లూరు



ఆర్అండ్‌బి రహదారిపై అడ్డదిడ్డంగా ఉన్న మట్టిదిబ్బల కారణంగా ద్విచక్రవాహనం పల్టీ కొట్టిన రోడ్డు ప్రమాద ఘటనలో కల్లూరు పట్టణానికి చెందిన బొల్లం లక్ష్మణరావు అనే యువకుడు గాయాల పాలైన సంఘటన శనివారం రాత్రి జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం. పట్టణానికి చెందిన బొల్లం లక్ష్మణ్‌రావు కల్లూరు నుండి పుల్లయ్య బంజర గ్రామం వైపు ద్విచక్ర వాహనంపై శనివారం రాత్రి సమయంలో వెళుతున్నాడు. శ్రీకాశ్మీర మహాదేవ క్షేత్రం(శివాలయం) సమీపాన దేవాలయం వైపు వెళ్లే మట్టి రహదారి కార్నర్ వద్ద గల ఆర్అండ్‌బి రహదారి సమీపానికి చేరుకోగానే రహదారిపై అడ్డదిడ్డంగా ఉన్న మట్టి దిబ్బల వలన ఆకస్మికంగా ద్విచక్ర వాహనం పల్టీ కొట్టి సుమారు 8 మీటర్ల దూరంలో యువకుడు పడిపోయాడు. ఈ ప్రమాద ఘటనలో యువకుడికి తలకు గాయాలై రక్తస్రావం కాగా, మెడ వెనుక భాగం, ఎడమ చేయి కాలర్ బోన్ ఎముకకు దెబ్బ తగిలింది. ఇదే తరుణంలో కల్లూరు నుండి పుల్లయ్య బంజర వైపు వెళుతున్న పలువురు గ్రామస్తులు ప్రమాద సంఘటనా స్థలంలోని యువకుడికి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గాయపడిన యువకుడిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక వైద్య చికిత్సలు చేయించారు. ఆదివారం ఉదయం గాయపడిన యువకుడు బొల్లంలక్ష్మణ్‌రావును కల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్లగా వైద్యులు డాక్టర్ నవ్య కాంత్ వైద్య సేవలు అందించారు. ఈ విధంగా గతంలో కూడా ముగ్గురు ప్రమాదానికి గురయ్యారని గ్రామస్తులు తెలిపారు. ఆర్అండ్‌బి రహదారిపై మరమ్మతు పనులలో భాగంగా సదరు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇటీవల రోడ్డు కింది భాగంలో పైపులు వేసి కల్వర్టు నిర్మాణం చేపట్టడం జరిగిందని, నిర్మాణం పూర్తయి 20 రోజులు కావస్తున్న రహదారిపై అడ్డదిడ్డంగా ఉన్న మట్టిదిబ్బలను తొలగించలేదని, సంబంధిత ఆర్అండ్‌బి అధికారులు సదర్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదానికి గురయ్యారని పుల్లయ్య బంజర గ్రామానికి చెందిన సాదిక్ పాషా, ప్రవీణ్, తదితరులు సంఘటనా స్థలంలో ఆరోపించారు. కేవలం ఆర్అండ్‌బి రహదారిపై అడ్డదిడ్డంగా ఉన్న మట్టి కుప్పల కారణంగానే రాత్రి వేళల్లో ఆర్అండ్‌బి రహదారిపై ప్రయాణించే సందర్భంలో రహదారి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని, కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డు కూడా పెట్టలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని ప్రమాదాలు జరగకుండా రోడ్డుపై అడ్డదిడ్డంగా ఉన్న మట్టి దిబ్బలను తొలగించి, ప్రజలను ప్రమాదాల బారి నుంచి రక్షించాలని కోరుతున్నారు.



వైరా నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా నియోజకవర్గ కేంద్రంలో ఆ నియోజకవర్గ ఎలక్ట్రాన్ మీడియా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం వైరా రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల సమావేశంలో నూతన అధ్యక్షుడిగా చింతల వసంతరావు, ఉపాధ్యక్షుడిగా ఎస్కే.రఫీ, ప్రధాన కార్యదర్శిగా సత్తెనపల్లి లక్ష్మణాచారి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వసంతరావు మాట్లాడుతూ వైరా నియోజకవర్గంలోని గత 15, 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల ప్రధాన కోరిక ఇంటి స్థలాల సాధన హెల్త్ కార్డుల విషయంలో జర్నలిస్టుల భీమా సమస్యల పరిష్కారం కొరకు చొరవ చూపుతానని స్థానిక ఎమ్మెల్యే మంత్రుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. గౌరవ అధ్యక్షునిగా మామిళ్ళపల్లి విజయ్, సహాయ ఉపాధ్యక్షులుగా మఠం దినేష్ కుమార్, జీ.ప్రశాంత్, కోశాధికారిగా రేచర్ల నాగరాజు తదితరులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో భూక్య శ్రీనివాసరావు, నెమలికొండ గోవిందాచారి, ధర్మపురి రవితేజ, మాచర్ల యోగానంద్, సత్తెనపల్లి నరసింహారావు, నోముల తిరుమలరావు, ఆత్మకూరు శేషగిరిరావు, పమ్మి రాజు, గొల్లమందల బాబు, సురేష్, సాదం సాయి లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.



వైరా రిజర్వాయర్‌కు హాఫ్ టీఎంసీ సాగర్ జలాలు విడుదల చేయాలి

- మాజీ ఎంపీపీ బొంతు సమత

నవతెలంగాణ-వైరాటౌన్

మిషన్ భగీరథ మంచినీటి అవసరాలకు సాగర్ జలాలు హాఫ్ టీఎంసీ వైరా రిజర్వాయరుకు విడుదల చేయాలని మాజీ ఎంపీపీ, సీపీఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు బొంతు సమత డిమాండ్ చేశారు. ఆదివారం బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో రుద్రాక్షల నరిసింహాచారి అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ(ఎం) సుందరయ్య నగర్ శాఖ సమావేశంలో బొంతు సమత మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ, మండల పరిధిలో తాగు నీరు సరఫరా ఇబ్బందులు తొలగించాలన్నారు. రోజు రోజుకు వైరా రిజర్వాయర్ నీటి మట్టం అడుగు అంటుతున్న సమయంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సాగర్ జలాలు విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో శాఖ కార్యదర్శి మందడపు రామారావు, పట్టణ సీనియర్ నాయకులు కురుగుంట్ల శ్రీనివాసరావు, ఎస్‌కే. జమాల్, వడ్లమూడి మధు తదితరులు పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

నవతెలంగాణ-వైరాటౌన్

మహిళలకు వివిధ రకాలైన ప్రోత్సాహకాలు అందించాలనే ఉద్దేశంతో లయన్స్ క్లబ్ వైరా వారి ఆధ్వర్యంలో మహిళలకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు. లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్రరావు అధ్యక్షతన స్థానిక బాలాజీ టవర్స్‌లో జరిగిన క్లబ్ సభ్యుల పెళ్లిరోజు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మీల్స్ అండ్ వీల్స్ కోఆర్డినేటర్ చింతోజు నాగేశ్వరరావు, సీత పెళ్లిరోజును పురస్కరించుకొని నర్సింగ్ కోర్స్ చేస్తున్న ఖమ్మంకు చెందిన కావ్యకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. క్లబ్ సహాయ కార్యదర్శి కొల్లా రాంబాబు నాగమణి పెళ్లి రోజున పురస్కరించుకొని పెనుబల్లి మండలం తాళ్ల పెంటకు చెందిన నడిపల్లి శ్రీదేవికి ఉపాధి నిమిత్తం 7000/- రూపాయలు విలువచేసే కుట్టు మిషన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్రరావు, రీజన్ చైర్మన్ లగడపాటి ప్రభాకర్, కార్యదర్శి అబ్బురి రమేష్, కోశాధికారి చింతలపూడి వెంకటేశ్వరరావు, మీల్స్ అండ్ వీల్స్ కోఆర్డినేటర్ చింతోజు నాగేశ్వరరావు, సీత సహాయ కార్యదర్శి కొల్ల రాంబాబు, గజ్జల కృష్ణమూర్తి, వనమా వెంకటేష్, కొమిరిశెట్టి శ్రీధర్, మిట్టపల్లి శ్రీనివాసరావు, బండారు సరిత, కన్యదారి హనుమాయమ్మ రాయపూడి వెంకటేష్, మిట్టపల్లి నాగేశ్వరరావు, చెరుకూరి శ్రీనివాసరావు, వై.బుచ్చిరామారావు, పెనుగొండ రిషివర్ష కావ్య చారి, చెరుకూరి వాసవి తదితరులు పాల్గొన్నారు.

మాతృ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం



మండల కేంద్రమైన ఎర్రుపాలెం శివాలయ ప్రాంగణంలో మండల ఆర్యవైశ్య-వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవం సందర్భంగా ఆదివారం మాతృ వందనం పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వాసవి క్లబ్ మండల అధ్యక్షులు దూపుకుంట్ల వెంకట అప్పారావు, కేతేపల్లి నరసింహారావు, కొప్పు పరమేశ్వరరావుల ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు తమ మాతృమూర్తుల పాదాలకు పాదపూజ నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో వచ్చిన మహిళలకు తల్లులకు స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ మన చుట్టూ ఎన్ని బంధాలు ఉన్న అమ్మ అనే బంధం లేకపోతే మనం అందరం అనాథలమేనని తెలిపారు. బిడ్డల భవిష్యత్తుకై నిత్యం శ్రమిస్తూ వాళ్ల ఆనందంతో తన కష్టాన్ని మరిచిపోతూ తన సంతోషాన్ని బిడ్డలకు పంచుతున్న అమ్మలందరికీ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని రాజుల దేవరపాడు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బండారు నాగరాజు, వేమిరెడ్డి రత్నాలరెడ్డి కుటుంబాలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సుధాకరరెడ్డి, బండారు నరసింహారావు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కిసాన్ సెల్ అధ్యక్షులు తలపురెడ్డి నాగిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు దుద్దుకూరు తిరుపతిరావు, లక్కిరెడ్డి అయ్యప్పరెడ్డి, మగినం సాంబయ్య, ఐలూరి పుల్లారెడ్డి, దుద్దుకూరు చెన్నయ్య పాశం రవి, బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ ర్యాంకు సాధించిన విద్యార్థులకు సన్మానం

నవతెలంగాణ-కల్లూరు



పట్టణంలోని తెలంగాణ గ్రామర్ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఎస్‌కే. సన బైపీసీ గ్రూప్ 435/440 మార్కులు, కే. గోవర్ధన్ ఎంపీసీలో 467/470, మార్కులు సాధించి స్టేట్ సెకండ్ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో చైర్మెన్ ఎస్కే. జానీ మియా, వైస్ చైర్ మెన్ పసుమర్తి చంద్రరావు శాలువలతో సత్కరించి రూ. 10 వేలు పారితోషకం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆర్.రంజిత్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ కేశవరావు, పాఠశాల హెచ్ఎం ఇందిరా, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీపీ. గౌతం

నవతెలంగాణ-వైరాటౌన్



ఖమ్మం పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో విధులు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ.గౌతం కోరారు. వైరా నియోజకవర్గ కేంద్రంలోని టీఎస్ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో పోలింగ్ కేంద్రాలకు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ ఎన్నికల సిబ్బందికి ఈవీఎం బాక్సులు, ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేశారు. ఆదివారం ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని వీపీ.గౌతమ్ జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ అధికారులను అప్రమత్తంగా ఉండాలని కోరారు. వైరా నియోజకవర్గంలోని వైరా, కొణిజర్ల, ఏన్కూర్, సింగరేణి, జూలూరుపాడు ఐదు మండలాల పరిధిలో ఉన్న 252 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామాగ్రిని, పోలింగ్ సిబ్బందిని నియమించటం జరిగిందని తెలిపారు. అసెంబ్లీ సిగ్మెంట్లో 23 సెక్టార్లుగా విభజించి పోలింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్స్‌ను నియమించి ప్రత్యేక బస్సుల్లో తరలించడం జరిగిందని, ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ బాక్సులను భద్రంగా ఉంచాలని, పోలింగ్ స్టేషన్ లోనే సిబ్బంది బస చేయాలని, పోలింగ్ శాతం ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు తెలియజేయాలని కోరారు. ఖమ్మం పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి పోలింగ్ సామాగ్రిని పంపిణీ చేసినట్టు తెలిపారు. కలెక్టర్ వెంట పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి సత్యప్రసాద్, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ కేంద్రాల చేరుకున్న సిబ్బంది
- అన్ని సౌకర్యాలు ఏర్పాటు

నవతెలంగాణ-కల్లూరు



పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం జరిగే పోలింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తహసీల్దార్ పులి సాంబశివుడు ఆదివారం విలేకరులకు తెలిపారు. మండలంలో ఉన్న ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు మండలంలో 63 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి పోలింగ్ సిబ్బంది నలుగురు చొప్పున మొత్తం 250 మందిని పోలింగ్ సిబ్బందిని నియమించారు. పోలింగ్ కేంద్రానికి ఇద్దరూ అవసరాన్ని బట్టి మరి కొంత మందిని సిఆర్పిఎఫ్ ఫోర్సు నియమించారు. పోలింగ్ ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని ఓటు వేయడానికి వచ్చిన ప్రజలకు నీడ సౌకర్యం కల్పించేందుకు టెంట్లు వేశారు. మంచినీటి సౌకర్యం ప్రతి కేంద్రంలో ప్రథమ చికిత్స ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఓటరు స్లిప్పుతో పాటు గుర్తింపు కార్డు తీసుకొని వచ్చి ఓటు వేయాలని కోరారు. ఆధార్, పోస్ట్ ఆఫీస్, బ్యాంక్ పాస్ పుస్తకాలు, డ్రైవింగ్ లైసెన్స్ ఫోటోతో కూడిన ఐడెంటి కార్డును వెంట తీసుకొని రావాలని కోరారు. మండలంలో సుమారు 54,000 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

144 సెక్షన్ అమలు ప్రశాంత పోలింగ్‌కు సహకరించండి : ఎస్ఐ షాకీర్

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నిర్వహించే పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఆదివారం నుండి సోమవారం రాత్రి వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్సై ఎస్కే. షాకీర్ తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో ప్రచారం చేయకూడదని, ఐదుగురు మించి గుమ్మి కూడవదని తెలిపారు. మండలంలో చెన్నూరు, చిన్న కోరుకొండి, వెన్నవల్లి, కప్పల బంధం ఖాన్ ఖాన్ పేట, కల్లూరు, గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించినట్లు తెలిపారు. ఆ గ్రామాల్లో పోలీస్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు నిబంధనలను పాటించి సహకరించాలని కోరారు.

ఓటర్లకు పంపిణీ చేస్తున్న రూ.4 లక్షలు సీజ్

- ఎంపీపీతోపాటు, మరో ఇద్దరిపై కేసు నమోదు

నవతెలంగాణ-ముదిగొండ

పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నామ నాగేశ్వరరావుకు ఓట్లు వేయాలని మండలపరిధిలో మేడేపల్లిలో ఎంపీపీ సామినేని హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఖమ్మంకు చెందిన ఎస్కే పాష, ముదిగొండకు చెందిన గుంటి నరేష్ అనే ఇద్దరు వ్యక్తులు ఓటర్ లిస్ట్ ప్రకారం శనివారం రాత్రి ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తుండగా ఫ్లయింగ్ స్కాడ్ అధికారులు రూ 4,29,500తోపాటు,ఓటర్ లిస్టును స్వాధీనం చేసుకుని సీజ్ చేసి,ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గజ్జెల నరేష్ ఆదివారం తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్.ఎస్సై నరేష్. నవతెలంగాణ ముదిగొండ.మండలంలో సోమవారం జరిగే పార్లమెంటు ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని ఎస్సై గజ్జెల నరేష్ ఆదివారం తెలిపారు.పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో గుంపులు గుంపులుగా తిరగరాదని, ఎవరైనా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినచో కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ బలగాలచే పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.



ఎంపీ వద్దిరాజుకు సన్మానం

నవతెలంగాణ-ఖమ్మం

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను పవర్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆదివారం ఖమ్మం బురహాన్‌పురంలోని క్యాంప్ కార్యాలయంలో ఎంపీ రవిచంద్రను అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఖమ్మం జిల్లా కార్యదర్శి మనోజ్ కుమార్, సభ్యులు రాపర్తి రాజా, బోయిన కార్తీక్, బాలు నాయుడు, నగీనా శాలువాలతో సన్మానించారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం ఎదురుగా ఉన్న "క్లాసిక్ జిమ్"పక్షాన కలిసిన వీరిలో బాలు నాయుడు "మిస్టర్ ఇండియా" తెలంగాణ పోటీలలో వెండి పతక విజేత, బోయిన కార్తీక్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో "ది బెస్ట్ లిఫ్టర్"గా ప్రశంసలందుకున్నారు. నగీనా"స్ట్రాంగ్ ఉమెన్"టైటిల్ గెల్చుకున్నారు. రాపర్తి రాజా ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన ఖమ్మంలోని టీఎన్జీవో భవన్ ప్రాంగణంలో జరిగే పవర్ వెయిట్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలకు ఎంపీ వద్దిరాజును ముఖ్య అతిథిగా హాజరు కావాలని వారు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై బీజేపీని ఓడించండి

- ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ

నవతెలంగాణ-ఖమ్మం



బీజేపీని ఓడించకపోతే ప్రభుత్వ విద్యా వ్యవస్థ ధ్వంసం అవుతుందని, నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై బీజేపీని ఓడించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని గిరి ప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నారు. యూనివర్శిటీలను మూడు, నాలుగు రకాలుగా విభజన చేసి విద్యను మరింత కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కమర్షలైజేషన్, కాషాయికరణ చేస్తుందన్నారు. ఈ విధానాలు ప్రభుత్వం విద్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి తీసుకుంటున్న చర్యలని ఆరోపించారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ఆరెస్సెస్ ఎజెండా అమలుకు బీజేపీ ప్రయత్నం చేస్తుందని, ఆరెస్సెస్ నేపథ్యం ఉన్నవారినే యూనివర్శిటీలలో నియమాకాలు చేస్తుందని తెలిపారు. కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 10 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా, జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యావిధానం అమలు చేస్తారని ప్రశ్నించారు. నూతన విద్యావిధానం, విశ్వవిద్యాలయాల ఫండ్ కట్స్, ఫెలోషిప్స్ ఇవ్వకపోవడం, ఖాళీలు భర్తీ చేయకుండా ఉండడం, యూనివర్శిటీలలో ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా చేయడంపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నూతన జాతీయ విద్యా విధానంలో ఎక్కడ కూడా ఉచిత విద్య అనే పదాన్ని కూడా పొందుపరచకుండా నూతన జాతీయ విద్యా విధానంలో పేదవారికి ఉచిత విద్యా లేనట్టే జాతీయ విద్యా విధానం ఉన్నట్టు జాతీయ వ్యాప్తంగా తరగతి గదులను నిర్మించడానికి బీజేపీ ప్రభుత్వం ఎక్కడ కూడా ఒక ప్రభుత్వ రంగ విద్యాలయాన్ని నూతన జాతీయ విద్యా విధానానికి తగ్గట్టుగా ఒక పాఠశాలను నిర్మించి లేదన్నారు. పాఠ్యపుస్తకాలలో ప్రజాస్వామ్యం, సెక్యులర్ పదాలను, డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించి దాని స్థానంలో బ్రిటిష్ ముస్కర్లకు తొత్తగా వ్యవహరించిన ఆర్ఎస్ఎస్, హెడ్గ్వార్, వీర సావర్కర్ మొదలగు వారి జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దేశ చరిత్రను, తెలంగాణ సాయుధ పోరాట వాస్తవాలను వక్రీకరించడంలో బీజేపీ ముందుందన్నారు. ఓట్ల కోసం రాముడి పేరుతో ఓట్ల అడగడం తప్ప మరొకటి లేదని అన్నారు. విభిన్న జాతులు కలిగిన వారు భారతదేశంలో ఉన్నారని, భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న దేశంలో ఒక కులాన్ని ఒక మతాన్ని ప్రోత్సహించి, భారతదేశ చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీని ఓడించి ఇండియా కూటమిని సెక్యులర్ పార్టీలను గెలిపించగలరని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు రోహిత్, ప్రతాప్, ఆకాష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

నవతెలంగాణ-కామేపల్లి



సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కారేపల్లి రూరల్ సీఐ తిరుపతిరెడ్డి కామేపల్లి ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఎంపీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నెలకొల్పేందుకు ముందస్తుగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామాలలో ఇప్పటికే పోలీసు కవాతు నిర్వహించటం జరిగిందని తెలిపారు. గ్రామంలో ఎటువంటి అలజడులు చేసిన శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు.

విజయవంతమైన నెలనెలా వైద్య శిబిరం

- 128 మంది రోగులకు వైద్య సేవలు

నవతెలంగాణ-నేలకొండపల్లి



సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, అమరజీవి నూతక్కి గంగాధర్ రావు సేవా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన నెల నెలా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో 128 మంది రోగులకు బీపీ, షుగర్‌తో పాటు ఇతర సాధారణ జబ్బులకు డాక్టర్లు వైద్య సేవలందించారు. వైద్య శిబిరంలో ప్రముఖ జీర్ణకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ సీ.బారవి ఎంబిబిఎస్, ఎండి, డిఎం, ప్రముఖ జనరల్ వైద్యులు డాక్టర్ కొల్లి అనుదీప్, డాక్టర్ హస్నద్ బాబా ఎంబిబిఎస్, రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సేవ కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు మాట్లాడుతూ సేవా కమిటీ తరవున ప్రతినెల నిర్వహిస్తున్న వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన, ఆదరణ లభిస్తుందన్నారు. వైద్య శిబిరంలో ప్రధానంగా బీపీ, షుగర్ ఇతర సాధారణ జబ్బులకు చెందిన పేద వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. పేద వర్గాలకు నేడు వైద్యం అందని ద్రాక్షగా మారిన నేపథ్యంలో తాము నిర్వహిస్తున్న వైద్య శిబిరం ద్వారా ఆయా వర్గాలకు లబ్ధి జరగడం వైద్య శిబిరం నిర్వహణకు మరింత ఉత్సాహాన్నిస్తుందన్నారు. రానున్న కాలంలో వైద్య సేవలతో పాటు మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను కూడా ఎన్టీఆర్ సేవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికను రూపొంది ంచనున్నట్లు తెలిపారు. ప్రతి నెల వైద్య శిబిరానికి తమ సహాయ సహకారాలు అందిస్తున్న వైద్యుల బృందం, దాతలు, వాలంటీర్లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో గ్రామీణ వైద్యుల సేవా సంఘం ప్రతినిధులు బండి పుష్ప, బండారుపల్లి నాగేశ్వరరావు, ఎస్‌కే.తానీష, రోగులకు బీపీ వైద్య సేవలందించారు. వసుంధర ఒకేషనల్ ప్రిన్సిపాల్ ఈగ అనిల్ కుమార్, విద్యార్థులు రోగులకు మందులు పంపిణీ సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జీ. నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కేవీ.రామిరెడ్డి, కట్టెకోల వెంకటేశ్వర్లు, ఎస్ .ఉమామహేశ్వరి, దండా సూర్యనారాయణ, ఎస్కే. అబ్దుల్లా, ఎస్కే. రహీం, మంకెనపల్లి నరసింహారావు, ఏలూరి కోదండ రామారావు, డీ.నాగేశ్వరరావు, ఎస్.మల్లికార్జునరావు, దండా సైదారావు, రఘు, సతీష్, మైకుబాబు పాల్గొన్నారు.



వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మదర్స్ డే వేడుకలు

నవతెలంగాణ-మధిర

మధిర కలయిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మదర్స్ డే వేడుకలు ఆదివారం నిర్వహించారు. మదర్స్ డే సందర్భంగా కొంత మంది సభ్యులు అమ్మ గురించి చెప్తూ అమ్మ ఎప్పుడు తన బిడ్డల గురించి ఆలోచిస్తుంది తప్ప తన గురించి ఆలోచించదు, అమ్మ చేసే ప్రతి పని మన ఆనందం కోసమే, మన ఆనందంలోనే అమ్మ తన ఆనందాన్ని చూసుకుంటుంది అని అలాగే, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు సేవచేయటం ఎంతో అదృష్టం అని వివరించారు. ఈ కార్యక్రమంలో మధిర కలయిక వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఇరుకుల బాల కోటేశ్వరరావు, అధ్యక్షులు వేమూరి సునీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి పరంకుశం శ్రీనివాసరావు, ట్రెజరరీ కాజా శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లింల వ్యతిరేక బీజేపీని ఓడిద్దాం

- కాంగ్రెస్ పార్టీని గెలిపిద్దాం

నవతెలంగాణ-ఎర్రుపాలెం



దేశంలో బీజేపీ అనుసరించే వైఖరి ముస్లిం ప్రజానీకానికి వ్యతిరేకంగా ఉన్నదని, మరోసారి అధికారంలోకి వస్తే దేశంలో ఉన్న ముస్లింల జీవనం చాలా క్లిష్ట పరిస్థితిగా మారుతుందని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు బండారు నరసింహారావు, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జానీ భాష అన్నారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కులాల, మతాల మధ్య చిచ్చు పెట్టాలని బీజేపీ ప్రయత్నిస్తుందని ముస్లిం సోదరులు గమనించాలన్నారు. దేశంలో శాంతి భద్రతలు కరువయ్యాయని, బీజేపీ తిరిగి మూడోసారి మరల అధికారంలోకి వస్తే ర్యాజ్యాంగాన్ని మార్చాలానే లక్ష్యంతో ఈ ఎన్నికలలో ముందు కెళ్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను రద్దు చేయాలని కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. రిజర్వేషన్ల రద్దు ప్రతి పాదికన ఎన్నికలు జరుగుతాయని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు

- మాతృమూర్తులకు ఘన సన్మానం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

జాతీయ మాతృ దినోత్సవ సందర్భంగా దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భద్రాచలంలో మాతృ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు పూజల లక్ష్మీ మాట్లాడుతూ... ఈ సృష్టికి కారణమైన మాతృమూర్తిని ప్రతి ఒక్కరూ ప్రేమించి గౌరవించాలని కోరారు. ఈ సృష్టిలో మాతృత్వం కంటే తీయనైనది మరొకటి లేదని అభిప్రాయపడ్డారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి మరో ప్రాణికి జన్మనిచ్చేది ఒక మాతృ మూర్తినని అన్నారు. ఇటీవల కాలంలో కన్నతల్లులను అనాధాశ్రమంలో చేర్చడం అంతకంతకు పెరిగిపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కన్నతల్లికి సేవ చేస్తే ఆ భగవంతుడికి సేవ చేసినట్టేనని ప్రతి ఒక్కరు గుర్తించాలని కోరారు. దిశ ప్రొడక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జాతీయ అధ్యక్షులు డివి రాజు ఉపాధ్యక్షురాలు కళ్యాణిల ఆదేశాల అనుసారం మాతృ దినోత్సవ వేడుకలను నిర్వహించడంతో పాటు మాతృమూర్తులను ఘనంగా సన్మానించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ముందుగా కొత్తగూడెం పట్టణంలో పట్టణంలో దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



సోయం గంగులు 73వ వర్ధంతి

- గంగులు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలి
- మాజీ ట్రైకార్ చైర్మెన్, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-దమ్మపేట

ఘనంగా తెలంగాణ సాయుధ పోరాట యోధులు, మన్యం బొబ్బిలి సోయం గంగులు 73వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం మండలంలోనిఎంపీడీఓ కార్యాలయం పక్కాన గంగులు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు తాటి వెంకటేశ్వర్లు హాజరై ఆదివాసీ నాయకులుతో కలిసి మన్యం బొబ్బిలి సోయం గంగులు విగ్రహానికి పూలమాల వేసి ఘనా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మట్లాడుతూ ఆనాడు పాల్వంచ, అశ్వారావుపేట (సంస్థానాలు) ఏజెన్సీ ప్రాంతాలులో ఆదివాసీ హక్కులు, అస్థిత్వం, కోసం దున్నేవానికే భూమి ధక్కలి అని నినాధిస్తు జంగు సైరన్ పూరించి జెమింధరు వ్యవస్థకి సాయుధుడు అయి తిరుగుబావుట ఎగురవేసిన ఘనమైన చరిత్ర గంగులుది అన్నారు. వారి ఉద్యమ పంధాను, జాతికి చేసిన త్యాగంని పాఠ్య పుస్తకాలలో ముద్రించి సోయం గంగులు చరిత్ర మరుగున పడిపోకుండా చూడవల్సిన బాధ్యత ప్రభుత్వంలో ఉన్నా ప్రజాప్రతినిధులు పై ఉన్నాది అన్నారు. సోయం గంగులు, కొమరం భీమ్ ఉద్యమ స్ఫూర్తి కొనసాగిస్తూ సోయం గంగులు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కంకణ బద్దులయ్యి పని చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గ ఆదివాసీ నాయకులు సోయం వీరభద్రం, రాష్ట్ర నాయకులు కోర్సా వెంకటేశ్వరావు, తెల్లం రామారావు, సోయం రామ్మూర్తి, వాసం వెంకటేశ్వరావు, గడ్డం వెంకటేశ్వరావు, సోయం ఉమామహేశ్వరావు, వగ్గెల చంద్రశేఖర్, అశ్వారావుపేట నియోజిక వర్గ యువ రాజకీయ నాయకులు వాడే వీరాస్వామి పాల్గొన్నారు.



ప్రజలందరూ ఓటు హక్కును ఉపయోగించుకోవాలి

నవతెలంగాణ-మణుగూరు

18వ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నిక ప్రజలందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పినపాక నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. ఆదివారం ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పినపాక నియోజకవర్గంలో 250 పోలింగ్ బూతులు సుమారు 1500 మంది సిబ్బంది పాల్గొంటారని అన్నారు. 203790 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. పోలింగ్ సిబ్బంది సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్‌ను ముగించాలని అన్నారు. చేతిలో స్లిప్పులు ఉండి లైన్‌లో ఉంటే పోలింగ్ కొనసాగించాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

- పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన తహసీల్దార్

నవతెలంగాణ-పినపాక

పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ సూర్య నారాయణ తెలియజేశారు. ఆదివారం పినపాక మండలంలో పలు పోలింగ్ కేంద్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని కరెంట్, ఫర్నిచర్, నీటివసతి, మూత్రశాలలు, వృద్ధులు, వికలాంగుల కోసం ర్యాంపులను పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలు కల్పించరాదని అలాగే సిబ్బందికి వసతి, భోజనం కల్పించాలని సూచించారు. ప్రతిపోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలతో పాటు కనీస మౌలిక వసతులు సమకూర్చినట్లు తెలిపారు. వేసవి సందర్భంగా నీటి సమస్య తలెత్తకుండా ఓటర్లు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.



ఓటు హక్కు భారం కాదు..బాధ్యత

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అలా



నవతెలంగాణ-పాల్వంచ

జిల్లాలో జరుగు పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కు బాధ్యతగా వినియోగించుకోవాలని, ఓటు హక్కు భారం కాదు, బాధ్యత అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ఓ ప్రకటనలో జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం భారత పౌరులకు కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధమని చెప్పారు. సమర్ధవంతమైన నాయకుడిని ఎన్నుకునే అకాశం ఓటు హక్కు ద్వారా మాత్రమే ఉంటుందని తెలిపారు. జిల్లాలో 100% ఓటింగ్ జరిగేలా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, నీడ, ఫ్యాన్‌లు తదితర సౌకర్యాలు అన్ని కల్పించామని తెలిపారు. జిల్లాలో రేపు ఉదయం 7 గంటల నుంచి 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో పార్లమెంటు ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

సాయంత్రం 4 వరకే పోలింగ్...

- జిల్లాలో 5 నియోజక వర్గాలు
- 971 పోలింగ్ కేంద్రాలలో 146 సమస్యాత్మక కేంద్రాలు

నవతెలంగాణ-కొత్తగూడెం

లోక్ సభ ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగే పోలింగ్‌కు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయించింది. ఈవీఎంలు, ఇతర సమగ్రిని సరఫరా చేసింది. ఎలాంటి అవంచనీయ సంఘటనలు జరుగుకుండా గట్టి చర్యలు తీసుకుంది. ఎన్నికల సంఘం గుర్తించిన విధంగా జిల్లాలోని సమస్యాత్మాక నియోజక వర్గాలలో గట్టి నిఘా ఏర్పాట్లు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఖమ్మం జిల్లా పార్లమెంట్ నియోజక వర్గం, మహబూబ్‌బాద్ నియోజక వర్గాలు మిలితమై ఉన్నాయి. ఇందులో కొత్తగూడెం, ఆశ్వారావుపేట నియోజక వర్గాలు ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి. భద్రాచం, పినపాక, ఇల్లందు నియోజకవర్గాలు మహబూబ్‌బాద్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలో ఉన్నాయి. కొత్తగూడెం నియోజక వర్గంలో


పోలింగ్ సమాగ్రితో ఎన్నికల సిబ్బంది...

253 పోలింగ్ కేంద్రాలు, ఆశ్వారావుపేలో184, పినపాకలో 250, ఇల్లందులో 242, భద్రాచలంలో 176లు మొత్తం 1105 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. 13న జరుగనున్న ఎన్నికల నేపద్యంలో శాంతి భద్రతల, పర్యవేక్షణ తదితర అంశాలపై పోలీసు, రెవిన్యూ, ఎన్నికల అధికారులు సంయుక్తంగా పటిష్టమైన చర్యలు చేపట్టారు. మారుమూల పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని 971 పోలింగ్ కేంద్రాలలో 146 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సమస్యాత్మక నియోజకవర్గాల్లో నిర్ణిత సమయం కంటే రెండు గంటల ముందుగానే పోలింగ్ ముగియనుంది. ఇతర జిల్లాలో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగునుంది. దేశంలో పలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల నియోజక వర్గాలలో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. అదేవింగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, పినపాక, ఇల్లందు, ఆశ్వారావుపేట నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం 5 అసెంబ్లీ నియోజక వర్గాల్లోని 971 పోలింగ్ కేంద్రాలలో 146 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఈ నియోజక వర్గాల్లో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగుస్తుంది. పోలింగ్ కేంద్రాల వద్ద జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఇబ్బందికర పరిస్థితుల్లో 100 డైల్ చేయాలని సూచించారు. 2500 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్త్ ఏర్పాటు చేశారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా కొత్తగూడెం మార్కెట్ యార్డు నుండి పోస్టాఫీస్ సెంటర్ వరకు పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అంతర్ జిల్లా సరిహద్దు రాష్ట్రంలో కావడంతో మరింత నిఘా పెంచారు. జిల్లాకు సరిహద్దుగా ఉన్న 12 అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద, 6 అంతర్ జిల్లా చెక్ పోస్టుల వద్ద నిరంతర నిఘా పెట్టారు. నూరు శాతం పోలింగ్ జరిగే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించారు. పినపాకలో 203790 మంది ఓటర్లు, ఇల్లందులో 225097, కొత్తగూడెంలో 247494, ఆశ్వారావుపేటలో 152683, భద్రాచలంలో 152683లు మొత్తం 988238 ఓటర్లు ఉన్నాయి. వీరంతా వారి అమూల్య మైన ఓటు హక్కను వినియోగించుకోనున్నారు.



ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ఆళ్ళపల్లి మండలంలో నేడు జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు వివిధ ప్రాంతాల నుంచి ఎన్నికల ప్రత్యేక అధికారాలు ఆదివారం చేరుకున్నారు. అందులో భాగంగా ఆళ్ళపల్లిలోని హైస్కూల్‌లో జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పీఓగా జి.దేవదాస్, అలాగే ఏపీఓగా కె.అరుణ కుమారి, ఓపీఓలుగా జె.సుధాకర్, పి.బుచ్చిబాబు, తదితర అధికార యంత్రాంగం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. నేడు జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశామన్నారు. మండల పరిధిలోని ప్రతి పౌరుడు ఈ పార్లమెంటు ఎన్నికల్లో పాల్గొని ఓటేయాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చిన ఎన్నికల ప్రత్యేక అధికారాలను టేకులపల్లి సీఐ టి.సురేష్, స్థానిక ఎస్సై ఈ.రతీష్, తహసీల్దార్ శకుంతల, ఎంపీడీవో రమాదేవి, ఎంపీఓ బి.శ్రీనివాస్‌లు కలిశారు.

అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- ముగ్గురికి తీవ్రగాయాలు
- 20 మందికి స్వల్ప గాయాలు

నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండలం సారపాక-మోతే పట్టి నగర్ గ్రామాల మధ్య అదుపు తప్పిన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు కాలవలోకి దూసుకెళ్లిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి... మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు (టీఎస్ 28 టీఏ 2219) భద్రాచలం వస్తుండగా సారపాక-మోతే పట్టీనగర్ గ్రామాల మధ్యలో ఓ కల్వర్టు వద్దకు రాగానే ఎదురుగా ఆటో అడ్డురావడంతో ఒక్కసారిగా ఆర్టీసీ బస్సుఅదుపు తప్పింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న కల్వర్టు వంతెన కిందకు దూసుకుపోయింది. ఈ సంఘటనలో ఆర్టీసీ బస్సులో ప్రయాణీస్తున్న 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. అదే విధంగా మరో ముగ్గురికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ సంఘటన విషయం



తెలుసుకున్న బూర్గంపాడు సొసైటీ చైర్మెన్ బిక్కసాని శ్రీనివాస రావు, మరికొందరు యువకులు కలిసి క్షతగాత్రులను భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి హుటాహుటీన తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందుభాగం దెబ్బతినగా డ్రైవర్ అలీ, కండక్టర్లకు మాత్రం ఎలాంటి గాయాలు కాలేదు. మొత్తం ఆర్టీసీ బస్సులో 35 మంది ప్రయాణీస్తున్నారు. బస్సు అదుపుతప్పిన సమయంలో డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ప్రాణాపాయం లేదు. స్వల్ప గాయాలు మాత్రమే అయ్యాయి. అందులో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ రామారావు పరామర్శించారు.



సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు భారీ భద్రత

నిర్భయంగా ఓటేయమంటున్న పోలీసులు

- 36 పోలింగ్ కేంద్రాలు 32079 మంది ఓటర్లు
- ఎన్నికలకు సర్వం సిద్ధం

నవతెలంగాణ-చర్ల



భద్రాచలం ఏజెన్సీలోనే అత్యంత సమస్య ఆత్మకమైన పోలింగ్ కేంద్రాలుగా ఉన్న ఉంజుపల్లి, పెద్ద మిడిసి లేరు, తిప్పాపురం పోలింగ్ కేంద్రాలు అత్యంత సమస్య ఆత్మకమైన పోలింగ్ కేంద్రాలుగా అధికారులు తెలుపుతున్నారు. మండల వ్యాప్తంగా 36 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఆయా కేంద్రాలలో ఓటు హక్కును వినియోగించుకునే ఓటర్లు 32079 ఉన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం ఓటర్లకు కావలసిన సదుపాయాలను ప్రభుత్వ అధికారులు ఇప్పటికే పూర్తి చేసి ఉన్నారు. రేగుంట, కొయ్యూరు, రామాంజపురం గ్రామాల ప్రజలు 60వ పోలింగ్ కేంద్రంలో సుబ్బంపేట 1, 2 గొల్లగూడెం 61 పోలింగ్ కేంద్రంలో సి కొత్తూరు గుట్టబోరు 62 పోలింగ్ కేంద్రంలో, గన్నవరం కాలనీ ఉప్పరిగూడెం సింగ సముద్రం 63 పోలింగ్ కేంద్రంలో, ఉంజుపల్లి, వద్దిపేట, పూసగుప్ప 64 పోలింగ్ కేంద్రంలో, పూజారి గూడెం కాలనీ 65వ పోలింగ్ కేంద్రంలో, పాత చర్ల అంబేద్కర్ నగర్ 66వ పోలింగ్ కేంద్రంలో జ్లులపల్లి కందిపాడు 67వ పోలింగ్ కేంద్రంలో రాళ్ల గూడెం, కేశవాపురం, గుంపెన గూడెం 69వ పోలింగ్ కేంద్రంలో, రఘు థియేటర్ కాలి బజార్ ముత్యాలమ్మ గుడి, సీఆర్ కాలనీ ఏరియాలో 70వ పోలింగ్ కేంద్రంలో, కోయికుంట గణేష్ నగర్ 1, 2 జూనియర్ కాలేజీ 71వ, పోలింగ్ కేంద్రంలో, చర్ల టౌన్, గొల్లకట్ట వీధి, ఆయిల్ బంక్ ఏరియా 72వ పోలింగ్ కేంద్రంలో, నాయకుల కాలనీ, లక్ష్మీ కాలనీ 1, 2 దేవానగరం 73వ పోలింగ్ కేంద్రంలో, గొంపల్లి 1, 2 74వ పోలింగ్ కేంద్రంలో మగలపల్లి ఆనంద కాలనీ 75వ పోలింగ్ కేంద్రంలో ఎంపీ పల్లి, జీపి పల్లి, సి.కత్తి గూడెం, 76వ పోలింగ్ కేంద్రంలో లింగాపురం 1,2,3,4 77వ పోలింగ్ కేంద్రంలో, కొత్తపల్లి 1,2,3 78వ పోలింగ్ కేంద్రంలో జంగాలపల్లి, మేడువాయి, ఎర్రగడ్డ 79వ పోలింగ్ కేంద్రంలో కలివేరు 1,2 నాని పల్లి కాలనీ, రజ్ బల్ కాలని 80వ పోలింగ్ కేంద్రంలో తేగడ కాలనీ, తేగడ 1,2,3 81వ పోలింగ్ కేంద్రంలో, చిన్న మిడిసి లేరు తిమ్మిరి గూడెం, బి కొత్తూరు 82వ పోలింగ్ కేంద్రంలో, పెద్దమించలేరు 1,2,3 83వ పోలింగ్ కేంద్రంలో, ఉయ్యాల మడుగు తిప్పాపురం చలమల 84వ పోలింగ్ కేంద్రంలో, కుర్నపల్లి ఎర్రబోరు 85వ పోలింగ్ కేంద్రంలో గొమ్ముగూడెం, కొత్తగట్ల 86వ పోలింగ్ కేంద్రంలో పెద్దపల్లి 1,2 87వ పోలింగ్ కేంద్రంలో సత్యనారాయణపురం 1,2,3 శివలింగాపురం 28వ పోలింగ్ కేంద్రంలో ఆర్.కొత్తగూడెం 1,2 అప్పుల కొత్తగూడెం 89వ పోలింగ్ కేంద్రంలో, కుదునూరు 1,2,3,4 91వ పోలింగ్ కేంద్రంలో చింతగుప్ప బోధనెల్లి 92వ పోలింగ్ కేంద్రంలో మామిడిగూడెం 1,2,3 93వ పోలింగ్ కేంద్రంలో రాళ్ల గూడెం, పులిగుండాల 94వ పోలింగ్ కేంద్రంలో, శుద్ధ గుంపు దేవరపల్లి 1,2 95వ పోలింగ్ కేంద్రంలో ఆయా ఓటర్లు తమ తమ ఓటు హక్కును నేడు వినియోగించుకోనున్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికలు ఒక్కరోజు ముందు మావోయిస్టులు పసుపు ప్రాంతంలో లారీని తగలబెట్టి తమ నిరసనను తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మొదటి నుండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ.రాజు వర్మ నేతృత్వంలో భద్రత మరింత పటిష్టం చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డేగ కన్నుతో పోలీస్ పహారా కాస్తుంది. ఓటర్లు నిర్భయంగా తమ తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులు ఫ్లాగ్ మార్చ్ ద్వారా తెలపడం పాఠకులకు విధితమే. సరిహద్దు ఛత్తీస్గడ్‌లో జరుగుతున్న వరుస ఎన్కౌంటర్లో నేపథ్యంలో వేల సంఖ్యలో పోలీసులు అడవులను జల్లెడబడుతూ మావోయిస్టుల ప్రాబల్యాన్ని నియంత్రించడంలో పోలీస్ విజయం సాధించిందని చెప్పవచ్చు. అయితే ఏజెన్సీ అంతా కూడా నివురుగా ప్రేమింపుల ఏ క్షణాన ఏం జరుగునో అని గిరిజన పల్లెలు గడగడా వణికి పోతున్నాయి.



ఎన్నికలకు సర్వం సిద్ధం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

నేడు జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని 40 పోలింగ్ కేంద్రాలలో సోమవారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు లోక్ సభకు సంబంధించి ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికలకు సంబంధించి పూర్తి ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సిబ్బంది ఆదివారం మూడు గంటలకు పోలింగ్ కేంద్రంలకు క్షేమంగా చేరుకోవడం జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా రేపు ఉపాధి హామీ పనులు నిలిపి వేసినట్లు ఆయన తెలిపారు. కావునా ఓటర్లు అంతా పూర్తిస్థాయిలో ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. దుమ్ముగూడెం మండలంలోని 40 పోలింగ్ కేంద్రాలలో 35 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవి ఉండగా వాటిలో సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించే విధంగా అన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో జిల్లా వైద్య అధికారి ప్రథమ చికిత్స కిట్లతోపాటుగా ఏఎన్ఎంలను కేటాయించారు. మండలంలోని మొత్తం ఓటర్ల సంఖ్య 36,065 కాగా పురుషులు 17,114, స్త్రీలు 18949 ఇతరులు ఇద్దరు ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో బూత్ లెవెల్ అధికారితో ఓటరు సహాయక కేంద్రం ఏర్పాటు చేశారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ బొడ్డు అశోక్ కుమార్, ఎస్సైలు కేశవరావు, గణేష్‌లతో పాటు సీఆర్పీఎఫ్ బలగాలతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలి : సీఐటీయూ

నవతెలంగాణ-ఇల్లందు



షాపులలో, మాల్స్, పెట్రోల్ బంక్ సినిమా, గ్యాస్ డెలివరీ కార్మికులు, అన్ని రకాల పనులు చేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి కార్మిక శాఖ అధికారులను కోరారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ అన్ని రకాల పనులు చేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని చెప్పారని ఆ ప్రకారం అన్ని రకాల పనులు చేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని ఆయన అన్నారు. అత్యవసర సేవలు చేసే కార్మికులకు అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇల్లందులో షాప్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ జారీ చేసిన ఉత్తర్వులను అన్నిరకాల యాజమాన్యాలు అమలు చేయాలని ఆయన విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశం సీఐటీయూ ఇల్లందు మండల కన్వీనర్ తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరుగగా పద్మ, రావు, రాజు, కుమార్, విజయ, సంతోష, కౌసల్య, కోటమ్మ, సుజాత, రాణి, మంగ, భవాని, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 32 రూట్లు 1,998 సిబ్బంది

- 242 పోలింగ్ స్టేషన్లు
- రెండు లక్షల 25 వేల 97 మంది ఓటర్లు
- డీఎస్పీ చంద్రభాను ఆధ్వర్యంలో భారీ బందోబస్తు

నవతెలంగాణ-ఇల్లందు

అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన ఇల్లందులో సింగరేణి హై స్కూల్ ఆట స్థలంలో ఇవిఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇల్లందు, కామేపల్లి, టేకులపల్లి, గార్ల, బయ్యారం మండలాలు ఉన్నాయి. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలో 32 రూట్‌లను ఏర్పాటు చేశారు. రెండు లక్షల 25 వేల 97 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు లక్షా 9వేల 888, స్త్రీలు లక్ష 15వెల 205, టీజి



4, ఎన్నారై ఆరుగురు ఉన్నారు. 242 పోలింగ్ స్టేషన్లు, 1,998 సిబ్బందిని నియమించారు. పట్టణంలోని మెలోడీస్ స్కూల్లో దివ్యాంగులకు ప్రత్యేక పోలింగ్ బూత్‌ని ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ బూత్‌కు ఆరుగురు సిబ్బంది ఖర్చులకోసం రూ.4000 కేటాయించారు. నియోజకవర్గంలోని వివిధ పోలింగ్ స్టేషనులకు చేరుకోవడానికి సిబ్బందికి ఆర్టీసీ, ప్రైవేటు ఆనాలను సమకూర్చారు. భోజన వసతి సౌకర్యాలు కల్పించారు. నియోజవర్గంలోని ఐదు మండలాలలో డిఎస్పి చంద్రభాను, సిఐ కరుణాకర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. భద్రతా చర్యలలో భాగంగా 144 విదించామని ప్రతి పౌరుడు, వివిధ రాజకీయ పార్టీలు ఎలక్షన్ నిబంధనలను విధిగా పాటించాలని కోరారు.



చూడముచ్చటగా ఆత్మా రాముడి కల్యాణం

- చూసి తరించిన భక్తజనం

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండల కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామంలో కొలువైయున్న శ్రీ ఆత్మా రామచంద్ర స్వామి కల్యాణ మహెూత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. స్వామి కల్యాణ మహోత్సవాన్ని చూసి తరించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరాగా, దేవాలయ ప్రాంగణం అంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. ఎండ తీవ్రత దృశ్య దేవస్థానం అధికారులు భక్తుల సౌకర్యం కల్యాణ మండపం వద్ద టెంట్లు ఏర్పాటు చేసినప్పటికీ ఉక్కపోతలోనే భక్తులు స్వామి కళ్యాణాన్ని తిలకించారు. తెల్లవారుజామున స్వామి ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలను పూర్తిచేసిన అర్చకులు ఉదయం 10:00 గంటలకు ప్రత్యేక పల్లకిలో స్వామి వారిని కూర్చుండబెట్టి, ఆరు బయట కళ్యాణమండపం వద్దకు స్వామిని తోడ్కొని వచ్చారు. కళ్యాణ మండపంలో ఆశీనులైన సీతారాములకు ప్రత్యేక పూజాది కార్యక్రమాలను అర్చకులు రామానుజాచార్యులు, కొంపెల్ల సత్యనారాయణమూర్తి, సూర్య సుబ్బారావులు దగ్గరుండి పూజా కార్యక్రమాలను చేశారు. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య విశ్వక్షణ పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, యోత్రధారణ, మంగళాష్టకాలు, పూర్తి చేసి అనంతరం స్వామివారికి జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ కార్యక్రమాలను దగ్గరుండి నిర్వహించారు. దేవస్థానం ఈవో సుదర్శన్ స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొని రాగా, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మెన్ గోర్స ఆశోక్, లావణ్య దంపతులతో పాటు కెల్లా శేఖర్, సంధ్యారాణి దంపతులు కల్యాణ దంపతులుగా ఆసీనులు అయ్యారు. దేవస్థానం అధికారులు, గ్రామస్తులు భక్తులకు కావలసిన సౌకర్యాలను సమకూర్చారు. కల్యాణం అనంతరం ప్రత్యేక పల్లకిలో స్వామివారిని దేవాలయం వద్ద ఊరేగింపు నిర్వహించి ప్రధానాలయానికి చేర్చారు. దేవస్థానం ఆధ్వర్యంలోనే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలును స్వీకరించారు. స్వామి కల్యాణాన్ని పురస్కరించుకొని సాయంత్రం భక్తులు గ్రామస్తుల సమక్షంలో సీతారామ లక్ష్మణులను ప్రత్యేక పల్లకిలో కూర్చుండబెట్టి తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం జూనియర్ అసిస్టెంట్లు కృష్ణమోహన్, శ్రీనివాస్, రాజగోపాలచార్యులు, బి శ్రీనివాసరావు, ఎం.వి.రమణతో పాటు దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ గోర్స అశోక్, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొనగా గ్రామస్తులు కంద్రపు సింగరయ్య రెడ్డి, బత్రి నరసింహారావు, కెల్ల వేణుగోపాల్, కొత్తూరి సీతారామారావు, బోర సన్యాసి రెడ్డి, పోతాబత్తుల మోహన్ రావు, మీసాల అప్పాజీ, యలమంచి శ్రీనివాస్, బైరెడ్డి విశ్వేశ్వరరావు, చుక్క గణేష్ రెడ్డి, లంకా ప్రసాద్, బైరెడ్డి సతీష్, కర్రీ రవీంద్ర కుమార్, వెంకటి, జల్లా సాయి, సాగర్, శివ తదితరులతో పాటు మహిళ వాలంటీర్లు భక్తులకు కావలసిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
8
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | మే 13, 2024 | www.navatelangana.com

ఎన్నికలకు సిద్ధం

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



పార్లమెంట్ అభ్యర్థిని ఎన్నుకునేందు ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధాన్ని వినియోగించుకునేందుకు మండలంలో ఓటర్లు సిద్ధం అయినారు. మండలంలో మొత్తం 16715 మంది ఓటర్లు ఉండగా వారు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారులు అన్ని సిద్ధం చేశారు. మండలంలో పది గ్రామ పంచాయితీల్లో 20 పోలింగ్ బూతులు ఉండగా ప్రతి బూతు దగ్గర మంచినీటి సౌకర్యంతో పాటు టెంట్ వేసి ఓటర్లకు ఎటువంటి సమస్యలు కలగకుండా ఎన్నికల అధికారులుతో కలసి మండల అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. మండలంలో అసెంబ్లీ ఎన్నికల తరువాత పార్లమెంట్ ఎన్నికల సమయానికి 18 సంవత్సరాలు నిండి నూతనంగా ఓటు హక్కు పొంది మొదటి సారిగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు 161 మంది ఓటర్లు ఎంతో ఉత్సహంగా వున్నారు.

సింగరేణిలో ఆగని మెడికల్ బోర్డు దందా

కేసుకు రూ.10లక్షలు

- నాయకులుగా చలామని అవుతూనే...మనీ సంపాదనకు బోర్డుమెడికల్
- రిటైర్డ్‌మెంట్ దగ్గరతో ఉన్న కార్మికులే టార్గేట్
- చేతులు మారుతున్న కోట్లాది రూపాయలు


సింగరేణి ఆసుపత్రి

సిరుల తల్లి సింగరేణిలో నల్లబొగ్గు ఉత్పత్తితో పాటు...నల్లడబ్బు సంపాదనకు మార్గాలు ఉన్నాయి. కార్మికుడు భూ గర్భగనిలోకి వెళ్ళి ప్రాణాలు ఫణంగా పెట్టి బొగ్గు ఉత్పత్తి చేస్తున్నాడు. మెడికల్ బోర్డు దళారులు భూ గర్భగని ఉపరి తలంమీద ఉండి పైరవీలు చేసుకుంటూ కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారు. బోర్డు మెడికల్‌లో ఒక్క కేసు చేయిస్తే చాలు సుమారు రూ.10 లక్షలు సంపాదిస్తున్నారు.

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి వ్యాప్తంగా మెడికల్ బోర్డు మాఫియా తయారైంది. 30 ఎండ్లు కార్మికుడు తన రక్తన్ని చెమట చేసి సంస్థ అభివృద్ధికి పాటు పడ్డాడు. 25 ఏండ్ల సర్వీసు తరువాత అనారోగ్యం పాలై తన కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం పొందేందుకు మెడికల్ బోర్డు ద్వారా అన్ ఫిట్ కావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో దళారుల వ్యవస్థ తెరమీదకు వచ్చి, మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికుల లిస్టు సంపాదించి, వారి వెంట పడుతుంది. మిమ్ములను అన్‌ఫిట్ చేయిస్తామని, సుమారు రూ.10 లక్షల మేర ఖర్చు అవుతుందని, వెంటనే మీ కుటుంబ సభ్యులకు ఉద్యోగం వస్తుందని ఆశ చూపుతారు. దీంతో కార్మికుడు వారి మాయ మాటలకు తలొగ్గి కొంత సొమ్ము చెల్లించి, ఉద్యోగం కోసం తిరుగుతుంటాడు.

సింగరేణి వ్యాప్తంగా సింగరేణి కార్మికులు భూ గర్భగనిలో కొలువు చేయడం వలన అనేక అనారోగ్య సమస్యలతో తల్లడిల్లుతూ ఉద్యోగాలు చేయలేక మెడికల్ ఇన్వాల్యుయేషన్ కోసం ప్రయత్నం చేస్తున్నారు. వారు పనిచేస్తున్న సంబంధిత డిపార్ట్‌మెంట్ దగ్గర దరఖాస్తు పెట్టుకున్న దగ్గరి నుంచి మైన్స్ మీద, హాస్పిటల్స్ వద్ద లంచాల పర్వం పెరిగి పోయి సింగరేణి వ్యవస్థ మొత్తం నాశనమైందని, మెడికల్ బోర్డు ఒక పెద్ద మాఫియా ముఠా లాగా తయారైందని పెద్ద ఎత్తున ఆరోపనలు ఉన్నాయి. గతంలో మెడికల్ బోర్డు మాఫియా కేసులు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. కొంత మందిపై పోలీసుల కేసులు, సీబీఐకి నివేదికలు అందజేశారు. ఈ విషయంలో సింగరేణి యాజమాన్యం మెడికల్ బోర్డు కేసులో పలువురిపై వేటు వేసింది. భవిష్యత్తులో ఇలాంటి కేసులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. కానీ ఆనాడు గుట్టుచప్పుడు కాకుండా నడిచిన బోర్డు మెడికల్ వ్యవహారం నేడు నడి బజార్‌లో లావాదేవిలు వ్యవహారం నడుస్తుందని తెలుస్తుంది. ఈ బోర్డు మడికల్ మాఫియా తీరును వెంటనే అరికట్టి కార్మికులను కాపాడాల్సి పరిస్థితి ఉంది.

లోతైన విచారణ జరిపించాలి : కోటా శివశంకర్



సింగరేణి వ్యాప్తంగా బోర్డు మెడికల్ మాఫియా పెరిగి పోయిందని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ ఆరోపిస్తున్నారు. దీనిపై లోతైన విచారణ చేపట్టాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నారు. సింగరేణి చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్ ఏసీబీ అధికారులను రంగంలోకి దింపినప్పటికీ ఎటువంటి ఫలితం లేకుండా పోయిందని, మెడికల్ బోర్డు మాఫియా మరింత చెచ్చిపోయి విచ్చలవిడిగా పెరిగిపోతుంది. ముందుగానే బొగ్గు గనుల వద్ద అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు కార్మిక సంఘాలు, సింగరేణిలోని కార్మిక కుల సంఘాల నాయకులు ఎరవేస్తున్నట్లు, మాయ మాటలు చెప్పి యాజమాన్యమే ఉచితంగా జరిపించాల్సిన మెడికల్ బోర్డు వ్యవహారాన్ని లక్షలాది రూపాయలు వసూలు చేసే ఒక మాఫీయాగా తయారైందని ఆరోపిస్తున్నారు. దీన్ని వెంటనే అడ్డుకోవాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

ప్రజలంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఎన్నికలు సజావుగా జరిగేందుకు పటిష్టమైన బందోబస్తు
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కట్టుదిట్టమైన చర్యలు
- ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- ఎస్పీ రోహిత్ రాజు

నవతెలంగాణ-కొత్తగూడెం



పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా భద్రతాపరమైన అన్ని రకాల చర్యలను పూర్తి చేసినట్టు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మీడియాకు వెల్లడించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 2500 మంది పోలీసులతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలోని 971 పోలింగ్ కేంద్రాలలో జరగబోయే ఓటింగ్‌లో ప్రజలంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, మంటను ప్రేరేపించే వస్తువులకు అనుమతి లేదని, ప్రజలంతా ఇట్టి విషయాన్ని గమనించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్‌ను ఖచ్చితంగా అమలు చేస్తున్నామన్నారు. శాంతి, భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాలలోగానీ, పరిసర ప్రాంతాల్లో గానీ ఓటర్లను ప్రలోభ పెట్టె వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ఎవరైనా నగదు, మద్యం, ఇతరత్రా వస్తువులను ఎవరైనా పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి గానీ, సీ-విజిల్ యాప్ ద్వారా గానీ ఫిర్యాదు చేసి సమాచారం అందజేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల నుండి 100 మీటర్ల దూరంలో ఎవరూ ఉండరాదని, ఎన్నికల నియమావళి ప్రకారం పోలీసులు చేపట్టే చర్యలను అతిక్రమిస్తే అట్టి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కావున ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే పోలింగ్ ప్రక్రియకు ప్రతి ఒక్కరూ పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- కేంద్రాలకు చేరిన ఎన్నికల సిబ్బంది
- చెక్ లిస్ట్ ఆధారంగా సామగ్రి సరిచూసుకోవాలి
- పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు
- సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అలా





నవతెలంగాణ-అశ్వారావుపేట

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అలా సాధారణ పరిశీలకులతో కలిసి ఆదివారం సందర్శించారు. 17వ జనరల్ ఖమ్మం పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని 118వ ఎస్టీ రిజర్వడ్ అసెంబ్లీ అశ్వారావుపేట నియోజకవర్గానికి సంబంధించి 184 పోలింగ్ కేంద్రాలకు గాను స్థానిక వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో ఎన్నికల సామగ్రి పంపిణీ తీరు తెన్నులను కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 184 పోలింగ్ కేంద్రాలకు గాను మొత్తం 880 మంది ఎన్నికల సిబ్బందిని కేటాయించామని దానిలో పీఓలు 220, ఏపీవోలు 220, ఓపీఓలు 440 మంది ఉన్నారని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర వస్తువులు ఏర్పాటు చేయగా పీఓ, ఏపీఓ, ఓపీఓలతో కూడిన బృందాలు హాజరు అయ్యాయా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. ఈవీఎంల పనితీరును ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును గమనించారు. ఎలాంటి లోటుపాట్లు, గందర గోళానికి తావు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పక్కగా అందించాలని, చెక్ లిస్ట్ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి అందిందా లేదా అన్నది సరి చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసులు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టికి తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, తాహశీల్దార్ వి.క్రిష్ణ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటుకు నోటు

యథేచ్ఛగా కొనసాగుతున్న ఓటర్ విక్రయం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఓటు మన దేశ భవిష్యత్తు...నిజాయితీగా ఓటు వేద్దాం నిస్వార్థ నాయకుల్ని ఎన్నుకుందాం....వంటి నినాదాలు సోషల్ మీడియాలో స్లొగన్స్‌గా పేపర్ల మీద రాతలకే పరిమితమైనవి తప్ప ఎన్నికల ప్రక్రియలో నోటు చుట్టే ఓటరు తిరుగుతున్నాడు అన్నది ఇప్పటి సత్యం.



గతంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయ పక్షాలు యథేచ్ఛగా నోటు ఇచ్చి ఓటుని కొంటుంటే రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం లాంటి ఓటు హక్కుని విక్రయించేందుకు ప్రజలు రాజకీయ నాయకుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గతంలో మందో బిర్యానీ ఇచ్చి ఓటర్లను ప్రోలోభ పెట్టిన రాజకీయ పార్టీలు ఇప్పుడు అక్కడ ఇక్కడ అంటూ ఏదీ లేకుండా ప్రతి బూతు స్థాయిలో ఏజెంట్లను పెట్టి మరి ఓటు స్లిప్పులు చూపించిన ప్రతి ఓటర్కు నగదును అందజేస్తూ ఓటరు విక్రయ ప్రక్రియ బహిరంగంగానే కొనసాగిస్తున్నారు. ప్రధానంగా భద్రాచలం వంటి అభ్యుదయ భావాలు ఉన్న ఆదివాసి ప్రాంతంలో సైతం నేడు విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ కొనసాగిస్తున్నారు. భద్రాచలం పట్టణంలోని ప్రతి బూతు పరిధిలో ప్రధాన రాజకీయ పార్టీలు డబ్బులు పంపిణీ కార్యక్రమంలో నిమగ్నం అవుతుంటే ఇదేమి మాకు పట్టదు అన్నట్టుగా అధికారులు చూస్తున్నారు. తీరు ఎన్నికల వ్యవస్థనే అపహాస్యం చేస్తుంది అని చెప్పక తప్పట్లేదు. ఈ డబ్బుల పంపిణీలో కూడా ప్రాంతాలవారీగా వివక్షతలు చూపిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఒక రాజకీయ పార్టీ కొన్ని ప్రాంతాలలో ఓటుకి ఒకరేట్టు కడితే మరికొన్ని ప్రాంతాలలో దానికి భిన్నంగా అతి తక్కువ రేటుతో కొనుగోలు చేస్తున్నారని విమర్శలు వినపడుతున్నాయి. అంతేకాక పంపిణీ వ్యవహారం మొత్తం బూత్ ఇన్చార్జిలకు అప్ప చెప్పడంతో వారి కమీషను మినహాయించుకొని మరి ఓటర్లకు డబ్బులు పంపుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. డబ్బుల పంపిణీలో కూడా రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఓటు స్లిప్పులను చూసి మరి నగదు పంపిణీ చేయడంతో పాటు ప్రతి వీధిలో కౌంటర్లు ఏర్పాటు చేసి మరి బహిరంగా పంపిణీకి శ్రీకారం చుట్టారు. ప్రలోభాలను నియంత్రించడానికి ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన రాజ్యాంగ సంస్థలన్నీ కూడా కనుచూపుమేర కనిపించడం లేదు. ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుండి ప్రచారానికి కార్యకర్తలను కూలీలుగా మార్చి జండాలు మోపించిన రాజకీయ పార్టీలు ఓట్లను సైతం నోట్లతో కొనుగోలు చేసి అధికారం చేపట్టడం చూస్తుంటే ఎన్నికల ప్రక్రియ మొత్తం కూడా ఒక వ్యాపార క్రియ విక్రయ ప్రక్రియగా మిగిలిపోతుందని స్పష్టమవుతుంది.

భద్రాచలం పట్టణ వ్యాప్తంగా శనివారం రాత్రి నుండి ఓటుకి రూ.250 చొప్పున పంపిణీకి ఒక రాజకీయ పార్టీ శ్రీకారం చుట్టితే మరో ప్రతిపక్ష పార్టీ సైతం రూ.200 చొప్పున పంచేందుకు సిద్ధమైంది. ఇంత రాజకీయ ప్రలోభాలకు గురవుతున్న తరుణంలో కూడా వామపక్ష పార్టీల కార్యకర్తలు బహిరంగగానే డబ్బులు పంపిణీని వ్యతిరేకిస్తూ తాము ప్రత్యక్షంగా ఎన్నికల పోటీలో లేనప్పటికీ తమ పార్టీ మద్దతు ఇచ్చిన పార్టీకి స్వచ్ఛందంగా ఓటు వేస్తామని తేల్చి చెప్పడమే కాక తమ ఇళ్ళ ముందుకు వచ్చి డబ్బులు పంపిణీ చేద్దామని ప్రయత్నించిన ప్రధాన రాజకీయ పార్టీ కార్యకర్తలను హెచ్చరించి డబ్బును తిరస్కరించడంతో కమ్యూనిస్టు పార్టీలతోనే రాజకీయ విలువలు నిలబడతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కట్టుదిట్టమైన భద్రత నడుమ

పోలింగ్ సామగ్రి తరలింపు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



నియోజకవర్గంలోని పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని సెక్టార్లవారీగా సంబంధిత పోలింగ్ స్టేషన్లకు భద్రత నడుమ సిబ్బందిని తరలించడం జరిగిందని 119-భద్రాచలం ఎస్టీ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి/ఆర్డీవో దామోదర్ రావు అన్నారు. ఆదివారం భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన సామగి సెక్టర్ల వారీగా పోలీసు బందోబస్తుతో పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సోమవారం జరిగే ఎంపీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మారుమూల మండలాల చర్ల, దుమ్ముగూడెం సెక్టార్లకు సంబంధించిన పోలింగ్ స్టేషన్లకు ప్రత్యేక పోలీస్, సిఆర్పిఎఫ్ బలగాల సెక్యూరిటీతో ముందుగా పంపించడం జరిగిందని అన్నారు. ప్రతి సెక్టార్ రూటులవారీగా పోలింగ్ స్టేషన్లను బట్టి సిబ్బందిని చేరవేయడానికి బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని, 176 పోలింగ్ స్టేషన్లకు గాను 25 మంది సెక్టర్ అధికారులు, 120 మంది మైక్రో అబ్జర్వర్లు, ప్రతి పోలింగ్ స్టేషన్కు పీఓలు, ఏపీవోలు, ఓపిఓలు, రిజర్వుగా పోలింగ్ సిబ్బందితో 844 మందిని నియమించినట్టు తెలిపారు. ఎన్నికల విధులకు వెళ్లే పోలింగ్ స్టేషన్లకు ఎండాకాలంను దృష్టిలో పెట్టుకొని గ్లూకోస్, డిపాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రతి పోలింగ్ స్టేషన్‌కు పంపిణీ చేసినట్టు తెలిపారు. అలాగే పోలింగ్ స్టేషన్లలో కరెంటు, మంచినీటి సౌకర్యం కల్పించడం జరిగిందని, పోలింగ్ స్టేషన్లలో నియమించబడ్డ సిబ్బందికి ముందుగా పోలింగ్ మెటీరియల్ ఇవ్వడం జరిగిందని, వారు సామగ్రి సరిచూసుకున్న అనంతరం రాజకీయ ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడం(స్ట్రాంగ్ రూమ్) సిల్ తీసి ఈవీఎం మిషన్లను పోలింగ్ సిబ్బందికి ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్లో పోలింగ్ సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, సంబంధిత పోలింగ్ సిబ్బంది వారి వారి పోలింగ్ స్టేషన్లకు చేరుకున్న తర్వాత నేడు జరిగే ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సాయంత్రం వరకు పూర్తి చేసుకోవాలని, 13వ తేదీ ఉదయం 5:30 గంటలకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మార్క్ ఫోల్ నిర్వహించాలని, అనంతరం సెక్టరల్ ఆఫీసర్ల సమక్షంలో ఈవీఎం మిషన్ సిల్ వేసి ఉదయం ఏడు గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభించాలని సాయంత్రం పోలింగ్ అయిపోయే సమయంలో ఓటర్లు గనక ఉంటే ప్రత్యేకంగా తయారు చేసిన స్లిప్పులను అందించి ఓటింగ్ ప్రక్రియ అయిపోగానే సామాన్లన్నీ జాగ్రత్తగా తీసుకొని భద్రత నడుమ సెక్టర్ ఆఫీసర్ల సమక్షంలో తిరిగి తీసుకురావాలని అన్నారు. పోలింగ్ సిబ్బందికి ఏ చిన్న సమస్య వచ్చినా సొంతంగా నిర్ణయం తీసుకోవద్దని, ఏ సమస్య ఉన్న సంబంధిత సెక్టరల్ అధికారికి, ఏఆర్ఓకి తెలియజేయాలని అన్నారు. పోలింగ్ ఏజెంట్ల ద్వారా టెండర్ ఓటు, ఛాలెంజ్ ఓటు గురించి సమస్య వస్తే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్య పరిష్కరించుకోవాలని అన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్లలో సిగ్నలింగ్ వ్యవస్థ సరిగా లేని దగ్గర ప్రత్యేక యాప్ ద్వారా ప్రతి రెండు గంటలకు ఒకసారి అన్ని పోలింగ్ స్టేషన్ల నుండి సంబంధిత సెక్టరల్ అధికారులు, పురుషులు, స్త్రీలు వేరువేరుగా పోలింగ్ సరళిని తప్పనిసరిగా ఏఆర్ఓకి తెలియజేయాలని అన్నారు. సెక్టరల్ అధికారుల నుండి మొదలుకొని పీఓలు, ఏపీవోలు, ఓపీఓలు, పోలింగ్ స్టేషన్లో వివిధ పనులకు నియమించిన సిబ్బంది అందరూ కలిసికట్టుగా ఉండి పోలింగ్ ప్రక్రియ ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా సహకరించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, నయాబ్ తహసీల్దార్ ఎలక్షన్ మహీధర్, రెవెన్యూ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
9
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | మే 13, 2024 | www.navatelangana.com



పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి

- కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది

నవతెలంగాణ-కామేపల్లి

మండలంలో పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ సీహెచ్.సుధాకర్, ఎంపీడీఓ రవీందర్ తెలిపారు. టెంట్లు మంచినీటి సౌకర్యం మరుగుదొడ్లు విద్యుత్తు, ఫ్యాన్లు తదితర ఏర్పాట్లను చేసినట్టు తెలిపారు. ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బంది పోలింగ్ బూతుల వద్దకు చేరుకున్నారు. ఎన్నికల సిబ్బందికి ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్ని కలు జరిగేందుకు ఓటర్లు సహకరించాలని కోరారు.

ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-ఖమ్మం

స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు, ఓటర్లను ప్రలోభాలు, ఒత్తిడులు, భయభ్రాంతులకు గురిచేయడం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో 53, ఖమ్మం జిల్లావ్యాప్తంగా 40 ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు అనుక్షణం అప్రమత్తంగా వుంటూ పటిష్ట నిఘా చేపడుతున్నాయని ఆయన అన్నారు. వీటికి తోడు 21 ఎస్ఎస్టి టీములు, 37 ఎంసిసి టీములు, 203 మంది సెక్టార్ అధికారులు క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు ఆయన అన్నారు. వ్యయ నోడల్ అధికారులు, వ్యయ పరిశీలకులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. జిల్లాలో నగదు జప్తు విషయమై పలు కేసులు నమోదు చేసినట్లు ఆయన అన్నారు. కూసుమంచి మండలం దేవునితాండ వద్ద బీఆర్ఎస్ పార్టీ వారు ఓటర్లకు పంచడానికి తీసుకెళ్తున్న రూ. 99,94,000 లను నిఘా అధికారులు పట్టుకొని, నగదు జప్తుచేసి, కేసు నమోదుచేశారన్నారు. మధిర మండలం నారాయణపురం వద్ద ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు రూ. 1.70 లక్షలు పంపిణీకి తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. మధిర మండల కేంద్రంలో ఓటర్లకు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీకి చెందినవారు నగదు పంచుతుండగా పట్టుకొని కేసు నమోదుచేశామన్నారు. మధిరలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన వారు ఓటర్లకు పంచడానికి తరలిస్తున్న రూ. 4,29,500 లను జప్తు చేసి, కేసు నమోదుచేశామన్నారు. ఖమ్మం ఒకటవ టౌన్ పరిధిలో ఓటర్లకు పంచడానికి తీసుకెళ్తున్న రూ. 45,650 లను జప్తు చేసి కేసు నమోదు చేశామన్నారు. కారేపల్లి వద్ద బిజెపి కి చెందిన వారు రూ. 3,46,500 లను ఓటర్లకు పంచడానికి తరలిస్తుండగా నిఘా బృందాలు పట్టుకొని, నగదు జప్తుచేసి కేసు నమోదు చేశామన్నారు. రాజకీయ నేతలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం చేస్తే, సంబంధిత అభ్యర్థులపై కేసు నమోదు చేయడం, నగదు, మెటీరియల్, వాహనాల జప్తు చేయడం జరుగుతుందని, ఘటనలో దొరికిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని కఠినచర్యలు చేపట్టడం జరుగుతుందని రిటర్నింగ్ అధికారి అన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నైతికతతో ఓటు వేయాలని, స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు అన్ని వర్గాల వారు తమవంతు సహకారం అందించాలని పేర్కొన్నారు.



శ్రీధర్ చౌదరి బర్త్‌డే వేడుకలు

నవతెలంగాణ-మణుగూరు

మాజీ కేంద్ర మంత్రివర్యులు, ప్రస్తుత రాజ్యసభ సభ్యులు రేణుక చౌదరి భర్త శ్రీధర్ చౌదరి జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. మణుగూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గురజాల గోపి ఆధ్వర్యంలో అమ్మానాన్న అనాధాశ్రమంలో కేక్ కటింగ్, బిర్యానీ ప్యాకెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా గురజాల గోపి మాట్లాడుతూ శ్రీధర్ చౌదరి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళలు ఎండి షబానా, దేరంగుల సుజాత, పూనం సరోజకోరి, శ్యామల, రేణుక, సౌజన్య శ్రీలత, చక్రి, రేణుక తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలి

నవతెలంగాణ-మధిర

విద్యార్థులు ప్రత్యేకమైన లక్ష్యంతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మధిర సేవా సమితి అధ్యక్షులు పల్లపోతు ప్రసాదరావు పేర్కొన్నారు. ఆదివారం మధిర సేవా సమితి ఆధ్వర్యంలో ఇంటర్ స్టేట్ ర్యాంకర్లకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన పాగి శశాంక్, మామిళ్ళపల్లి వర్షను మధిర సేవాసమితి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు వెళ్లి మధిరకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధిర సేవా సమితి నిర్వాహకులు మిరియాల కాశి విశ్వేశ్వరరావు, ముప్వా రామకృష్ణ, కపిల వాయి జగన్మోహన్ రావు, యర్రా లక్ష్మణరావు, వందనపు శ్రీనివాసరావు, కోమటి సుధాకర్ రావు, దొడ్డ శ్రీనివాసరావు, వంగవేటి రాజశేఖర్, ఎస్కే సైదా, కొత్తమాసు రామారావు, దాచేపల్లి రాము, దొడ్డ వెంకటనారాయణ, నకిరికంటి గోవిందు, కాజా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరునక్షత్ర మహోత్సవం

నవతెలంగాణ-రాజపేట

మండలంలోని రఘునాథపురం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పంచమి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి మంగళ శాసనాలతో ఆలయ అర్చకులు శ్రీ సాయి కిరణ్ చార్యులు జగదాచార్యులు శ్రీ భగవద్ రామానుజచార్య స్వామివారి తిరునక్షత్రోత్సవం1007వ జయంతి పర్వదినం సందర్భంగా తిరునక్షత్ర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సాయికిరణ్ చార్యులు ముందుగా విశ్వక్సేన ఆరాధన అనంతరం శ్రీ భగవత్ రామానుజుల పంచలోహ మూర్తికి తిరుమంజన సేవ స్నాపన పంచామృతాలతో వేదమంత్రోచ్ఛనులతో ప్రత్యేక అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలతో పూలమాలలతో శ్రీ స్వామివారిని శోభాయ మానంగా అలంకరించి సువర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చనలు, సహస్రనామార్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నల్లబోతు రామారావుకు నివాళి

నవతెలంగాణ- తల్లాడ



మండల పరిధిలోని ముద్దునూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లబోతు రామారావు (55) గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టరాగమయి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మండల కాంగ్రెస్ నాయకులు కాప సుధాకర్, దుండేటి వీరారెడ్డి, కటికి కిరణ్, షేక్ జమాల్ నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటం

- మినరలా...జనరలా...
- నిబంధనలు పాటించని తాగునీటి శుద్ధి ప్లాంట్లు నిర్వాహకులు
- పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు సబ్ డివిజన్‌లో వాటర్ ప్లాంట్‌ల నుండి అమ్మే మంచినీరు మినరలా...జనరల్ వాటరా అనే విధంగా తలపిస్తున్నాయి. బోర్ల నుండి తీసిన వాటర్‌ని, లేదా మిషన్ భగీరథ నీటిని మినరల్ వాటర్‌గా అమ్ముతున్నారని సమాచారం. పారిశ్రామికంగా రోజురోజుకు అభివృద్ధి అవుతున్న మణుగూరు పరిసర ప్రాంతాలలో, సబ్ డివిజన్ పినపాక, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లో పుట్టగొడుగుల వాటర్ ప్లాంట్లు నిర్వహిస్తున్నారు. వాటర్ శుద్ధి ప్లాంట్ నుంచి కొనుగోలు చేస్తున్న తాగునీటి వినియోగం నేడు సర్వసాధారణమైంది. ఆరోగ్య రక్షణ దృశ్య ప్రజల తమ దైనందిన జీవితంలో దీన్ని భాగంగా చేసుకుంటున్నారు. దాదాపు ప్రతి పల్లెలో కూడా ప్లాంట్ వెలిశాయి. కొన్నిచోట్ల నీటితోపాటు అనారోగ్యాన్ని కొనుక్కొని వస్తున్నామని విషయాన్ని ప్రజలు గ్రహించడం లేదు. మండలంలో కొందరు నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా ప్రజారోగ్యంతో చెలగాట మాడుతున్నారు. వేసవిలో మంచి నీటి వినియోగం ఎక్కువగా ఉండడంతో మణుగూరు పరిసర ప్రాంతాల్లో ప్రస్తుత నీటి వ్యాపారం జోరుగా సాగుతుంది. డబ్బాను పట్టణం, పల్లెల్లో రూ.10 నుంచి 15 వరకు విక్రయిస్తున్నారు. మణుగూరులో సుమారు 25కు పైగా మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయి. వీటిల్లో చాలా వాటికి అనుమతులు లేవు గతంలో నిర్వాహకులే ఇంటింటికి క్యాన్లు సరఫరా చేసేవారు అలవాటు పడిన తర్వాత చాలాచోట్ల ప్రజలే ప్లాంట్ల వద్దకు వెళ్లి మంచినీరును తీసుకొచ్చుకుంటున్నారు. తాగునీటి సిద్ధి ప్లాంట్ నిర్వాహకులు శుద్ధ జలం ప్లాంట్లు ఏర్పాటుకు బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్) అనుమతి తప్పనిసరి క్రమబద్ధీకరించుకోవాలి. ప్లాంట్ ఏర్పాటు కోసం పక్కా భవనం ఉండాలి. ఎటు చూసినా 15 అడుగుల వైశాల్యంతో విశాల గది ఏర్పాటు చేసుకోవాలి.



నిత్యం గోరువెచ్చని నీటితో క్యాన్లను శుభ్రం చేయాలి. నీటిని నింపేందుకు శుద్ధికి వేరువేరు యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలి. శుద్ధి కోసం రసాయనాలు మోతాదుని కలిపేందుకు రెండు ప్రయోగశాలలో తప్పనిసరి ఇందులో రసాయన శాస్త్రం, మైక్రో బయాలజీలో పీజీ పూర్తి చేసిన ఇద్దరు నిపుణులు నియమించాలి. ప్రత్యేక రిజిస్టర్ నిర్వహిస్తూ అందులో నీటి పరీక్ష వివరాలు పొందపరచాలి. ఆరు నెలలకోసారి ప్రయోగశాలలో శుద్ధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి. కానీ జిల్లాలో వేళ్ళ మీద లెక్కించగలిగే సంఖ్యలో ప్లాంట్లకే బిఎస్ఐ అనుమతులు ఉన్నాయి. చాలా చోట్ల ఒకే గదిలో ప్లాంట్ నిర్వహిస్తున్నారు. మండలంలో ఎక్కడ కూడా గోరువెచ్చనిటిని శుభ్రతకు ఉపయోగించడం లేదు. ఫిల్లింగ్ ప్యూరిఫైడ్‌కు అన్నిచోట్ల రెండు ట్యాంకులు ఉన్నాయి. ప్రయోగశాల నిపుణుల మాట నుంచి చేతికి అందినంత పరిమాణంలో రసాయనాలు కలుపుతున్నారు. రిజిస్టర్లు నిర్వహణ ఎక్కడా అమలు కావడం లేదు. పర్యవేక్షణ కొరడంటంతో ఆరు నెలలకు ఒకసారి పరీక్షలు జాడే కరువైంది.

మినరల్ వాటర్ తాగితే ఒళ్ళు కీళ్ల నొప్పులు

గృహిణి కొండ్రు గౌరీ



మణుగూరులో ఉన్న వాటర్ ప్లాంట్ మంచినీరు తాగినట్లయితే అనారోగ్యాల పాలవుతున్నారు. ఒళ్ళు, నొప్పులు కీళ్ల బాధలు ఏర్పడుతున్నాయి. కొన్ని సందర్భాలలో కూర్చొని లేవలేని పరిస్థితి ఏర్పడుతుంది. మినరల్ వాటర్ కాకుండా బోర్ వాటర్ వాడుతున్నాము. ఎలాంటి ఇబ్బందులు లేవు.

పోలింగ్ కేంద్రాలకు చలో చలో



- సామగ్రితో వెళ్ళిన సిబ్బంది..
- పరిశీలించిన జిల్లా కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్ దత్

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

లోకసభ ఎన్నికల పోలింగ్ విధులను సిబ్బంది కట్టుదిట్టంగా నిర్వహించాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఖమ్మం, పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్ల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కలెక్టర్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తో కలిసి ఆదివారం పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవిఎం యంత్రాలను సంబంధిత పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలన్నారు. రిజర్వ్ ఈవీఎం యంత్రాలు, రిజర్వు పోలింగ్ సామగ్రి సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉండాలని తెలిపారు. సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల నియమ, నిబంధనలను తప్పకుండా పాటించాలని కలెక్టర్ సూచించారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందించామన్నారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం పరిదిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఖమ్మం జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్న 1896 పోలింగ్ కేంద్రాల వద్ద మే -13న ఖమ్మం పార్లమెంటు స్థానానికి పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని, వేసవి దృష్టిలో ఉంచుకొని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద చల్లని నీరు, క్యూలైన్ల వద్ద టెంట్, ఇతర సౌకర్యాలు కల్పించామని అన్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించామని తెలిపారు. ఓటర్లందరూ తప్పనిసరిగా మే 13న జరిగే పోలింగ్ లో పాల్గొనేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చి, వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. జిల్లాలో ఎవరైనా ప్రలోభాలకు గురి చేయటం, ఉల్లంఘన లు దృష్టికి వస్తే సి-విజిల్ యాప్‌కు, 1950 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.



ఎన్నికలలో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, సహాయ రిటర్నింగ్ అధికారులు ఆదర్శ్ సురభి, ఎం. రాజేశ్వరి, అధికారులు, తదితరులు ఉన్నారు.

లౌకికవాద పరిరక్షణకు కాంగ్రెస్‌ను గెలిపించండి

- సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

నవతెలంగాణ-ఖమ్మం

లౌకికవాద పరిరక్షణకు సీపీఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కోరారు. ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18వ పార్లమెంటుకు జరుగుతున్న ఎన్నికలు అత్యంత కీలకమైనవని దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలుగా చెప్పుకోవచ్చునన్నారు. దేశాన్ని మతం పేర, కులం పేర విభజించాలనుకునే బీజేపీ మరో



పక్క లౌకికవాద ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడిన ఇండియా కూటమి బరిలో ఉన్నాయని, ప్రజలు ఆలోచించి ఈ దేశంలో ప్రజాస్వామ్యం పరిడవిల్లాలంటే లౌకికవాదం మనుగడ కొనసాగాలంటే ఇండియా కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయాలన్నారు. ఖమ్మం పార్లమెంటు పరిధిలో సిపిఐ బలపరుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నగర కార్యదర్శి ఎస్కే జానిమియా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

- 54 పోలింగ్ కేంద్రాలు
- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు పోలింగ్
- తహసీల్దార్ మన్నే ఉష శారద

నవతెలంగాణ-ఎర్రుపాలెం

నేడు జరగనున్న పార్లమెంటు ఎన్నికలు సజావుగా ప్ర శాంత వాతావరణంలో నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు తహసిల్దార్ మన్నే ఉషా శారద తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎర్రుపాలెంమండలం లో 39,978 మంది ఓటర్లకు



గాను 54 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదు సెక్టార్ల పరిధి లో 216 మంది ఎన్నికల సిబ్బంది తమ విధులు నిర్వ హిస్తారని తెలిపారు.ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక పోలీ స్ ని కేటాయించినట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బందిని ఎన్నికల మెటీరియల్ ను కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. ఓటు కలిగిన ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును నిర్భయంగా సద్వినియోగ పరుచుకోవాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణలో భాగంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

నవజాత శిశువులకు దుస్తులు పంపిణీ


- పేద ప్రజలకు నర్సులు చేస్తున్న సేవ మరువలేనిది
- ఆర్ఎంఓ డాక్టర్ వై.రాజశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-భద్రాచలంరూరల్

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం, మదర్స్ డే సందర్భంగా మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో నవజాత శిశువులకు పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వై. రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నర్సు దుర్గ భవాని చేతులు మీదుగా ఒక్కొక్క శిశువుకి రెండు జతలు చొప్పున 30 మందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పిల్లల వైద్య నిపుణులు ఆర్ఎంఓ వై .రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ...అంతర్జాతీయ నర్సులు దినోత్సవం సందర్భంగా నవజాత శిశువులకు దుస్తులు పంపిణీ



చేసిన నిర్వాహకులను మదర్ థెరిస్సా ట్రస్ట్ సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి మాట్లాడుతూ. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం వైద్యరంగంలో కీలకమైన నర్సు మృతికి గౌరవాన్ని హుందాతనాన్ని తీసుకువచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం మే 12వ తేదీన ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని తెలియజేశారు. నాలుగు రాష్ట్రాల సరిహద్దులకు కేంద్ర బిందువైన భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లోని నర్సులు నిజంగా సేవామూర్తులే అని సేవలను కొనియాడారు. రోగి ఆస్పత్రికి వచ్చిన దగ్గర నుంచి కోలుకుని ఇంటికి వెళ్లేవరకు వెన్నంటే ఉండి సేవలు చేస్తారు. కరోనా సమయంలో వైద్యులతో పాటు నర్సులు చేసిన సేవలు వెలకట్టలేనివి. వైద్యులు ఇచ్చే మందులు, చికిత్సతో పాటు రోగి ఒక వ్యాధి నుండి కోలుకోవడానికి సరైన సంరక్షణ ఎంతగానో దోహదం చేస్తుందనీ తెలిపారు. ఇందులో 24 గంటలూ రోగి సంరక్షణలో నిమగ్నమైన వైద్యుల కంటే నర్సులదే పెద్ద బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి, ట్రస్ట్ సభ్యులు చోళ ఇన్సూరెన్స్ మేనేజర్ బాలరాజు, బూరం నవీన్, సాయి కుమార్, జయరాం హాస్పిటల్ నర్సు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



మాతృత్వం ఒక వరం

- పారిశుద్ధ్య కార్మికులకు ఘన సన్మానం
- డాక్టర్ శోభాదేవి

నవతెలంగాణ-ఖమ్మం

జీవరాసులన్నిటిలోను అత్యంత నిస్వార్థ సేవకురాలు అమ్మేనని... ఆమె సేవలు వెలకట్టలేమని, అమ్మ ఎన్ని బాధలు పడినా పిల్లలు బాగుండాలని కోరుకుంటుందని, మాతృత్వం ఒక వరం అని ప్రముఖ డాక్టర్ పేర్ల శోభాదేవి అన్నారు. ఆదివారం ఖమ్మంలోని అంతర్జాతీయ తల్లుల దినోత్సవం పురస్కరించుకుని పెవిలియన్ గ్రౌండ్‌లో పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మాతృత్వం గొప్ప తనాన్ని గురుంచి తెలిపారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవానికి పలువురు దాతలు సహృదయాన్ని చాటుకున్నారు. అనంతరం మహిళలకు 44, 45వ డివిజన్ల పారిశుద్ధ్య మహిళా కార్మికులకు శాలువాలు, తాంబూలం, గాజులు, చేతి రుమాలు పూలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొండమీది వెంకట్, ట్రెజరర్ సుదర్శన్, ఏఐటీయూసీ మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాకం శ్యామ్‌బాబు, నర్సింహారావు, శంకర్‌గౌడ్, పాదం యోగ ఆర్గనైజర్ సంధ్య, డాక్టర్ సీతయ్య మహిళా ప్రతినిధి మచ్చ లక్ష్మి జే. నాగభూషణం(విశ్రాంత అధ్యాపకులు), జీ. సుభాషచంద్రబోస్ హైదరాబాద్, ఇండో ఖతార్, వెంకటేశ్వర గార్డెన్స్ రియల్ ఎస్టేట్ శ్రీకాంత్, మై స్కూల్ విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్, మాధవి, రజని, సౌజన్య, రమ, పద్మ, రాణి, లక్ష్మి కళావతి, దయామని తదితరులు పాల్గొన్నారు.



సుదా కోటేశ్వరరావుకు పరామర్శ

నవతెలంగాణ-ఖమ్మం

నేలకొండపల్లి మండలం చెరువుమాదారం గ్రామానికి సుదా కోటేశ్వరరావుకు ఇటీవల యాక్సిడెంట్‌లో గాయాలై ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. కోటేశ్వరరావుని డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావులు ఆదివారం పరామర్శించారు.

నేడే నాలుగో విడత పోలింగ్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నేడు నాలుగో విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. దేశవ్యాప్తంగా పది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 96 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 175, ఒడిశాలో 28 అసెంబ్లీ స్థానాలకూ ఓటింగ్ జరగనుంది. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అయితే తెలంగాణలో ఓటింగ్‌ను బట్టి సమయాన్ని పెంచనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. 96 లోక్‌సభ స్థానాల్లో 64 జనరల్, 12 ఎస్టీ, 20 ఎస్సీ స్థానాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 175 అసెంబ్లీ స్థానాల్లో 139 జనరల్, 7 ఎస్టీ, 29 ఎస్సీ స్థానాలు ఉన్నాయి. ఒడిశాలోని 28 అసెంబ్లీ స్థానాలలో 11 జనరల్, 14 ఎస్టీ, 3 ఎస్సీ స్థానాలు ఉన్నాయి. 10 రాష్ట్రాల్లో 1,717 మంది అభ్యర్థులు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

దేశ వ్యాప్తంగా 17.70 కోట్ల మంది ఓటర్లు ఉండగా, అందులో 8.97 కోట్ల మంది పురుషులు, 8.73 కోట్ల మహిళా ఓటర్లు ఉన్నారు. 12.49 లక్షల మంది 85 ఏండ్ల పైబడిన వారున్నారు. 19.99 లక్షల మంది వికలాంగ ఓటర్లు ఉన్నారు. 1.92 లక్షల పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో 19 లక్షల మంది పోలింగ్ అధికారులు బాధ్యతలు నిర్వహించనున్నారు.

అదే విధంగా దేశ వ్యాప్తంగా 364 మంది పరిశీలకులు ఉన్నారు. అందులో 126 సాధారణ, 70 మంది పోలీసు, వ్యయ పరిశీలకులు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 4,661 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్, 4,435 మంది స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్, 1,710 వీడియో సర్వేలెన్స్ టీమ్స్, 934 వీడియో వ్యూవింగ్ టీమ్స్ ఎన్నికల విధుల్లో ఉన్నాయి. 1,016 అంతర్రాష్ట్ర, 121 అంతర్జాతీయ సరిహద్దుల చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ఏర్పాటు చేశారు.

జార్ఖండ్ మంత్రి అలంగిర్‌కు ఈడీ సమన్లు



రాంఛి : జార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, కాంగ్రెస్ నేత అలంగిర్ ఆలం(70)కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసినట్టు సంబంధిత అధికారులు ఆదివారం నాడు వెల్లడించారు. మనీలాండరింగ్ కేసులో తమ ముందు విచారణకు హాజరుకావాలని ఆయనను ఈడీ ఆదేశించింది. ఈ కేసులో ఆలంగిర్‌కు సంబంధించిన ఒక ఇంటిలో రూ.32 కోట్ల నగదు ఇటీవల ఈడీ స్వాధీనం చేసుకుంది. ఆలం వ్యక్తిగత కార్యదర్శి సంజీవ్ లాల్‌ను, ఇంటి సహాయకుడిని కూడా అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాంఛిలోని ఈడీ జోనల్ కార్యాలయంలో మంగళవారం జరిగే విచారణకు హాజరవ్వాలని ఆలంకు పంపిన సమన్లలో పేర్కొన్నారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఈ) కింద ఆయన వాగ్మూలాన్ని ఈడీ అధికారులు రికార్డు చేయనున్నట్టు తెలిసింది. గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన వివిధ లావాదేవీల్లో అక్రమాలు జరిగినట్టు ఈడీ ఆరోపిస్తోంది. అయితే తనకు సంజీవ్ లాల్ జరిపిన లావాదేవీలతో సంబంధం లేదని ఆలం పేర్కొంటున్నారు. ఈ కేసు వెలుగులోకి వచ్చినప్పటి నుంచి సంజీవ్‌ను ఆయన దూరం పెట్టినట్టు తెలుస్తోంది.

ఆరు నెలల తర్వాత తెరుచుకున్న బద్రీనాథ్ ఆలయం

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ ఆలయం తలుపులు తెరుచుకున్నాయి. ఆరు నెలల తర్వాత సాంప్రదాయ డప్పు, నాదస్వర వాయిద్యాల మధ్య బద్రీనాథ్ ఆలయ తలుపులను ఆదివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో పూజారులు తెరిచారు. దీంతో చార్‌ధామ్ యాత్ర అధికారికంగా ప్రారంభమైంది. చార్‌ధామ్ యాత్రలో బద్రీనాథ్, కేదార్ నాథ్, యమునోత్రి, గంగోత్రి ఆలయాలను యాత్రికులు సందర్శిస్తారు. కేదార్‌నాథ్, యమునోత్రి, గంగోత్రి ఆలయాల తలుపులను అక్షయ తతీయ సందర్భంగా గత శుక్రవారమే తెరిచారు. అధికారిక సమాచారం ప్రకారం కేదార్‌నాథ్‌ను తొలి రోజు రికార్డు స్థాయిలో దాదాపు 29 వేల మంది సందర్శించారు. శనివారం సాయంత్రం 4 గంటల వరకు 7,37,885 మంది బద్రీనాథ్ సందర్శన కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. గతేడాది 18,39,591 మంది ఆలయాన్ని సందర్శించారు.


ఎస్‌ఎం కృష్ణకు తీవ్ర అస్వస్థత



బెంగళూరు : కర్నాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్‌ఎం కృష్ణ (92) తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కొద్ది రోజుల కిందట అనారోగ్యంతో స్థానిక మణిపాల్ ఆస్పత్రిలో చేరిన ఆయన ఆదివారం మరింత తీవ్రంగా అస్వస్థతకు గురికావడంతో ఐసియు వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నట్టు వైద్యులు తెలిపారు. ఏప్రిల్ 21న అస్వస్థతకు గురికావడంతో ఆయనను తొలుత బెంగళూరులోని వైదేహి ఆస్పత్రిలో చేర్పించారు. ఆ తర్వాత అదే నెల 29న మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ సునీల్ కారంత్ నేతత్వంలోని క్రిటికల్ కేర్ టీమ్ చికిత్స అందిస్తున్నారని మణిపాల్ వైద్యులు పేర్కొన్నారు. కాగా కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మణిపాల్ ఆస్పత్రికి వెళ్లి కృష్ణను పలకరించారు. అలాగే ఆయనకు అందిస్తున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీలో ఎన్నో కీలక పదవులను అనుభవించిన ఎస్‌ఎం కృష్ణ 2004 నుంచి 2008 వరకు కర్నాటక ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత రాజ్యసభకు ఎన్నికై కేంద్రమంత్రిగానూ సేవలందించారు. తర్వాత గవర్నర్ పదవిని చేపట్టారు. కొన్నేళ్ల క్రితం కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఆ తర్వాత రాజకీయాలకు స్వస్తిపలికారు. తొంబైల్లో యాభైలా తాను ఉండలేనని అందుకే రాజకీయాలకు దూరంగా ఉండాలని అనుకుంటున్నానని అప్పట్లో ఆయన చెప్పారు.

బెట్టింగులకు పాల్పడి రూ.2కోట్లు

కుమారుడిని హత్య చేసిన తండ్రి



నవతెలంగాణ-చిన్న శంకరంపేట


బెట్టింగులు, జల్సాలకు అలవాటు పడి రూ.2 కోట్లు పోగొట్టుకున్న కుమారుడిని తండ్రి దారుణంగా హత్య చేసిన ఘటన మెదక్ జిల్లా చిన్న శంకరంపేట గ్రామపంచాయతీ పరిధిలోని బాగిర్తిపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు,కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న శంకరంపేట మండలం బాగిర్తిపల్లి గ్రామానికి చెందిన రెడ్డి ముఖేష్ కుమార్ (28)కు భార్య, కుమార్తె ఉన్నారు.వడియారం రైల్వే స్టేషన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు.ముఖేష్ కుమార్ తండ్రి సత్యనారాయణ రైల్వే ఉద్యోగిగా విధులు నిర్వహించి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు.సత్యనారాయణ పెద్ద కొడుకైన ముఖేష్ కుమార్‌కు రైల్వే ఉద్యోగం ఇప్పించారు.కాగా, ముఖేష్ కుమార్ జల్సాలు,బెట్టింగులకు అలవాటుపడి మేడ్చల్‌లోని ఇల్లును, ప్లాట్లనూ అమ్మేశారు.తండ్రి సత్యనారాయణ పలుమార్లు మందలించినా మార్పు రాలేదు.సహనం కోల్పోయిన తండ్రి.. శనివారం రాత్రి పక్క బిల్డింగ్ లో నిద్రపోయిన సమయంలో తండ్రి కొడుకు తలపై రాడుతో దారణంగా కొట్టి చంపేశాడు.సంఘటనా స్థలాన్ని రామాయంపేట సీఐ వెంకటేశ్‌తో పాటు ఎస్ఐ నారాయణ గౌడ్,క్లూస్ టీంతో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.స్థానిక ఎస్ఐ నారాయణ గౌడ్ కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మానసిక ఆందోళనలతో బలవన్మరణాలు

- ప్రసవానంతరం 85 శాతం మందిలో ఈ లక్షణాలు
- సంపన్న దేశాల్లో 20 శాతం, పేద దేశాల్లో అధికంగా..

లాన్సెట్ నివేదిక వెల్లడి

తల్లికాబోతున్న ప్రతి స్త్రీ శరీరం గర్భధారణ సమయంలో శారీరకంగా, మానసికంగా చాలా మార్పులకు లోనవుతుంది. దీంతో గర్భిణీ స్త్రీలు అప్పుడప్పుడు ఆందోళన, నిరాశకు లోనవుతూ ఉంటారు. విచారం, కోపం అనేది అందరిలోనూ కలిగేదే.. కొందరిలో ఇది ఎక్కువగా ఉంటుంది. గర్భిణులలో ఈ లక్షణాలు ఉన్నట్లయితే అది డిప్రెషన్‌కు దారి తీస్తుంది. ఒత్తిడికి గురయ్యేలా చేస్తుంది. చిన్న విషయాలకే ఆందోళన చెందడం వల్ల రక్తప్రసరణలో మార్పులు జరిగే ప్రమాదం ఉంది. ప్రసవ సమయంలో కలిగే భయం, ఎక్కువ ఆందోళనకు గురిచేస్తాయి. వీటితో పాటు అనేక ఆరోగ్య సమస్యలూ ఈ సమయంలో చుట్టుముట్టే అవకాశం ఎక్కువగా ఉంటుంది



తక్షణ చర్యలు అవసరం

గర్భిణులు, బాలింతలకు మానసిక ప్రశాంతతను కల్పించేందుకు తక్షణ చర్యలు అవసరమని, అత్యంత కీలకమైన ఈ సమయంలో వారికి సంపూర్ణ సహాయం, సంరక్షణ లభించేలా చూడాలని సూచించింది. చాలామంది మహిళలు తమలోని ఈ బలహీన లక్షణాలను బయటపెట్టేందుకు ఇష్టపడరని తెలుపుతూ.. వారి మానసిక ఆరోగ్య స్థితిని తెలుసుకొనేందుకు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించాలని నొక్కి చెప్పింది. గర్భిణులు, బాలింతల మానసిక ఆరోగ్య పరిరక్షణకు వారిలో అవగాహన కల్పించాలని, ఈ విషయమై వారితో బహిరంగంగా చర్చించాలని, వారికి అవసరమైన సహాయం అందిస్తామన్న భరోసా కల్పించాలని సూచించింది. మానసిక రుగ్మతల బారిన పడిన మహిళల కోసం కొన్ని వైద్య చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నాయని లాన్సెట్ తెలిపింది. అయితే గర్భిణులు, బాలింతలపై క్లీనికల్ ట్రయల్స్ నిర్వహించడానికి నైతికపరమైన ఒత్తిడుల కారణంగా ప్రస్తుత కాలంలో నూతన చికిత్స విధానాలను కనుగొనడం, వినూత్న ఔషధాల ఉత్పత్తి సవాలుగా మారిందని, ఇది పరిశోధనలకు ఆటంకంగా మారిందని పేర్కొంది.

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా గర్భిణుల్లో 10 శాతం, బాలింతల్లో 18 శాతం మంది మానసిక రుగ్మతలను ఎదుర్కొంటున్నారని లాన్సెట్ తాజా నివేదిక వెల్లడించింది. అల్ప, మధ్యాదాయ దేశాల్లో వీరు నిస్పృహ, ఆందోళన, మానసిక వ్యధకు లోనవుతున్నారని పేర్కొంది. దీంతో చాలామంది తమ ప్రసవ సమయంలో ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపింది. ఈ ధోరణి కారణంగా సంపన్న దేశాల్లో 5 నుంచి 20శాతం వరకు ప్రసూతి మరణాలు సంభవిస్తున్నాయని వెల్లడించింది. చాలా వరకు కేసులు అధికారుల దృష్టికి రాకపోవడంతో ఈ మరణాల సంఖ్య పేద దేశాల్లో ఇంకా ఎక్కువగా ఉండొచ్చని తెలిపింది.

ప్రసవానంతరం దాదాపు 85 శాతం మహిళల్లో కనిపించే ఆందోళన, విచారం, దుఃఖం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేస్తున్నారని, ఈ కారణంగా కూడా బాలింతల ఆత్మహత్యల ఘటనలు చోటు చేసుకుంటున్నాయని లాన్సెట్ వివరించింది. ప్రసవానంతరం వచ్చే మానసిక ఆరోగ్య పరిస్థితులు ఇటు తల్లి, అటు శిశువుల శ్రేయస్సును ప్రభావితం చేస్తాయని తెలిపింది.

ముఖ్యంగా తల్లీబిడ్డల మధ్య ఏర్పడాల్సిన ప్రేమానుబంధం, శిశు సంరక్షణ వంటివి కొరవడితే.. అది పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయని పేర్కొంది, తద్వారా కుటుంబాలు, భవిష్యత్తు తరాలు కూడా ప్రభావితమయ్యే అవకాశమున్నదని వివరించింది.

నర్సుల సేవలు వెలకట్టలేనివి

పలువురి వైద్యుల ప్రశంసలు

- ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం
- ఆస్పత్రుల్లో వేడుకలు





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


రోగులకు నర్సింగ్ ఆఫీసర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని పలువురు డాక్టర్లు ప్రశంసించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినం మే12 సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆస్పత్రుల్లో ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని నిలోఫర్ మాతా, శిశు ఆస్పత్రి, సనత్‌నగర్ ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ఉస్మానియా, గాంధీ హాస్పిటల్స్‌తో పాటు వరంగల్ ఎంజీఎం, నిజామాబాద్, నల్లగొండ, వనపర్తి తదితర జిల్లాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో నైటింగేల్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా వేడుకల్లో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ 1820 మే 12న ఇటలీలో జన్మించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జీవితం ఆదర్శమని కొనియాడారు. 1853లో లండన్‌లోని ఒక మహిళల ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా చేరిన నైటింగేల్, 1854లో క్రిమియా యుద్ధంలో టర్కీలో గాయపడిన సైనికులకు సేవలు చేయడానికి నర్సుల బృందాన్ని తీసుకువెళ్లిందని గుర్తుచేశారు. 1859లో 'నోట్స్ ఆన్ నర్సింగ్' అనే పుస్తకాన్ని ప్రచురించిన నైటింగేల్, ప్రపంచంలోనే మొదటి నర్సుల శిక్షణ కాలేజీని కూడా స్థాపించిందని తెలిపారు. నైటింగేల్ సేవలను గుర్తించిన 'ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్' సంస్థ 1965 నుండి నైటింగేల్ పుట్టినరోజైన మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. నర్సింగ్ ఆఫీసర్లు రోగులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. రాష్ట్రంలో నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు, నర్సింగ్ కౌన్సిల్‌కు ఎన్నికలు, డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్‌లో నర్సింగ్ ఆఫీసర్ల విభాగంలో వసతుల కల్పన, 2021లో నియామకమైన నర్సులకు రెగ్యులరైజేషన్ ప్రక్రియలో జాప్యాన్ని నివారించాలని చాలా కాలం నుంచి నర్సింగ్ ఆఫీసర్లు కోరుతున్న సంగతి తెలిసిందే.

సనత్‌నగర్ ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో డీన్ శిరీష్ కుమార్ చౌహాన్, ఎం.ఎస్.రాధిక నర్సింగ్ ఆఫీసర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు, అధ్యక్షులు ఎం.రామాంజనేయులు, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.మంజులత తదితరులు పాల్గొన్నారు.

నిలోఫర్ ఆస్పత్రిలో నిర్వహించిన వేడుకల్లో ఆ ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ జ్యోతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వప్న, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ ఇందిర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీల్లో గెలుపొందిన నర్సింగ్ ఆఫీసర్లకు బహుమతులు అందజేశారు.

రామ్‌దేవ్, బాలకృష్ణలకు హరిద్వార్ కోర్టు సమన్లు

- తప్పుడు ప్రకటనల కేసులో రెండోసారి నోటీసులు జారీ



డెహ్రాడూన్: యోగా గురువు రామ్‌దేవ్, పతంజలి సంస్థ ఎండీ ఆచార్య బాలకృష్ణలకు హరిద్వార్‌లోని చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు రెండవ సారి సమన్లు జారీ చేసింది. కరోనిల్ డ్రగ్ విషయంలో తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసిన కేసులో కోర్టుకు హాజరు కాకపోవడంతో 25 రోజుల్లో రెండోసారి ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. అంతేకాదు గత నెలలో పతంజలి ఉత్పత్తి చేస్తున్న 14 ఔషధాల లైసెన్స్‌లను సుప్రీంకోర్టు ఆదేశాలతో రద్దు చేసింది. కోర్టు తదుపరి విచారణను జూన్ 7కు వాయిదా వేసింది. తప్పుదోవ పట్టించే ప్రకటనల్లో అధిక రక్తపోటు, మధుమేహం, గాయిటర్, గ్లకోమా, అధిక కొలెస్ట్రాల్ వంటి పరిస్థితులకు సంబంధించిన మందులు ఉన్నాయి. కాగా ప్రాథమిక విచారణ తర్వాత, బాబా రామ్‌దేవ్, బాలకృష్ణను మే 10న హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. అయితే పతంజలిపై ఎలాంటి చర్యలు తీసుకోనందుకు రాష్ట్ర డ్రగ్ లైసెన్సింగ్ అథారిటీని సుప్రీంకోర్టు మందలించడం గమనార్హం.

హస్తం, కమలం 'మధ్య' పోరు

- నేడు 8 స్థానాల్లో రాష్ట్రంలో తుది దశ పోలింగ్
- గిరిజన ఓటు బ్యాంకుతో కాంగ్రెస్
- హిందుత్వ రాజకీయాలతో కాషాయ పార్టీ
- సిట్టింగ్‌లను మార్చిన బీజేపీ
- రాహుల్ జోడో యాత్ర ప్రభావం



మధ్యప్రదేశ్‌లోని 29 లోక్‌సభ స్థానాలకుగాను 21 స్థానాలకు ఒకటి, రెండు, మూడు దశలో ఎన్నికలు జరిగాయి. మిగిలిన ఎనిమిది నియోజకవర్గాలు.. దేవాస్, ఉజ్జయిని, మాండ్‌సోర్, రత్లామ్, ధార్, ఇండోర్, ఖర్గన్, ఖాండ్వ నియోజకవర్గాల్లో నాలుగో విడత మే13న ఎన్నికలు జరగనున్నాయి. హిందుత్వ రాజకీయాలతో బీజేపీ, గిరిజన, ముస్లిం ఓటు బ్యాంకుపై ఆశతో కాంగ్రెస్ తలపడుతున్నాయి. గిరిజన ప్రాంతాల గుండా సాగిన రాహుల్ జోడో యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ధార్, ఖర్గోన్‌లలో ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారం చేశారు.



ధార్: నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి రాధేశ్యామ్ మువెల్ పోటీ చేస్తుండగా, సిట్టింగ్ ఎంపి ఛత్రసింగ్ ధర్బార్‌ను తప్పించి సావిత్రి ఠాకూర్‌ను బిజెపి బరిలోకి దింపింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపి గజేంద్ర సింగ్ బీజేపీలో చేరారు. దీనికి తోడు బీజేపీ మత రాజకీయాలకు తెరతీసింది. భోజ్‌షాలా ఆలయం, మసీదు ప్రాంగణంలో సరస్వతి దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని హైకోర్టులో వేసిన పిల్‌తో మళ్లీ హిందు, ముస్లింల మధ్య గొడవ రగులుకుంది. ఈ ప్రభావం ఎన్నికల మీద పడుతుందంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ గిరిజన, ముస్లిం ఓటు బ్యాంకు కలిగి ఉంది. ధార్ పరిధిలోగల అసెంబ్లీ స్థానాల్లో హస్తం గెలుపొందింది.

దేవాస్: ఇక్కడ కాంగ్రెస్ నుంచి రాజేంద్ర మాలవియా, బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ మహేంద్రసింగ్ సోలంకి పోటీ పడుతున్నారు. బలాయ్, కుల ప్రాతిపదికన కేటాయింపు జరిగింది. మాలవీయ, సోలంకి ఇద్దరూ ఒకే సామాజిక తరగతికి చెందినవారే. సోలంకికి ఆర్ఎస్ఎస్ బలం లభించగా గత ఎన్నికల్లో గెలిచినా ఈసారి అధికార వ్యతిరేకత, గ్రామాల్లో ఉపాధి లేమి వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు.

ఖర్గోన్: ఇక్కడ కాంగ్రెస్ నుంచి పోర్లాల్ ఖర్తే, బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపి గజేంద్ర పటేల్ పోటీ చేస్తున్నారు. ఎస్టీ రిజర్వుడ్ సీటు కావడంతో గిరిజనుల ప్రాభల్యమెక్కువ.. ఆర్ఎస్ఎస్ హిందుత్వ భావజాలాన్ని నూరిపోస్తోంది. హిందు, ముస్లింల మధ్య ఘర్షణలు చర్చనీయాంశమవుతున్నాయి. 2022లో రామనవమి తర్వాత జరిగిన అల్లర్లలో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వం బుల్డోజర్లతో ముస్లిం నివాసాలను, షాపులను కూల్చివేసింది. దాంతో ముస్లింలు బీజేపీని వ్యతిరేకిస్తున్నారు. తాజాగా ధార్, ఖర్గోన్ జిల్లాల్లో మోడీ పర్యటించారు.

ఉజ్జయిని: ఎస్సీ రిజర్వుడ్ సీటు ఉజ్జయినిలో కాంగ్రెస్ నుంచి మహేశ్ పర్మార్‌కు పోటీగా బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ ఫిరోజియా తలపడుతున్నారు. ఈ నియోజకవర్గంలో 63 శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ క్షిప్రా నది అభివృద్ధి మరిచిందని, ఆ నదిని శుద్ధిచేసేంత వరకు పోరాడతానని కంకణం కట్టుకున్న మహేశ్‌కు ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది.


మందసౌర్: నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి దిలీప్ సింగ్ గుప్తా, బీజేపీ నుంచి సుధీర్ గుప్తా పోటీపడుతున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలిచింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ డీలా పడింది. ఇవిఎంల పనితీరుపై అనుమానం వ్యక్తం చేసింది. అయితే ఈసారి ఎన్నికల్లో రాహుల్ గాంధీ చేసిన పాదయాత్రకు విశేష స్పందన కనిపించడంతో హస్తం శ్రేణులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. మోడీ ప్రభుత్వం తెచ్చిన అగ్నిపథ్ పథకంపై యువత వ్యతిరేకత వ్యక్తం చేస్తోంది. అగ్నిపథ్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ వైపు యువత ఆశక్తి చూపుతున్నారు.

రత్లామ్: నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి కంతిలాల్ భురియా, సిట్టింగ్ ఎంపి గుమన్ సింగ్‌ను మార్చి అనిత నగర్ సింగ్ చౌహాన్‌కు బీజేపీ టికెట్ ఇచ్చింది. రత్లామ్ కాంగ్రెస్ కంచుకోట. ఆ పార్టీకి చెందిన దిలీప్ సింగ్ భురియా, కాంతిలాల్ భురియాలే ఈ స్థానంలో గెలుస్తూ వచ్చారు. కానీ 2014లో దిలీప్ సింగ్ భురియా బీజేపీలో చేరి పోటీ చేసి గెలిచారు. అందుకే అక్కడ బీజేపీ గెలిచింది.

ఖాండ్వాలో కాంగ్రెస్‌కు పట్టు ఉండేది. హస్తం రెబల్స్ బీజేపీకి తావిచ్చారు. ఎమర్జెన్సీ తర్వాత జనసంఘ్, కాంగ్రెస్‌లో చీలికలు తెచ్చింది. రామజన్మభూమి వ్యవహారం బీజేపీని బలపరిచింది. ఇక్కడ కాంగ్రెస్ నుంచి నరేంద్ర పటేల్, బీజేపీ నుంచి జ్ఞానేశ్వర్ పాటిల్ పోటీ చేస్తున్నారు.

ఇండోర్: మధ్యప్రదేశ్‌లో అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గం ఇండోర్‌లో చివరి క్షణంలో కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ కాంతి బామ్ తన నామినేషన్ ఉపసంహరించుకుని బీజెపిలో చేరారు. దీంతో బీజేపీ సిట్టింగ్ ఎంపీ శంకర్ లల్వానీకీ గెలుపు ఖాయమైపోయినట్లే. కానీ బరిలో మరో 14 మంది అభ్యర్థులు ఉండటంతో ఎన్నికలు జరగనున్నాయి. దీంతో నోటాకు ప్రజలు ఓటేయాలని కాంగ్రెస్ పిలుపునిచ్చింది.

సొంత పార్టీ ఎమ్మెల్యే అసెంబ్లీ స్థానాన్నే మరిచిపోయిన మధ్యప్రదేశ్ సీఎం



భోపాల్ : ఎన్నికల ప్రచారంలో సొంత పార్టీ అసెంబ్లీ స్థానాన్నే మరిచిపోయి మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ నవ్వులపాలయ్యారు. ఆయన శుక్రవారం ఇండోర్ జిల్లా మోవ్ అసెంబ్లీ పరిధిలోని జనపవ్‌లో జరిగిన ప్రచార సభలో ప్రసంగించారు. 'మంత్రి కైలాష్ విజయ వర్గియాకుపుట్టినరోజు శుభాకాంక్షలు. ఇప్పుడు ఉషాజీ ఇక్కడ ఎమ్మెల్యేగా లేకపోయినా.. ఇంతకుముందు ఉషా జీ ఇక్కడ మ్మెల్యేగా ఉన్నారు.' అని సీఎం అన్నారు. అయితే వెంటనే ఉషాజీ ఇక్కడ ఎమ్మెల్యే అని సభకు హాజరైన జనం కేకలు పెట్టడంతో తన పొరపాటును సరిదిద్దుకునే ప్రయత్నం చేశారు. వెంటనే 'భారత్ మాతా కీ జై' అని నినదించారు. మళ్లీ వెంటనే క్షమించండి దీదీ అని ఉషాజీనుద్దేశించి ఉద్దేశించి 'మిమ్మల్ని ఇండోర్ 3కి మార్చారని అనుకున్నాను' అన్నారు. వేదికపై ఇండోర్ 3 అసెంబ్లీ ఎమ్మెల్యే గోలు శుక్లా కూడా సిఎం మాటలతో షాక్ అయ్యారు. లేచి నిల్చొని ఇండోర్ సెగ్మెంట్ 3 ఎమ్మెల్యే తానేనని చెప్పుకున్నారు. ఈ వీడియోను మధ్యప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో షేర్ చేసింది. 'మోహన్ యాదవ్ జీ, ఇది ఎలాంటి అధికార మత్తు? మీ ఎమ్మెల్యేను కూడా మీరు గుర్తించనప్పుడు.. ప్రజలు ఏ ఆశతో మీకు ఓటు వేస్తారు అని ప్రశ్నించింది. పేపర్ స్లిప్ ద్వారా సిఎం అయితే.. అహంకారంతో అందరినీ మరిచిపోతారని కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది.





త్యాగాల వెనుక ఆనందం ఉంటుంది

అనుపమ ఉపాధ్యాయ... బ్యాడ్మింటన్ జూనియర్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నం.1 స్థానానికి చేరుకుని అందరి దృష్టినీ ఆకర్షించింది. 2023లో జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఓర్లెన్ పోలిష్ ఓపెన్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్‌లో కూడా విజయం సాధించిన ఆమె తన శిక్షణ, సవాళ్లు, కలల గురించి ఏం చెబుతుందా తెలుసుకుందాం...

? మీరు బ్యాడ్మింటన్‌లోకి ప్రవేశించడానికి కారణం?

2014 వేసవి సెలవల్లో మా అమ్మానాన్న నన్ను ఏదైనా క్రీడలో శిక్షణ తీసుకోమన్నారు. అప్పుడు బ్యాడ్మింటన్ ఆడాలని నిర్ణయించుకున్నాను. ఎందుకంటే బయట విపరీతమైన వేడి ఇదైతే ఇండోర్ గేమ్ కాబట్టి దీన్ని ఎంపిక చేసుకున్నాను. ఢిల్లీలోని యమునా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కి వెళ్లాను. అక్కడ గంట సేపు నా శిక్షణ తర్వాత జట్లు ఆడటం చూస్తాను. షాట్‌ల కోసం చూస్తున్న ఆటగాళ్లను చూసి నేను ఆకర్షితురాలి నయ్యాను. నేనూ బ్యాడ్మింటన్ ఆడాలి, వృత్తిపరంగా దీన్నే ఎంచుకోవాలని నిర్ణయించుకున్నాను.

? మీ నిర్ణయానికి మీ తల్లిదండ్రుల స్పందన ఏమిటి?

నేనేం చేయాలనుకున్నా వాళ్లు చాలా సపోర్టివ్‌గా ఉంటారు. నా చదువు ఏమైపోతుందో అని కూడా వాళ్లు నన్ను ఎప్పుడూ ఒత్తిడి చేయలేదు. వారే నా ప్రేరేపకులు, ఎల్లప్పుడూ నా వెనుక నిలుస్తారు. నేను ఘోరంగా ఓడిపోయిన రోజుల్లో నాతో పాటు నిలబడి ముందుకు సాగడానికి నన్ను ప్రేరేపిస్తారు. ఓడిపోయిన తర్వాత బలంగా తిరిగి రావడానికి అదే నా సానుకూల ప్రభావం.

? శిక్షణ సమయంలో ఎదుర్కొన్న కొన్ని సవాళ్లను మాతో పంచుకోండి?

నేను ఎప్పుడూ చెప్పే విషయం ఏమిటంటే, నేను చాలా సన్నగా ఉంటాను. పైగా మేము శాకాహారులం. నా క్రీడా శిక్షణను తట్టుకుని, నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి గుడ్లు, మాంసం ఇవ్వమని చాలా మంది మా నాన్నకు సలహా ఇచ్చారు. మొదట్లో అవి తినకుండానే నేను బాగా రాణించడమే కాకుండా జాతీయ ఛాంపియన్‌గా కూడా మారగలిగాను. అయితే నెమ్మదిగా నాకు అదనపు పోషకాహారం అవసరమని గ్రహించాను. అప్పటి వరకు మాంసం, గుడ్లు అంటే పెద్దగా ఇష్టం లేదు. క్రమంగా వాటిపై ఇష్టం పెంచుకుని చికెన్, మటన్, చేపల వైపు మళ్లాను. కేవలం తినడం మాత్రమే కాదు ప్రతి సెషన్ తర్వాత ఎంత తినాలో ప్లాన్ చేసుకున్నాను. కండలు పెంచడంపై దృష్టి కేంద్రీకరించాను. ఇలా పోషకాహార ప్రణాళిక సరైన స్థితికి చేరుకోవడానికి చాలా కష్టపడ్డాను. అభిరుచికి అనుగుణంగా మారడం ఒక సవాలు మాత్రమే కాదు, ఒక ప్రక్రియ కూడా. అమ్మ నాకోసం నాన్‌వెజ్ వండడం నేర్చుకుంది. ఇప్పుడు ఎంతో ఇష్టంగా తింటున్నాను.

చదువు, శిక్షణ, ఆట ఎలా సమతుల్యం చేసుకున్నారు?

వారానికి ఐదు రోజులు శిక్షణ తీసుకోవడంతో చదువుకునే అవకాశం ఉండేది కాదు. ప్రతిరోజూ రెండు సెషన్‌లో శిక్షణ తీసుకుంటాను. అది కూడా చాలాఎక్కువగా ఉండేది. వారాంతాల్లో లేదా పరీక్షలకు ముందు పుస్తకాలను పట్టుకునేదాన్ని. కొంత కాలం తర్వాత రెగ్యులర్ స్కూల్ వదిలేసి ఓపెన్ స్కూల్ విధానంలో చదవడం మొదలుపెట్టాను. ఇది నాకు అవసరమైన సమయ సౌలభ్యాన్ని అందించింది.



? మొదటి ట్రోఫీ అందుకున్నపుడు ఎలా అనిపించింది?

నా మొదటి విజయం 2016లో అండర్-13 జాతీయ ఛాంపియన్‌షిప్‌లను గెలుచుకోవడం. సింగిల్స్, డబుల్స్ టోర్నీల్లో గెలిచాను. అండర్-13 సింగిల్స్, డబుల్స్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లు రెండింటినీ గెలిచినందున నన్ను లక్ష్య భయ్యా (ఛాంపియన్ లక్ష్య సేన్)తో పోల్చారు. అతను నాకు ఇష్టమైన ఆటగాళ్లలో ఒకడు. దాంతో చాలా గర్వంగా భావించాను. గత ఏడాది కూడా సీనియర్ నేషనల్ ఛాంపియన్ అయ్యాను. సంతోషకరమైన క్షణాలలో అది ఒకటి. సైనా దీదీ (సైనా నెహ్వాల్), సింధు దీదీ (పివి సింధు) తర్వాత గెలిచిన అతి పిన్న వయస్కురాలిని నేనే.

? క్రీడల వల్ల మీ వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేస్తున్నానని ఎప్పుడైనా అనుకున్నారా?

కచ్చితంగా అనిపించేది. మొదట్లో నేను జాతీయ ఛాంపియన్‌షిప్‌లకు సిద్ధమవుతున్నప్పుడు నాతో పాటు చదువుకుంటున్న వారంతా వారి సెలవులను ఆనందంగా గడుపుతుండేవారు. సరదాగా టూర్లకు వెళుతుంటే వారు తమ జీవితాన్ని ఆనందిస్తున్నారని నాకు అనిపించేది. అయితే ఇప్పుడే త్యాగం చేస్తే జీవితాంతం ఎంజాయ్ చేయవచ్చని అప్పట్లో నా తల్లిదండ్రులు చెప్పారు. గెలిచిన తర్వాత వాళ్ళు చెప్పింది నిజమేనని గ్రహించాను. అందుకే నా తల్లిదండ్రులను మార్గదర్శకులుగా తీసుకుని నా లక్ష్యాన్ని చేరుకుంటాను.

? మీ క్రీడా ప్రయాణంలో నేర్చుకున్న పాఠాలు..?

క్రమశిక్షణ కీలకం. మీరు మీ దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు అందరూ మిమ్మల్ని చూస్తుంటారు. కాబట్టి సానుకూల దృక్పథం అవసరం. బయటకు వెళ్లేటప్పుడు కూడా క్రమశిక్షణను పాటించడం చాలా ముఖ్యం. దేశం నుండి బయటకు వెళ్లినప్పుడల్లా ఇష్టమైన ఆహారాన్ని మనతో తీసుకెళ్లాలని సింధు దీదీ నుండి నేను నేర్చుకున్నాను. కాబట్టి నేను ఎప్పుడూ స్నాక్స్‌తో ప్రయాణిస్తాను. అలాగే ఒత్తిడి నుండి బయటపడేందుకు మంచి నిద్ర ఎంత అవసరమో తెలుసుకున్నాను.జీవితంలో ఆటల్లో కూడా కొన్ని గెలుస్తావు, కొన్ని గెలవలేవు, కొన్ని ఓడిపోతావు అని మనందరికీ తెలుసు.

మా పాఠకులకు మీ సందేశం?

నేను చెప్పదలుచుకున్నదేమిటంటే... అమ్మాయిలు ఏది చేయాలనుకుంటే అది చేయనివ్వండి. వారు కోరుకున్న రీతిలో వారి జీవితాలను ఆస్వాదించనివ్వండి. మీరు క్రీడను ఇష్టపడితే దానిని కొనసాగించండి. క్రీడలను ఆస్వాదించడం ప్రారంభించిన తర్వాత అది వేరే జీవితం. త్యాగాలు చేయాల్సి వస్తుంది కానీ విజయం సాధించిన తర్వాత జీవితమంతా

? మీ ఇతర ఆసక్తులు..?

ఖాళీ సమయం దొరికినప్పుడు డ్యాన్స్ చేయడం చాలా ఇష్టం. హాస్టల్లో నా స్నేహితులతో కలిసి పాటలు పాడుతూ డ్యాన్స్ చేస్తుంటాను. అప్పుడప్పుడు మూగ చారేడ్స్ ఆడతాము. కార్డ్‌లు, యూఎన్‌ఓ లేదా సీక్వెన్స్‌ని ప్లే చేస్తాం. లూడో ఆడుతున్నప్పుడు ఒక ఆటగాడు మరొక ఆటగాడిని ఎందుకు అధిగమించాడు అనే దానిపై మా మధ్య భారీ పోరాటాలు ఉంటాయి. అది చాలా సరదాగా ఉంటుంది. ■

పిడుగుపాటుకు ముగ్గురు మృతి

(మొదటిపేజి తరువాయి)

సంచులు కప్పి చెట్ల కిందికి వెళితే పిడుగు పడుతుందనే భయంతో అక్కడే వరికుప్ప వద్ద నెత్తులపై సంచులు కప్పుకొని కూర్చోగా వారిపై పిడుగుపడి మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కాగా పిడుగు పడి, ఏడుగురికి గాయాలయ్యాయి. అందులో మామిడిపెల్లి కిరణ్(44) మృతి చెందాడు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పిడుగు పాటుకు గురైన వారిలో గ్రామస్తులు కోల భోజన్న, టింగేని రమేష్, సంటెన్న, కుందేని రమేష్, భీంరావు, అమ్ములు రమేష్ ఉన్నారు.

తడిసిన ధాన్యం కొనండి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అకాల వర్షాలకు తడిసిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. తడిసిన ధాన్యం గురించి రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని చెప్పారు. ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డితో పాటు పలు జిల్లాల్లో గాలి వాన, పిడుగులు, వడగళ్లు పడి పంట నష్టం జరిగిన విషయం తెలిసిందే. దీనిపై ఆదివారంనాడాయన వివరాలు తెప్పించుకుని పరిశీలన చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ సూచనలు ఉన్నందున జిల్లాల్లో కలెక్టర్లు, ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎక్కడ ఎలాంటి ఆపద వచ్చినా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తగిన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలంలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందిన ఘటనపై సీఎం విచారం వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకుంటామన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామంలో పిడుగుపాటుతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని, వారికి తగిన వైద్య సాయం అందేలా చూడాలని అక్కడి అధికారులను ఆదేశించారు.

నేడే పోలింగ్

(మొదటిపేజి తరువాయి)

106 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 35,809 పోలింగ్ కేంద్రాల్లో 3,32,32,318 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. పోలింగ్ ముగిసే సమయానికి వరుసలో నిలబడే వారికి ఎంత సమయమైనా ఓటు వినియోగించుకునే అవకాశం కల్పిస్తారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో సీల్ చేసి జీపీఎస్ వాహనంలో కేటాయించిన స్ట్రాంగ్ రూంలకు తరలిస్తారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వాటికి మూడంచెల భద్రత కల్పిస్తారు. ఇన్నర్ సర్కిల్‌లో కేంద్ర దళాలు, సెకండ్ సర్కిల్‌లో స్టేట్ రిజర్వ్ దళాలు, చివరి సర్కిల్‌లో స్థానిక పోలీసులు పహారా కాస్తారు. రాష్ట్రంలో ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

అదృష్టాన్ని పరీక్షించుకోనున్న 525 మంది అభ్యర్థులు

రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో 525 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధానంగా ముఖాముఖి పోటీ నెలకొని ఉంది. బీజేపీ బలంగా ఉన్న కరీంనగర్, సికింద్రాబాద్, నిజామాబాద్ లాంటి కొన్ని నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ ఉందని భావిస్తున్నారు. పార్టీ మారి ఇతర పార్టీ అభ్యర్థులుగా బరిలో నిలిచిన దానం నాగేందర్, కడియం కావ్య, బీబీ పాటిల్, రంజిత్ రెడ్డికి ఈ ఎన్నికలు అగ్నిపరీక్షగా మారనున్నాయి. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయి, లోక్‌సభకు పోటీ చేస్తున్న ఈటెల రాజేందర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బాజిరెడ్డి గోవర్ధన్‌లకు సైతం ఈ ఎన్నికలు చావోరేవో తేల్చనున్నాయి. కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు 15 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. డబ్బు, అధికారం, కులం, తదితర అంశాల ప్రాతిపదికన హోరాహోరీగా సాగిన ఎన్నికల సంగ్రామంలో ఓటర్లు ఎవరిని కనికరించారన్నది జూన్ 4న తేలనుంది.

ఈవీఎంలు మొరాయిస్తే రీప్లేస్

పోలింగ్ స్టేషన్లలో ఈవీఎంలు మొరాయిస్తే ఈసీ నిబంధనల ప్రకారం సెక్టర్ ఆఫీసర్లు మార్చనున్నారు. ఇందుకోసం 25 శాతం ఈవీఎంలను అదనంగా అన్ని నియోజక వర్గాల వారీగా అందుబాటులో ఉంచారు. చిన్న చిన్న సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే బాగు చేసేందుకు వాటిని సరఫరా చేసిన ఈసీఐఎల్ కంపెనీ ఇంజినీర్లు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఇద్దరేసి చొప్పున అందుబాటులో ఉంటారు. పోలింగ్ స్టేషన్లో దౌర్జన్యం, ఓట్ల గందర గోళం, రిగ్గింగ్, ప్రలోభాలు లాంటి సంఘటనలు జరిగితే స్థానికి పీవో ఇచ్చే నివేదిక ఆధారంగా ఎన్నికల సంఘం రీపోలింగ్‌కు ఆదేశిస్తుంది.



ఓటర్లకు ఈసీ సూచనలు

1). ఓటు వేయడానికి వెళ్లేటప్పుడు ఎవరూ తమ మొబైల్‌ని తీసుకెళ్లకూడదు.

2). ఓటు వేసేటప్పుడు స్లిప్ కనిపించే వరకు (7 సెకన్లు) బటన్‌ను నొక్కి ఉంచండి.

3) ఈవీఎం మెషీన్‌లోని బటన్‌ను నొక్కినప్పుడు స్లిప్ బయటకు వచ్చే వరకు బటన్ నుండి వేలిని తీసివేయకూడదని గుర్తుంచుకోండి.

4) స్లిప్‌తో మీ ఓటు వేశామని నిర్ధారించుకున్న తర్వాత బయటకు రండి

5). మీ ఓటు ఇదివరకే ఎవరైనా వేస్తే వెంటనే పీవోకు ఫిర్యాదు చేసి టెండర్ ఓటు వేయవచ్చు

6). పోలింగ్ స్టేషన్లో అవకతవకలు జరిగితే వెంటనే సీ విజిల్, 1950 టోల్‌ఫ్రీ నెంబర్ ఎన్‌జీఎస్‌పీ పోర్టల్ ద్వారా వెంటనే ఫిర్యాదు చేయండి.

సీపీఐ(ఎం)వినతికి స్పందించిన ఈసీ

(మొదటిపేజి తరువాయి)

హైదరాబాద్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌కు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ.నర్సింహారావు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర కార్యదర్శి రాసిన లేఖను అందించారు. కార్మికుల ఓట్లు పనిప్రదేశ ప్రాంతంలో కాకుండా సొంతూర్లలో ఉంటాయనీ, వారు ఓటేసి నైట్‌డ్యూటీ షిఫ్టుకు ఎలా రాగలుగుతారని ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. రెండు షిఫ్టులకే సెలవు వర్తింపు అని కార్మిక శాఖ జారీ చేసిన మెమోను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పూర్తివేతనంతో కూడిన సెలవును ఇవ్వాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ 116 ప్రకారం గెజిట్ నెంబర్ 107లో కూడా కార్మికులకు వేతనంతో కూడిన సెలవును ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. నేషనల్ ఆఫ్ సాఫ్ట్‌వేర్, సర్వీస్ కంపెనీస్(నాస్కామ్), యాజమాన్య సంఘాలు రెండు షిఫ్టులకే సెలవును పరిమితం చేయాలని కోరగా కార్మికశాఖ అందుకు సానుకూలంగా స్పందించడం దారుణమన్నారు. ఈసీ ఆదేశాన్ని సైతం పరిగణనలోకి తీసుకోకుండా నైట్ షిఫ్టుకు హాజరయ్యే వారికి సెలవును రద్దు చేస్తూ మెమోను విడుదల చేయడం సరిగాదని తెలిపారు. దీనివల్ల ఓటింగ్ శాతం తగ్గే ప్రమాదం కూడా ఉంటుందని హెచ్చరించారు. ఈసీ తక్షణమే జోక్యం చేసుకుని జీవో నెంబర్ 222 ప్రకారం గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కార్మికులకు వేతనంతో కూడిన పూర్తి సెలవు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న ఈసీ ప్రతి ఒక్కరికీ వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.

యూపీలో ఇండియాకే అత్యధిక స్థానాలు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఈ ఎన్నికల్లో 'ఇండియా' ఎక్కువ స్థానాలను గెలుచుకుంటుందని సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం బారాబంకిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బారాబంకి ఎస్పీకి కంచుకోట వంటిది. ఈ ఎన్నికల్లో యూపీలో దళితులు, మైనార్టీలు, ఓబీసీలు ఎన్డీయేను ఓడించబోతున్నారు. ఆయా తరగతులను బీజేపీ మోసగించింది. కమలం ప్రభుత్వ హయాంలో వారికి దక్కాల్సిన హక్కులు, గౌరవం దక్కలేదు. అణగారిన వర్గాలు కాషాయ పార్టీకి తగిన బుద్ధి చెప్పబోతున్నాయి. బీజేపీ తాను తీసుకున్న గోతిలో తానే పడింది. ఈ ఎన్నికల్లో ఇండియా బ్లాక్ యూపీలోని 80 స్థానాల్లో 79 గెలుచుకోనుంది. ఎన్నికల ఫలితాల అనంతరం తమ ఎంపీలు ప్రధానమంత్రి ఎవరనే దానిపై నిర్ణయం తీసుకుంటారు' అని అన్నారు.

మోడీ, రాహుల్‌కు బహిరంగ చర్చకు ఆహ్వానం

- పీఎంను ఒప్పుకోమన్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : జర్నలిస్ట్ ఎన్ రామ్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మదన్ బి లోకుర్, హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఏపీ షాలు ప్రధాని నరేంద్ర మోడీ, రాహుల్ గాంధీలను బహిరంగ చర్చకు ఆహ్వానించారు. ఇందుకు స్పందించిన రాహుల్ గాంధీ తాను, పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే డిబేట్‌కు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, అలా రావడం వల్ల వారి ఆలోచనా విధానం ఏ విధంగా ఉందో ప్రజలకూ అర్థమవుతుందని ఆహ్వానితులకు రాసిన లేఖలో ప్రస్తావించారు. తనపై, పార్టీకి సంబంధించిన వారిపై ఏవైనా నిరాధారమైన ఆరోపణలు వచ్చి ఉంటే, వాటిని తొలగించుకునేందుకూ అవకాశం ఉంటుందనే అభిప్రాయాన్ని రాహుల్ ఆ లేఖలో వ్యక్తం చేశారు. వీరిద్దరూ బహిరంగ చర్చకు సిద్ధపడితే రాజకీయాల్లో పెను మార్పు చోటుచేసుకుంటుంది.

ఓటుహక్కు వినియోగించుకోనున్న ప్రముఖులు

- కొడంగల్‌లో సీఎం రేవంత్, చింతమడకలో కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని ప్రముఖులు నేడు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్‌లోని పోలింగ్ బూత్ నెంబర్ 237లో, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్దిపేట జిల్లా చింతమడకలో, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి బర్కత్‌పురలోని దీక్షా హైస్కూల్‌లో ఓటేయనున్నారు.

రాంనగర్‌లోని జేవీ హైస్కూల్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మలక్‌పేట జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ ఎస్ఆర్‌నగర్‌లోని పోలింగ్ బూత్ నెంబర్ 188లో ఓటేస్తారు. మంత్రి దామోదర రాజనర్సింహ సంగారెడ్డి జోగిపేటలో, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దంపతులు నందినగర్ కమ్యూనిటీ హాల్‌లో, మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట భరత్‌నగర్‌లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

జూబ్లీహిల్స్ ఓబుల్‌రెడ్డి స్కూల్‌లో జూనియర్ ఎన్టీఆర్, ప్రణతి, బీఎస్ఎన్ఎల్ సెంటర్‌లో అల్లు అర్జున్, స్నేహారెడ్డి, అల్లు అరవింద్, అల్లు శిరీష్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో మహేశ్‌బాబు, నమ్రత, మంచు మోహన్‌బాబు, విష్ణు, లక్ష్మి మనోజ్, విజయ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, శ్రీకాంత్, జీవిత రాజశేఖర్ ఓటేయనున్నారు. జూబ్లీహిల్స్ క్లబ్‌లో చిరంజీవి, సురేఖ, రాంచరణ్, ఉపాసన, నితిన్. ఎమ్మెల్యే కాలనీలో రవితేజ, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో నాగార్జున, అమల, నాగచైతన్య, అఖిల్, మణికొండ హైస్కూల్‌లో వెంకటేశ్, బ్రహ్మానందం, షేక్‌పేట్ ఇంటర్నేషనల్ స్కూల్ లో దర్శకులు రాజమౌళి ఓటేస్తారు. యూసఫ్‌గూడ చెక్‌పోస్టు ప్రభుత్వ పాఠశాలలో అల్లరి నరేష్, సలీంనగర్ పోలింగ్ బూత్‌లో తనికెళ్ల భరణి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

పోలింగ్‌పై డేగకన్ను

- సమస్యాత్మక ప్రాంతాలపై సాయుధబలగాల డేగకన్ను
- 30 వేల మందికిపైగా బైండోవర్
- స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల బందోబస్తు

నవతెలంగాణ - ప్రత్యేక ప్రతినిధి

లోక్‌సభ ఎన్నిలను పురస్కరించుకుని లక్ష మందికిపైగా పోలీసులు అప్రమత్తం అయ్యారు. సోమవారం రాష్ట్రంలో జరిగే 17 లోక్‌సభ, కంటోన్మెంట్ శాసనసభ నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతుండ టంతో ఆదివారం సాయంత్రం నుంచే ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులను మోహరించారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూడటానికి కేంద్ర సాయుధబలగాలు, ఏపీఎస్పీ బెటాలియన్లు, సివిల్ పోలీసులు, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ సాయుధబలగాలు, హోంగార్డులు, ఇతర రాష్ట్రాల పోలీసులు కలిపి మొత్తం లక్ష మందికిపైగా పోలీసులు ఎన్నికల బందోబస్తులో పాలుపంచుకోనున్నారు. ముఖ్యంగా అత్యంత సున్నిత మైన ప్రాంతాలు, మతఘర్షణలు, రాజకీయ వైషమ్యాలు చెలరేగే పోలింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాలతో కూడిన మెరుపు దళాలు కాపుకాస్తున్నాయి. అలాగే, మొబైల్ స్పెషల్ దళాలు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో ప్రతి పది నిమిషాలకు ఒకసారి తిరుగుతూ బందోబస్తును పర్యవేక్షిస్తున్నాయి. మరోపక్క ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రంలో ప్రవేశించే 89 అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద కూడా సాయుధబలగాలతో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ప్రధాన మూడు కమిషనరేట్ల పరిధిలో 30 వేల మందికిపైగా రౌడీలు, గుండాలు, పాత నేరస్తులను బైండోవర్ చేశారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగడానికి గానూ రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ప్రతిక్షణం క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని తెప్పించుకుంటున్నారు. తగిన చర్యలను తీసుకుంటున్నారు. రాష్ట్ర డీజీపీ రవిగుప్తా స్వీయపర్యవేక్షణలో శాంతిభద్రతల విభాగం అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్ నేతృత్వంలో ఈ కంట్రోల్ రూమ్ నడిపిస్తున్నారు. పోలింగ్ ప్రక్రియ నుంచి ఓట్ల లెక్కింపు దశ వరకు ఈ కంట్రోల్ రూమ్ పనిచేస్తున్నదని డీజీపీ రవిగుప్తా తెలిపారు. ఇదిలా ఉంటే పోలింగ్ పూర్తికాగానే కట్టుదిట్టమైన భద్రతతో ఈవీఎలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేలా ప్రత్యేక సెక్యూరిటీ దళాలను కూడా ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ బెటాలియన్, సివిల్ పోలీసులతో మూడంచెలుగా భద్రతను ఏర్పాటు చేశారు. ఇక, రాష్ట్రంలో మావోయిస్టుల ప్రభావం ఉన్న ఉత్తర తెలంగాణలోని ఐదు పార్లమెంట్ నియోజకవర్గాలలో మావోయిస్టుల నుంచి ఎలాంటి ప్రమాదం రాకుండా గ్రేహౌండ్స్ బలగాలతో కూబింగ్ ఆపరేషన్లను ఉధృతం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్లను ప్రలోభపెట్టే ప్రక్రియకు, డబ్బుల పంపిణీని అడ్డుకునేందుకు అనుమానిత ప్రాంతాలపై పోలీసుల దాడులు కొనసాగుతున్నాయి. పలుచోట్ల డబ్బులు, మద్యంతో ఇతర గిఫ్టులను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు

ప్రభాకర్‌రావుపై రెడ్‌కార్నర్ నోటీసు జారీ

- రాష్ట్ర సీఐడీ నుంచి సీబీఐకి వెళ్లిన ప్రక్రియ

నవతెలంగాణ - ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు కోసం రాష్ట్ర పోలీసులు రెడ్ కార్నర్ నోటీసు జారీ చేశారు. రెండు రోజుల క్రితమే ప్రభాకర్‌రావు అరెస్టును ఆదేశిస్తూ నాంపల్లి కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా, ఆయన దేశంలో లేకపోవడంతో ఆచూకీ కోసం ఇంటర్‌పోల్ విభాగానికి రాష్ట్రంలో నోడల్ విభాగమైన సీఐడీ నుంచి రెడ్‌కార్నర్ నోటీసు జారీ అయింది. ఈ నోటీసు ఆధారంగా ఇంటర్‌పోల్‌ను సంప్రదించి ప్రభాకర్‌రావును అరెస్టు చేయాలని పోలీసులను కోరుతూ సీఐడీ విభాగం నుంచి సీబీఐకి రెడ్‌కార్నర్ నోటీసు రిక్వెస్టుకు వెళ్లింది. దీని ఆధారంగా సీబీఐ అధికారులు ఇంటర్‌పోల్‌కు ప్రభాకర్‌రావు సమాచారాన్ని పంపించి ఆయన ఆచూకీ కనిపెట్టి అదుపులోకి తీసుకుని తమకు అప్పగించాలని సీబీఐ కోరుతోంది. దీనికి సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే మొదలైందని సీఐడీ విభాగానికి చెందిన ఒక ఉన్నతాధికారి తెలిపారు. ఇదే కేసులో ఆరో నిందితుడైన ఐ న్యూస్ సీఈఓ శ్రవణ్‌కుమార్‌కు కూడా రెడ్‌కార్నర్ నోటీసు జారీ అయినట్టు తెలిపారు. దీంతో ఫోన్‌ట్యాపింగ్ కేసు దర్యాప్తు ముమ్మరమైందని స్పెషల్ టీం అధికారులు తెలిపారు.



ఈ ఎన్నికలతోనే దేశ భవిష్యత్తు

ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలి : మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి

నవతెలంగాణ-మిర్యాలగూడ

ఈ పార్లమెంట్ ఎన్నికలతోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, లౌకికవాదాన్ని బలపరిచేందుకు ఓటర్లు ఆలోచించి ఓటు వేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలపై దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఆధారపడి ఉందని అన్నారు. యువత భవిష్యత్తు ఈ ఎన్నికలతో ముడిపడి ఉందని, దేశ సమగ్రతను కాపాడేందుకు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. పదేండ్ల కాలంలో మోడీ ప్రభుత్వం దేశాన్ని విచ్ఛిన్నం చేసిందని, మతం పేరిట విద్వేషాలు సృష్టించి రాజకీయంగా లబ్ది పొందాలని చూసిందని విమర్శించారు. అలాగే దేశ సంపదను మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టిందని తెలిపారు. రిజర్వేషన్లు రద్దుచేసి బడుగు, బలహీన వర్గాలకు తీరని అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా దేశ ప్రజలపై మమకారం ఉన్నట్టు మోడీ నాటకాలు ఆడుతున్నారని అన్నారు. పదేండ్ల కాలంలో మోడీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమి లేదని, ప్రజలకు చెప్పుకునేందుకు ఏమీ లేకనే ప్రజల మధ్య చిచ్చు పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మోడీ ప్రభుత్వం ఇప్పటికీ అనేక కుట్రలు చేస్తోందని తెలిపారు. దేశంలో రానున్నది లౌకిక ప్రభుత్వమని జోస్యం చెప్పారు. ఇప్పటి వరకు జరిగిన మూడు విడతల పోలింగ్‌లలో ఎన్డీఏ కూటమికి ప్రతికూల వాతావరణం నెలకొందని, నేడు జరిగే నాలుగో విడత పోలింగ్‌లో కూడా మోడీకి వ్యతిరేకంగా ఓటు వేసేందుకు ప్రజల సిద్ధమయ్యారని అన్నారు. ఎన్డీఏ కూటమికి 200 సీట్లు దాటవని, ఇండియా బ్లాక్‌కే స్పష్టమైన మెజార్టీ రాబోతుందని అన్నారు. బీజేపీ ప్రభుత్వ మోసపూరిత మాటలను ప్రజలందరూ గ్రహించారని తెలిపారు. ప్రజలు అన్ని విషయాల ను పరిగణనలోకి తీసుకొని ఆలోచించి లౌకికవాదాన్ని బలపరిచేందుకు ఇండియా కూటమిలోని కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో

నగదు పట్టివేత

ఓటర్లకు పంచేందుకు తరలిస్తున్న నగదు

ఖమ్మంలో నగదు తరలిస్తున్న కారును అడ్డుకోవడంతో ప్రమాదం





నవతెలంగాణ-రామాయంపేట/కూసుమంచి

నేడు జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ ఎత్తున నగదు పట్టుబడింది. ఎన్నికల వేళ ఓటర్లకు పంచేందుకే ఈ డబ్బు తరలిస్తున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మెదక్ జిల్లా మాసాయిపేట వద్ద పోలీసులు చేపట్టిన తనిఖీల్లో షిఫ్ట్ డిజైర్ వాహనంలో 27 ప్యాకింగ్ చేసిన కవర్లు కనిపించాయి. వాటిని ఓపెన్ చేసి చూడగా రూ.88.43 లక్షల నగదు లభించినట్టు రామాయంపేట సీఐ వెంకటేష్ తెలిపారు. డబ్బులకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. రెండు వాహనాలను సీజ్ చేసి విచారణ జరుపుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐతో పాటు చేగుంట ఎస్ఐ బాలరాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. హైదరాబాద్ నుండి ఖమ్మంకు డబ్బులు తరలిస్తున్న కారును.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కేశ్వాపురం గ్రామ శివారు దేవస్‌తండా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వారి నుంచి కారును తప్పించే క్రమంలో బోల్తా కొట్టింది. కారులో రూ.99.94 లక్షలు లభ్యమయినట్టు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. నగదు, కారు సీజ్ చేసినట్టు డ్రైవర్ సైదయ్య, పాల్వంచ రాజేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





ఈదురుగాలుల వర్షం..

ఇబ్బంది పడ్డ ఎన్నికల సిబ్బంది

ఆసిఫాబాద్‌లో తెగిన గుండివాగు తాత్కాలిక వంతెన

నవతెలంగాణ-కామారెడ్డి / ఆసిఫాబాద్





అకాల వర్షానికి, ఈదురుగాలులకు ఎన్నికల కోసం సిద్ధమవుతున్న సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల మైదానంలో అధికారులు ఈవీఎంలు, వీవీ ప్యాడ్స్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఆదివారం అనుకోకుండా ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన టెంట్ పడిపోయి టెంట్ నుంచి నీళ్లు రావడంతో నిలబడటానికి సైతం సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ఫ్లెక్సీలు కప్పుకొని వర్షం పడకుండా జాగ్రత్త పడగా, కొందరు తమ సామగ్రిని పట్టుకొని కళాశాల వరండాలోకి పరుగులు తీశారు. భారీ వర్షం కురవడంతో ఎన్నికల సామగ్రిని డిస్ట్రిబ్యూట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నా ఈవీఎంలు, వీవీ ప్యాడ్స్ కలవకుండా సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పీటీజీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఉన్న రిజర్వు సిబ్బందికి వేసిన టెంట్లు కూలిపోవడంతో పక్కనే ఉన్న వరండాలోకి వెళ్లారు. గుండి గ్రామానికి వెళ్లే తాత్కాలిక వంతెన తెగిపోవడంతో పోలింగ్ సిబ్బంది కమన, కన్నరగాం గ్రామాల మీదుగా గ్రామానికి చేరుకున్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా వర్షానికి నీరు నిలిచిపోవడంతో సిబ్బంది ఇబ్బంది పడ్డారు. బాలుర పాఠశాలలో ఆదర్శ పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు వర్షం అడ్డంకిగా మారింది.



పోలింగ్ విధులకు డుమ్మా

నల్లగొండ ఎంపీ నియోజకవర్గ పరిధిలో గైర్హాజరు

48 మందిపై కేసు నమోదు

నవతెలంగాణ-దేవరకొండ

నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పోలింగ్ విధులకు హాజరుకావాల్సిన 48 మంది సిబ్బంది గైర్హాజరయ్యారు. పోలింగ్, అథర్, అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులు 48 మంది రిపోర్టు చేయాల్సి ఉండగా.. ఇంతవరకు విధులకు హాజరుకాలేదు. దాంతో వీరి మీద దేవరకొండ అసెంబ్లీ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి బి.శ్రీనివాసులు దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గైర్హాజరైన సిబ్బందిపై ప్రజా ప్రాతినిధ్య చట్టం1951 కింద, ఐపీసీ సెక్షన్ 134ఆర్పీ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన.. దేవరకొండ ఆర్‌డీఓ శ్రీరాములును, స్పెషల్ కలెక్టర్‌ను, పార్లమెంట్ డిప్యూటీ ఆర్ఓ ఎస్.నటరాజన్‌ను ఆదివారం ఆదేశించినట్టు తెలుస్తోంది. దాంతో దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు ఫిర్యాదు మేరకు దేవరకొండ సీఐ 48 మందిపై కేసు నమోదు చేశారు. కాగా, ఈ నెల మొదటి వారంలోనే ఎన్నికల విధులకు హాజరుకావాల్సిన అధికారులకు శిక్షణా తరగతులు కూడా ఏర్పాటుచేశారు. శిక్షణ పూర్తిచేసుకున్న వీరు విధులకు హాజరుకాకపోవడంతో కలెక్టర్, సంబంధిత అధికారులు వారిపై చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం.

పోలీసుల దాడులకు భయపడం

టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మెన్ మధు యాష్కీగౌడ్

అధిక మొత్తంలో నగదు ఉందనే నెపంతో ఆయన ఇంటిపై దాడి

నవతెలంగాణ-హయత్‌నగర్

పోలీసుల దాడులకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు భయపడబోరని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మెన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ తెలిపారు. హైదరాబాద్ హయత్ నగర్‌లోని ఆయన ఇంట్లో నగదు పంపిణీ కోసం అధిక మొత్తంలో డబ్బులు ఉంచారన్న ఫిర్యాదుతో ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆదివారం ఆయన ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో డబ్బులు దొరకకపోవడంతో అధికారులు తిరిగి వెళ్లిపోయారు. అనంతరం మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లోనూ తన ఇంటిపై దాడి చేశారని, కార్యకర్తలను భయభ్రాంతులను గురి చేయాలన్న ఉద్దేశంతోనే పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్కాజిగిరిలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్న భయంతో బీజేపీ నాయకులు తన ఇంట్లో కోట్ల రూపాయలు ఉన్నాయంటూ తప్పుడు ఫిర్యాదు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్నామన్న ధీమాతో పోలీసులతో దాడి చేయిస్తున్నారని, వారికి ఓటమి భయం పట్టుకుందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ ముందంజలో ఉందని, 30 వేల మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ ఇన్‌చార్జిగా పని చేస్తున్నందుకే తన ఇంటిపై దాడి చేశారని తెలిపారు.

నవచిత్రం

బర్త్‌డే గిఫ్ట్‌గా టీజర్ రిలీజ్



రామ్

రామ్, పూరి జగన్నాథ్ కాంబోలో రాబోతున్న పాన్ ఇండియా చిత్రం 'డబుల్ ఇస్మార్ట్' నుండి మేకర్స్ ఓ అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్ర టీజర్‌ను ఈనెల 15న రామ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్నారు.

టీజర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రామ్ ఫేస్ మాస్క్‌తో పవర్-ప్యాక్డ్ అవతార్‌లో కనిపించారు. 'ఇస్మార్ట్ శంకర్' సెకండ్ ఇన్‌స్టాల్‌మెంట్‌గా వస్తున్న ఈ హై-బడ్జెట్ ఎంటర్‌టైనర్ షూటింగ్ ప్రస్తుతం ముంబయిలో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో ప్రముఖ తారాగణం అంతా పాల్గొంటున్నారు. ఈ సీక్వెల్‌లో డబుల్ యాక్షన్, డబుల్ మాస్, డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ అని, సంజయ్ దత్ పవర్ ఫుల్ పాత్రలో కనిపించనున్న ఈ సినిమా కోసం రామ్ పోతినేని స్టైలిష్ మేకోవర్ అయ్యారని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రాన్ని పూరీ కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో ఈ సినిమా విడుదల కానుంది.


రక్షణ కోసం రంగంలోకి..



పాయల్ రాజ్‌పుత్

'ఆర్‌ఎక్స్100', 'మంగళవారం' వంటి సినిమాలతో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తోన్న సినిమా 'రక్షణ'. రోషన్, మానస్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో పాయల్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో మెప్పించబోతున్నారు. ఈ మూవీ శరవేగంగా రూపొందుతోంది. హరిప్రియ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రణదీప్ ఠాకోర్ దర్శకత్వం వహిస్తూ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇప్పటి వరకు పాయల్ రాజ్‌పుత్ చేసిన సినిమాలకు ఇది పూర్తి భిన్నమైన సినిమా. సీట్ ఎడ్జ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఆసాంతం కట్టిపడేయనున్న ఈ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ గురించి దర్శక, నిర్మాత ప్రణదీప్ ఠాకోర్ మాట్లాడుతూ, "రక్షణ ఓ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ మిస్టరీ డ్రామా. పాయల్ రాజ్‌పుత్‌ను సరికొత్త కోణంలో చూపించే సినిమా. నటిగా ఆమెకు మంచి ఇమేజ్‌ను తీసుకొస్తుంది. ఒక పోలీస్ ఆఫీసర్ జీవితంలో జరిగిన సంఘటన స్ఫూర్తితో రాసిన కథతో సినిమా రూపొందింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు. రాజీవ్ కనకాల, వినోద్ బాల, శివన్నారాయణ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు.





ఆర్జే శ్వేత, యష్ రంగినేని

ఆర్జే శ్వేత దర్శకత్వంలో అమ్మ

నిర్మాత యష్ రంగినేని సారథ్యంలో 'పెళ్లి చూపులు, డియర్ కామ్రేడ్, దొరసాని, అన్నపూర్ణ ఫొటో స్టూడియో' వంటి సక్సెస్ ఫుల్ సినిమాలను నిర్మించిన బిగ్ బెన్ సినిమాస్ సంస్థ తమ ప్రొడక్షన్ నెం.7గా 'అమ్మ' మూవీని నిర్మిస్తోంది.

ఆదివారం మదర్స్ డే సందర్భంగా ఈ సినిమాను అనౌన్స్ చేశారు. ఈ చిత్రంతో ఆర్జే శ్వేత పీవీఎస్ దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఎమోషనల్ థ్రిల్లర్ కథతో ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ మూవీ అనౌన్స్‌మెంట్ సందర్భంగా టైటిల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ టైటిల్ పోస్టర్ ఇంట్రెస్టింగ్‌గా ఉంది. అమ్మ ఫొటో బ్యాక్ డ్రాప్‌లో అగ్ని జ్వాలల మధ్య పంజరం, పక్షి ఫొటోతో ఈ పోస్టర్ డిజైన్ చేశారు. మదర్ సెంటిమెంట్‌తో సరికొత్త ఎమోషనల్ థ్రిల్లర్ మూవీగా అమ్మ సినిమా ఉండనుంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

నవ్విస్తూనే భయపెడతా




నందితా శ్వేత

హార్రర్, కామెడీతో ఉండే సినిమాలకు అన్ని వర్గాల ఆడియన్స్ నుంచి ఆదరణ లభిస్తోంది. అలాగే హార్రర్ కామెడీ జోనర్లలో వచ్చే చిత్రాలకు ఇటు ఓటీటీ, అటు థియేటర్లలో మంచి డిమాండ్ ఏర్పడింది. ఇప్పుడు అదే ఫార్ములాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది 'ఓ మంచి ఘోస్ట్' మూవీ. మార్క్‌సెట్ నెట్‌వర్క్స్ బ్యానర్‌పై హాస్యభరితమైన హార్రర్ సినిమాగా ఇది రానుంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదల చేసిన గ్లింప్స్, లిరికల్ సాంగ్ ఇలా ప్రతీ ఒక్కటీ ప్రేక్షకుల్లో బజ్‌ను క్రియేట్ చేశాయి. ఇక తాజాగా రిలీజ్ చేసిన టీజర్ అందరినీ నవ్వించడమే కాకుండా భయపెట్టేస్తోంది. ఈ టీజర్‌లోని విజువల్స్, ఆర్‌ఆర్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. ఆండ్రూ సినిమాటోగ్రఫీ, అనూప్ రూబెన్స్ ఇచ్చిన ఆర్‌ఆర్ టీజర్‌లో ఎక్కువగా హైలెట్ అవుతున్నాయి. ఈ చిత్రానికి సుప్రియ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేశారు. ఎడిటింగ్ బాధ్యతల్ని ఎం.ఆర్.వర్మ చేపట్టారు. ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, నందితా శ్వేత, షకలక శంకర్, నవమి గాయక్, నవీన్ నేని, రజత్ రాఘవ్, హాస్యనటుడు రఘుబాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఆటలు

ఐపీఎల్‌లో నేడు
గుజరాత్ X కోల్‌కత
వేదిక : అహ్మదాబాద్, రా‌. 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..



చెన్నై సూపర్‌కింగ్స్ నిలిచింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్ ప్లే ఆఫ్స్ రేసులో ఆశలు సజీవంగా నిలుపుకుంది. చెపాక్‌లో ఆదివారం జరిగిన కీలక మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై చెన్నై సూపర్‌కింగ్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. సీమర్ సిమ్రన్‌జీత్ సింగ్ (3/26) విజృంభించటంతో తొలుత రాజస్థాన్ రాయల్స్ 141/5 పరుగులు చేసింది. ఛేదనలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (42 నాటౌట్) రాణించటంతో మరో పది బంతులు ఉండగానే సూపర్‌కింగ్స్ లాంఛనం ముగించింది.

చెన్నై నిలిచింది!

- రాజస్థాన్‌పై సూపర్‌కింగ్స్ గెలుపు
- 3 వికెట్లతో విజృంభించిన సిమ్రన్‌జీత్ సింగ్
- ఛేదనలో రాణించిన రుతురాజ్ గైక్వాడ్


రాజస్థాన్ 141/5, చెన్నై 145/5

నవతెలంగాణ-చెన్నై

చెన్నై సూపర్‌కింగ్స్ ఊపిరి పీల్చుకుంది. ఐపీఎల్ 17 ప్లే ఆఫ్స్ దశ పోటీ తారాస్థాయికి చేరుకున్న తరుణంలో అగ్రజట్టు రాజస్థాన్ రాయల్స్‌పై చెన్నై సూపర్‌కింగ్స్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 142 పరుగుల ఛేదనలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (42 నాటౌట్, 41 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు) అజేయ ఇన్నింగ్స్‌తో రాణించగా.. శివం దూబె (18, 11 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), రచిన్ రవీంద్ర (27, 18 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు) , డార్లీ మిచెల్ (22, 13 బంతుల్లో 4 ఫోర్లు) సమిష్టిగా రాణించారు. దీంతో 18.2 ఓవర్లలోనే చెన్నై సూపర్‌కింగ్స్ 5 వికెట్లకు 145 పరుగులు చేసింది. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 141 పరుగులు చేసింది. పరుగుల సాధన గగనమైన పిచ్‌పై రియాన్ పరాగ్ (47 నాటౌట్, 35 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు) రాయల్స్‌ను ఆదుకున్నాడు. ధ్రువ్ జురెల్ (28, 18 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు), యశస్వి జైస్వాల్ (24, 21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. సూపర్‌కింగ్స్ యువ పేసర్ సిమ్రన్‌జీత్ సింగ్ (3/26) మూడు వికెట్ల ప్రదర్శనతో రాయల్స్‌ను కోలుకోలేని దెబ్బకొట్టాడు. చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఇది సీజన్లో 13 మ్యాచుల్లో ఏడో విజయం కాగా.. రాజస్థాన్ రాయల్స్‌కు 12 మ్యాచుల్లో నాల్గో పరాజయం కావటం గమనార్హం. చెన్నై సూపర్‌కింగ్స్ పేసర్ సిమ్రన్‌జీత్ సింగ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

రుతురాజ్ కెప్టెన్సీ ఇన్నింగ్స్ : సూపర్‌కింగ్స్ లక్ష్యం 142 పరుగులు. చెపాక్ పిచ్‌పై ఇది భారీ టార్గెట్. ఓపెనర్లు రచిన్ రవీంద్ర (27), రుతురాజ్ గైక్వాడ్ (42 నాటౌట్) ఛేదనను కాస్త సులభతరం చేశారు. రచిన్ రవీంద్ర పవర్‌ప్లేలో ఎదురుదాడి చేశాడు. రెండు సిక్సర్లు, ఓ ఫోర్‌తో మెరిశాడు. అశ్విన్ ఓవర్లో రచిన్ అవుటైనా.. డార్లీ మిచెల్ (22) దంచికొట్టాడు. నాలుగు బౌండరీలతో దండయాత్ర చేశాడు. దీంతో పవర్‌ప్లేలో 56 పరుగులు సాధించిన సూపర్‌కింగ్స్ విజయానికి గట్టి పునాది వేసుకుంది. ఓ ఎండ్‌లో సమయోచిత ఇన్నింగ్స్‌తో అదరగొట్టిన రుతురాజ్ గైక్వాడ్ ఆఖరు వరకు క్రీజులో అజేయంగా నిలిచాడు. మోయిన్ అలీ (10), రవీంద్ర జడేజా (5) నిరాశపరిచినా.. శివం దూబె (18), సమీర్ రిజ్వీ (15 నాటౌట్, 8 బంతుల్లో 3 ఫోర్లు) విజయంలో కీలక పాత్ర పోషించారు. రాయల్స్ బౌలర్లలో స్పిన్నర్ అశ్విన్ (2/35), చాహల్ (1/22) రాణించినా.. 18.2 ఓవర్లలోనే సూపర్‌కింగ్స్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. సీజన్లో ఏడో విజయంతో ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది.

సిమ్రన్‌జీత్ సూపర్ : రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్లను సూపర్‌కింగ్స్ పేసర్లు సిమ్రన్‌జీత్ సింగ్ (3/26), తుషార్ దేశ్‌పాండే (2/30) నిప్పులు చెరిగే స్పెల్స్‌తో కట్టడి చేశారు. విధ్వంసక ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (24), జోశ్ బట్లర్ (21) క్రీజులో నిలిచినా.. పవర్‌ప్లేలో రాజస్థాన్ 42 పరుగులే చేసింది. సిమ్రన్‌జీత్ వరుస ఓవర్లలో యశస్వి జైస్వాల్, జోశ్ బట్లర్‌ను సాగనంపాడు. కెప్టెన్ సంజు శాంసన్ (15) సైతం సిమ్రన్‌జీత్‌కు వికెట్ కోల్పోయాడు. రియాన్ పరాగ్ (47 నాటౌట్) క్లిష్ట తరుణంలో క్రీజులో నిలిచాడు. ధ్రువ్ జురెల్ (28)తో కలిసి ఇన్నింగ్స్‌కు ముందుకు నడిపించాడు. జురెల్ నిష్క్రమణ, శుభమ్ దూబె (0) నిరాశరపర్చటంతో రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 141 పరుగులు చేసింది.



రాణించిన రజత్

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్

బెంగళూర్ : రజత్ పాటిదార్ (52, 32 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు) జోరు కొనసాగించాడు. ధనాధన్ అర్థ సెంచరీలతో కదం తొక్కుతున్న రజత్ పాటిదార్ చిన్నస్వామి స్టేడియంలో ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌పై దండయాత్ర చేశాడు. విల్ జాక్స్ (41, 29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) సైతం రాణించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 187 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (27, 13 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు) పవర్‌ప్లేలో దంచికొట్టాడు. మూడు సిక్సర్లతో చెలరేగిన కోహ్లి..ఇషాంత్ శర్మకు వికెట్ కోల్పోయాడు. కెప్టెన్ డుప్లెసిస్ (6) నిరాశపరిచాడు. రజత్ పాటిదార్ (52) మరో అర్థ సెంచరీతో ఫామ్ కొనసాగించగా.. విల్ జాక్స్ వరుస వైఫల్యాలకు చెక్ పెట్టాడు. కామెరూన్ గ్రీన్ (32 నాటౌట్, 24 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు) డెత్ ఓవర్లలో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు మంచి స్కోరు అందించాడు. మహిపాల్ లామ్రోర్ (13), దినేశ్ కార్తీక్ (0), స్వప్నిల్ సింగ్ (0), కరణ్ శర్మ (6), మహ్మద్ సిరాజ్ (0) విఫలమయ్యారు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో ఖలీల్ అహ్మద్ (2/31), రసిక్ (2/23) రెండేసి వికెట్లతో రాణించారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886